# మిసిమి

మాస పత్రిక

నవంబర్ - 2002



వెల రూ. 8/-

## రవీంద్రనాథ్ జన్మదిన సంచిక



" నిర్దాక్షిణ్యంగా అణచివేయబడిన వ్యక్తిత్వం "

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**

సంపుటి 13 | నవంబరు 2002 | సంచిక 11

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయ సూచిక

సెక్సు, నగ్నతలు అశ్లీలాలా ? - అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి
లైంగికత : కొన్ని ఆలోచనలు - వి. చినవీరభద్రుడు
కళాపూర్ణోదయము – కామ ప్రవృత్తి - డా॥ యు. ఏ. నరసింహమూర్తి
ఫ్రాయిడ్ లైంగిక సిద్ధాంతాలు - అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి
'సెకండ్ సెక్స్' - బి. తిరుపతిరావు
సృష్టి చేసిన తప్పుకి సిలువమోస్తున్న స్త్రీ, పురుషులు - సి. ధర్మారావు
దైనందిన జీవితంలో సెక్సువాలిటీ - అంపశయ్య నవీన్
వాత్స్యాయనుడి కామ సూత్రములు – లైంగిక సంస్కృతి - కాత్యాయనీ విద్మహే
ఈ నాటికీ విలువ తగ్గని వాత్స్యాయన కామసూత్రం - గవిని వెంకట స్వామి
లోపభూయిష్టమైన జెండర్ – సెక్సువాలిటీ విధానం - అనిశెట్టి రజిత
పరపురుష సంపర్కం కలనైనా కరవాయె - కె. ఎస్. మంగళగౌరి
రుచి చూడని వారున్నారా? - బి. భాగ్య

విడిప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/- విదేశీయులకు $ 20

ముఖచిత్రం : **బంధిత స్త్రీ**

Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyd - 20. Ph. 7645536
E-mail : misimieditor@rediffmail.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# సెక్సు, నగ్నతలు అశ్లీలాలా?

– అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

అశ్లీలాన్ని ఆంగ్లంలో Obscanity అంటారు. దీనికి నిఘంటువు సమాజం ఆమోదించిన నీతి, సభ్యత, సంస్కార ప్రమాణాలను పాటించక జుగుప్స, రోత కలిగించేది అని అర్థం చెబుతుంది.

నగ్నత, సెక్సు - ఈ రెండింటిని అశ్లీలమనడం మనకు బాగా అలవాటైపోయింది. ఒకప్పుడు సెక్సు అనే పదాన్ని ఉచ్చరించడం పాపంగా పరిగణించేవారు. మిసిమి పత్రిక వ్యవస్థాపక సంపాదకులు ఆలపాటి రవీంద్రనాథ్ సెక్సు పదాన్ని ఉచ్చరించడానికి భయపడే రోజులలో - 1948లలో తాను నడిపిన జ్యోతి, రేరాణి పత్రికలలో ఎవలాక్ ఎలిసి రాసిన 'సెక్స్' గ్రంథ సంక్షిప్తానువాదాన్ని ప్రచురించి సాహసం చేశారు. ఆ రోజుల్లో కుటుంబ నియంత్రణ మీద వ్యాసం ప్రచురించి గవర్నమెంట్ 'కన్నెర్ర'కు గురయ్యాడు. రావూరి భరద్వాజ రాసిన 'అలవాటైన ప్రాణం' కథను జ్యోతిలో వేస్తే, ఆ కథ అశ్లీలమని తీర్పు చెప్పి రచయితకు రూ. 500/- జరిమానా వేశారు.

ఆ న్యాయమూర్తి దానిని ఏ ప్రమాణాలతో అశ్లీలమని తీర్పు ఇచ్చాడో మనకు తెలియదు. ప్రపంచంలో ఇలాంటి కేసులు చాలా జరిగాయి. డి. హెచ్ లారెన్స్ రాసిన 'లేడీ చాటర్లీస్ లవర్' నవలను మొదటిసారిగా పెంగ్విన్ పబ్లిషర్స్ ప్రచురించినప్పుడు, బ్రిటీషు ప్రభుత్వం దానిని నిషేధించింది. పబ్లిషర్ కోర్టుకెళ్ళాడు. ఇది 1958వ సంవత్సరం నాటి మాట. అక్కడ జడ్జి ఆ నవల అశ్లీలమవునా? కాదా? నిర్ణయించడానికి ఒక మంచి పద్ధతిని కనుక్కొన్నాడు. ఆయన సమాజంలోని వివిధ రంగాల నుంచి, వివిధ వృత్తుల నుంచి, వివిధ వయస్సుల వారిని అంటే ఆడ, మగ, యువతి, యువకుడు, వృద్ధుడు, వృద్ధురాలు, ఆచార్యుడు, విద్యార్థి, క్షురకుడు, చాకలి, ఇంజనీరు, డాక్టరు - ఇట్లా అనేక రకాల వాళ్ళను - ఎంపిక చేసి వారికి తలొక గది ఇచ్చి, ఒకరితో ఒకరు చర్చించుకొనే వీలు లేకుండా వారిచే చదివించి, వారి ప్రతిస్పందనలను రికార్డు చేసి, వాటి ఆధారంగా ఆ నవల అశ్లీలం కాదని తేల్చారు. అదే సమయంలో దానిని భారత దేశానికి ఎగుమతి చేశారు. ఇక్కడేమో అటువంటి పద్ధతి ఏదీ అనుసరించకుండా, జడ్జీ ఒక్కడే చదివి, అది అశ్లీలమనే నిర్ణయానికి వచ్చాడు.

ఈ కథ ఇలా ఉంటే, జేమ్స్ జాయిస్ రాసిన యులిసీస్ నవలను అమెరికా ప్రభుత్వం నిషేధించింది. దానిని అమెరికాలలో ప్రచురించిన రాండమ్ హౌస్ కోర్టుకెక్కింది. డిసెంబరు 6, 1933న న్యాయాధిపతి వూల్ సె.జె. ఆ నవల అశ్లీలం కాదని తీర్పు చెప్పాడు. ఆ తీర్పులో ఏది అశ్లీలమో ఏది కాదో చర్చించాడు. ఆ యులిసీస్ నవల అర్థం కాకపోయినా, ఆ తీర్పు కోసం ఆ నవలను చదువుతారు చాలమంది. ఆ తీర్పులో జడ్జి:

యులసీస్ నవల మొత్తం చదివాను, పూర్తిగా, అనేకసార్లు. నా ఖాళీ సమయాన్నంతా చదవడానికి వినియోగించాను. అది ఒక పట్టాన అర్థం కాదు. దానిని గురించి ఎంతోమంది రాశారు. అవన్నీ చదివాను. దానికి ఉపగ్రహాలని చెప్పదగిన పుస్తకాలు వచ్చాయి. వాటినీ చదివాను. ఆ పని నాకెంతో కష్టమైంది. అంత శ్రద్ధగా ఎందుకు చదవాల్సి వచ్చిందంటే సాహితీ ప్రపంచంలో దానికి ఉన్న పేరు అటువంటిది.

ఆ నవలను అశ్లీలమన్నారు. మామూలుగా చెప్పాలంటే, పోర్నోగ్రఫీ సంబంధం అన్నారు. పోర్నోగ్రఫీ అంటే కామోద్రేకాన్ని ఉద్దీపన చేసే విషయం - అది దృశ్యం కావచ్చు, అచ్చు అయిన పదం కావచ్చు. అంటే అశ్లీలత (Obscanity) ను ఉపయోగించుకోవడానికి రాసింది.

జాయిస్ దిగువ మధ్యతరగతి మనుషులను పాత్రలుగా ఎంచుకొన్నాడు. డబ్లిన్‌లో 1904లో జూన్ నెలలో ఒక రోజున - 24 గంటల్లో జరిగిన ఘటనలో 783 పుటలు - ఆక్రమించాయి. కామా విరామ బిందువులు లేకుండ 44 పుటలు ఆక్రమించిన ఏక వాక్యాలతో జాయిస్ కొత్త ప్రయోగం చేశాడు. చైతన్య యవనికి (Screen of consciousness) మీద సతతం మారే ముద్రలను చిత్రాలను - ఈ ముద్రలలో మనిషి దృష్టి క్షేత్రంలోని కేంద్రక (నాభి = focus) ముద్రలనే కాక, ఖండ ఛాయ (Penumbra) అంటే కేంద్రకానికి దూరంగా దృష్టి వలయంలో తారాడే (అస్పష్ట) చిత్రాలను - ఆ చిత్రాలు (ముద్రలు) కొన్ని ఇటీవలివి, కొన్ని ఎప్పటివో అచేతనంలో ఉన్నవాటిని సంసర్గం (association) తో వెలికి తెచ్చినవి - అన్నింటిని కలిపి రాశాడు. ఈ ముద్రలన్నీ కలిసి తన పాత్రలను ఎలా ప్రభావితం చేశాయో ప్రతిభావంతంగా చూపాడు. సినిమాలో అయితే మనకు వెనుకభూమి, ముందు భూమి స్పష్టంగా కనిపిస్తాయి. కానీ ఈ నవలలో అచేతనం నుంచి వచ్చే ముద్రలన్నీ మసక మసక (Blurr) గా కనిపిస్తాయి. జాయిస్ నిజాయితీతో రాసిన నవల కనుక ఎటువంటి 'మురికి' (Dirt Words) మాటలు వచ్చిన వాటిని వచ్చినట్లు రాశాడు. ఆయన టెక్నిక్‌కు అవి అవసరం. వాటిల్లో అశ్లీత ఏమీలేదు.

న్యాయ శాస్త్రం ప్రకారం అశ్లీలత అంటే లైంగిక ప్రబోదనలను కదిలించేది లేదా లైంగికాలోచనలకు దారి తీసేది. కనుక ఒక గ్రంథం అశ్లీలమవునా కాదా అనడానికి ఆ నవల, ఆ చిత్రం అలాంటి ఆలోచనలకు దారితీస్తున్నాయా అనే దాని మీద ఆధారపడి నిర్ణయించాలి. యులిసీస్ చదివినప్పుడు నాకలా అనిపించలేదు'' అన్నాడు.

యులసీస్ నవల మానవుల అంతరంగ జీవితం మీద ఒక చక్కని వాఖ్యానం.

ఇంతవరకు ఏది అశ్లీలమో కాదో ఎలా తేల్చాలో యులిసీస్ పరంగా చూశాము. కొంతమంది నగ్నతను అశ్లీలమంటారు. Studies in Nudityలో నగ్నతను శాస్త్రీయాధ్యయనం చేస్తారు. సౌందర్య శాస్త్రానుగుణంగా చేస్తారు.

బుద్ధునికి 32 మహా పురుష లక్షణాలున్నాయి. వాటిని అంగాంగ వర్ణనం చేస్తారు. ఆ వర్ణనలూ ఆయన రహస్యాంగాలనిపించదు. ఆయన శిల్పం చేయాలంటే అనుసరించాల్సిన కొలతలు అధ్యయనం చేస్తారు.

నగ్నతాధ్యాయనాలు ఉబుసుపోక చేయరు. ఆ అధ్యయనాలతో మహా శిల్పాలు, తయారీకి దారి తీయవచ్చు. ఏదైనా ఒక నగ్న చిత్రాన్ని చూస్తున్నప్పుడు అది చూసేవానిలో లైంగిక ప్రబోదనలు, లైంగికాలోచనలు రేపుతుందా అనేది ప్రశ్న. ప్రతి నగ్న చిత్రం అలా కాముక ప్రవృత్తి ప్రకోసింపచేయదు. అయితే నగ్న చిత్రాన్ని చూసేవాడు సంస్కారవంతుడై ఉండాలి. కళా, సౌందర్య రంగాలలో వ్యవసాయం చేసిన వాడై ఉండాలి. అసంస్కృత సామాన్యుని తీర్పు మనం అంగీకరించలేము.

పోతే అసలు విషయానికి వద్దాం. ఇలా నిషేధింపబడిన ఒక రంగాన్ని ఆ రోజుల్లోనే వెలుగులోకి తెచ్చిన రవీంద్రనాథ్ జన్మదినం ఈ నెల నాలుగు. ఆయన స్ఫూర్తికి అనుగుణంగానే ఈ సంచికను సెక్సువాలిటీమీద ప్రత్యేక సంచిక వెలువరిస్తున్నాము. ప్రత్యాదేశాలు తొలగిన ముసుగు వీడిన నేటి ప్రపంచం మా యీ యత్నాన్ని హర్షిస్తుందనే ఆశిస్తున్నాం.

# లైంగికత: కొన్ని ఆలోచనలు

- వి. చినవీరభద్రుడు

లైంగికత అంటే ఏమిటి? నా జీవితంలో ఏ అంశానికీ ఇవ్వనంత కాలాన్ని నేను ఈ అంశాన్ని అర్థం చేసుకోవడానికే వెచ్చించాను. బహుశా యూరోప్ కూడా అంతే అనాలి. కానీ ప్రాచ్య ప్రపంచం, ముఖ్యంగా భారతీయ సంస్కృతి ఈ అంశాన్ని దానికి అర్హమైన దానికన్నా ఎక్కువ స్థానంలో ఉంచి చూడాలనుకోలేదు. కానీ భారతీయ సాహిత్యం, సాంస్కృతిక వ్యక్తీకరణల్లో ఉండే వైరుధ్యాల్ని మనం అర్థం చేసుకోవాలనుకుంటే బహుశా యూరోప్ వెచ్చించిన దానికన్నా ఎక్కువ సమయమే మనం లైంగికత గురించి అర్థం చేసుకోవడానికి ఖర్చు చెయ్యవలసి ఉంటుందేమో?

నా పసితనంలో అలాగే యవ్వనంలో, ఇప్పుడు గృహస్థ జీవితంలో కూడా లైంగికత గురించిన ముఖ్యమైన కొన్ని ప్రశ్నలు నాకు సమాధాన రహితంగానే ఉండిపోయాయి. వీటికి సమాధానాలు నా సంస్కృతి గానీ, వైజ్ఞానిక శాస్త్రాలు గానీ ఇవ్వలేకపోయాయనే అనాలి. ఆ ప్రశ్నల్ని ఇలా పేర్కొనవచ్చు.

- లైంగికత అంటే ఏమిటి?
- జంతువుల లైంగిక ప్రవర్తన కన్నా మానవుల లైంగిక ప్రవర్తన ఏ విధంగా ప్రత్యేకం?
- మానవ అనుభవంలో లైంగిక అనుభవం ఏ మేరకు తోటి మనిషితో తాదాత్మ్యాన్నిస్తుంది?
- అసలు మనిషి పూర్తిగా ఒంటరేనా? అయినట్లయితే లైంగికానుభవం అతని మానసిక ఒంటరితనానికి ఏ మేరకు పరిహారం కాగలదు?
- స్త్రీ పురుష సహానుభవం తప్పనిసరిగా లైంగికానుభవానికి దారితీస్తుందా?
- అసలు లైంగికానుభవానికి స్త్రీ పురుషులనే మిథునం అవసరమా? ఇద్దరు పురుషులూ లేదా ఇద్దరు స్త్రీలు మిథునం కాలేరా? ఇద్దరు స్వతంత్ర స్త్రీ పురుషుల మధ్య, ఇద్దరు స్వతంత్ర స్త్రీల మధ్య, ఇద్దరు స్వతంత్ర పురుషుల మధ్య సాధ్యపడే అనుభవం ఒక్కలాంటిదేనా?
- సనాతన మతాలు చెప్పినట్లుగా లైంగికానుభవం కేవలం ప్రత్యుత్పత్తి బాధ్యతేనా? అందులో ఆనందమేమీ లేదా? ఇప్పుడు మనం ఉంటుందని భావిస్తున్న లైంగికానుభవం తోటి మనిషిని, లేదా తన భాగస్వామిని ఎంతో కొంత అణచి వుంచడం ద్వారా కలుగుతున్న అస్పష్ట అనుభవమేనా?
- పూర్తి స్పష్టతలో స్త్రీ పురుష భేదం ఉండదా?

ఈ ప్రశ్నల జాబితాకి అంతు లేదు. మనం కేవలం సనాతన భారతీయ సంస్కృతి ఉగ్గు పాలు తాగి మాత్రమే పెరిగి ఉంటే ఈ ప్రశ్నలతో మనకు పనిలేకపోయి ఉండేది. కానీ మన అనుభవం ఏదో ఒక మేరకు పాశ్చాత్యీకరణకు గురయ్యింది కాబట్టి పాశ్చాత్య ప్రపంచం ఎదుర్కొన్న ప్రశ్నలు ఏదో ఒక మేరకు మనం కూడా ఎదుర్కోక తప్పదు.

---

వి. చినవీరభద్రుడు, హైదరాబాదు, గిరిజన సంక్షేమ శాఖలో ప్రత్యేక అధికారిగా పని చేస్తున్నారు.

పాశ్చాత్య ప్రపంచం నమ్మిందాని ప్రకారం ఆదిలో స్త్రీ పురుషులిద్దరూ లింగ జ్ఞానం లేకుండానే అన్యోన్యంగా ఈడెన్ ఉద్యానంలో కలిసి జీవించారు. కాని 'ఆది పాపం' వాళ్ళకి లింగ జ్ఞానాన్నివ్వడంతో వాళ్ళు ఆకలిదప్పులకీ, మర్త్యత్వానికీ గురయ్యారు. వాళ్ళ లింగ విభేదం వాళ్ళ జైవిక విధిగా మారింది. స్త్రీ దేహం, పురుష దేహం రెండు విడి విడి దేహాలుగా బయలాజికల్‌గానే ఒక భేదంతో నిర్మితమయ్యాయి. ఈ విభేదాన్నే మనం ఇంగ్లీషులో సెక్స్ అనీ, తెలుగులో లింగం అనీ అంటున్నాం.

తరువాత తరువాత రోజుల్లో పాశ్చాత్య ప్రపంచానికి కలిగిన ఎరుక ఏమిటంటే లింగమనేది బయలాజికల్ నిర్మాణం అయినప్పటికీ ఆ వ్యత్యాసంలోంచి సామాజిక లింగ స్వభావం రూపొందింది అని. అంటే ప్రాకృతికంగా సహజసిద్ధమైన లింగ భేదాన్ని ఆసరాగా చేసుకుని పురుష స్వామ్యం, పితృ స్వామ్యం సామాజిక లింగ భేదాన్ని సృష్టించాయని. ఆ సామాజిక లింగ భేదాన్ని ఇంగ్లీషులో జెండర్ అంటారు. మనం దాన్ని తెలుగులో సామాజిక లింగ స్వభావం అనవచ్చు. ఈ ఆలోచనలోంచే ఫెమినిజం రూపొందింది. ఫెమినిజం మన సాంస్కృతిక వ్యక్తీకరణల్లో, మన సామాజిక సంబంధాల్లో అంతర్లీనంగా వృద్ధి చెందుతున్న ఈ సామాజిక వ్యత్యాసాన్ని పసిగట్టడం ప్రధానంగా పెట్టుకుంది. అందులో సాంప్రదాయిక ఫెమినిజం, విప్లవాత్మక ఫెమినిజం రెండూ కూడా ప్రాకృతిక స్త్రీ లింగం ఆసరాగానే స్త్రీలని గుర్తించి వాళ్ళకి సామాజికంగా కలుగుతున్న అన్యాయాన్ని ఎత్తి చూపడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు.

ప్రముఖ ఫ్రెంచ్ తత్త్వవేత్త ఫోకాల్ట్ 'హిస్టరీ ఆఫ్ సెక్సువాలిటీ' (1976) రాసిందాకా ఈ ఆలోచన అడ్డులేకుండా కొనసాగుతూ వచ్చింది. కానీ ఫోకాల్ట్ సాంప్రదాయికమైన ఈ ఆలోచనని ప్రశ్నించాడు. అతడు సెక్స్, సెక్సువాలిటీ, సెక్సువల్ బిహేవియర్‌ల మధ్య తేడా చూడాలన్నాడు. అతని దృష్టిలో సెక్సువాలిటీ అనేది ఒక సామాజిక నిర్మాణం. అది సాంస్కృతిక అంశాల మీంచి నిర్మితమయ్యే ఒక కల్పన. అతను చెప్పేదేమంటే ప్రాచ్య ప్రపంచంలో, చివరికి రోమన్ సామ్రాజ్యంలో కూడా సెక్స్ అనేది ఒక కళ, ప్రత్యేక అనుభవం, అది రహస్యంగా ఎందుకుండాలంటే అది ఎవరికి వారికే పరిమితమయిన వ్యక్తిగత విషయం కాబట్టి. అక్కడ రహస్యం అనేది నిందార్థకమైన మాట కాదు, ఒక రకంగా పవిత్రమైన అన్న అర్థాన్ని కూడా దానికివ్వవచ్చు. కానీ పాశ్చాత్య ప్రపంచంలో సెక్స్ అనేది ఆది నుంచీ యూదీయ-క్రైస్తవ ధార్మిక భావజాలం వల్ల ఒక ఒప్పుకోలుగా మాత్రమే చెప్పుకోవాల్సిన అనుభవంగా గుర్తించబడింది. మొదట్లో క్రైస్తవం దాన్ని కన్ఫెషన్ రూపంలో అనుమతిస్తే పదిహేడవ శతాబ్ది నుంచీ అది సైన్సు రూపాన్ని ధరించిదంటాడు ఫోకాల్ట్. సైకో అనాలిసిస్ ఇటువంటి పరిణామమే. రెండు రూపాల్లోనూ కూడా, అంటే కన్ఫెషన్‌గా గానీ, లేదా సైన్సుగా గానీ, అది ఒక డిస్కోర్సుగానే చూడబడింది. అంటే సెక్సు గురించిన సత్యాన్ని తెలుసుకోవాలన్న జిజ్ఞాస దాని గురించిన ఎడతెగని చర్చగా మారిందని ఆయన పసిగట్టాడు. ఆసియా దేశాల్లో ఇది సాధ్యం కాదు. ఎందుకంటే అక్కడ సెక్సు అనుభవైకవేద్యంగానే భావించబడింది తప్ప చర్చనీయాంశంగా చూడబడలేదు కనుక.

ఎప్పుడయితే సెక్సు ఒక చర్చనీయాంశం అయిందో అప్పుడు కొన్ని రకాల లైంగిక ప్రవర్తనలు సాధారణమైనవిగానూ, కొన్ని అసాధారణమైనవిగానూ భావించబడ్డాయి. యుక్త వయస్కులైన ఒక స్త్రీ, ఒక పురుషుడి మధ్య వారి జననేంద్రియాల మధ్య జరిగే రతి మాత్రమే సాధారణ లైంగిక ప్రవర్తనగా భావించబడి, తక్కిన అన్ని రకాల ప్రవర్తనలూ అసాధారణంగా భావించబడ్డాయి. పిల్లల్లో

ఉండే లైంగిక ప్రవర్తన, స్వలింగ సంపర్కాలూ, జననేంద్రియాలకు బయట జరిగే రతీ, ఖైదీలు, సైనికులూ, మానసిక రోగులూ మొదలైన వారిలో కనవచ్చే రకరకాల లైంగిక ప్రవర్తనలన్నీ అసాధారణ ప్రవర్తనలుగా భావించబడ్డాయి. అవి అసాధారణం కాబట్టి అస్పష్టం అనే నిర్ణయం కూడా తప్పనిసరిగా వచ్చి చేరుతుంది. ఈ భావాలు ఆధునిక వైద్య పరిజ్ఞానం చేత కొన్ని కొత్త నైతిక సూత్రాల్ని ప్రతిపాదించేలా చేసాయి. అటువంటి కొత్త సూత్రాలుగా ఫోకాల్ట్ ఈ నాలుగింటిని పేర్కొన్నాడు.

- స్త్రీ దేహం గర్భాశయం వల్లా, పిల్లల్ని కనగలిగే సామర్థ్యం వల్లా సెక్సువలైజ్ చెయ్యబడటం హిస్టీరియా అనేది సెక్సు సంబంధ సమస్యల వల్ల వస్తుందని తీర్మానించడం,
- పిల్లల లైంగికత పై విద్యాసంబంధమైన నిఘా, పిల్లల్ని హస్త ప్రయోగం నుంచీ, ఇతర రకాలైన లైంగిక వ్యక్తీకరణల నుంచీ కాపాడుకోవాలనుకోవడం,
- ప్రత్యుత్పత్తిని సాంఘికీకరించడం, ప్రత్యుత్పత్తి సాధనంగా జనాభా అధ్యయనాల్లో భాగంగా లైంగికతని అధ్యయనం చెయ్యడం,
- యుక్త వయస్కుల లైంగిక ప్రవర్తనని అధ్యయనం చెయ్యడం, అందులో భాగంగా 'అసాధారణం' అనిపించిన ప్రవర్తనలన్నిటినీ ప్రమాదాలుగా భావించడం.

ఈ నైతిక సూత్రాల ప్రయోజనం ఏమిటని ప్రశ్నించి ఫోకాల్ట్ ఇలా రాస్తున్నాడు: ''ఈ వ్యూహాలన్నీ దేని కోసం? లైంగికతకి వ్యతిరేకంగా సంఘర్షించడమా? లేదా లైంగికతని అదుపు చెయ్యడానికా?... నిజం చెప్పాలంటే ఈ ప్రయత్నాలన్నీ లైంగికతని రూపొందించడానికే అనాలి. ప్రాకృతికంగా కనవచ్చే ఒక వ్యత్యాసాన్ని బలంతో అదుపు చెయ్యడంగా కానీ లేదా మనకు ఇంతదాకా అగోచరంగా ఉన్న విజ్ఞానాన్ని దేన్నో నెమ్మదిగా తెలుసుకోవడంగా గానీ దాన్ని పొరపడకూడదు. లైంగికత అనేది ఒక చారిత్రక చర్యకి మనం ఇవ్వాల్సిన పేరు మాత్రమే''.

ఈ మాటలు రాయడంతో ఫోకాల్ట్ లైంగికతని ప్రాకృతికమైన లైంగిక ప్రవర్తన నుంచి వేరు పరిచి దాన్నొక సామాజిక - సాంస్కృతిక నిర్మాణంగా మార్చేసాడు. ఈ వెలుగులో లైంగికత గురించి మనం మాట్లాడే ఏ మాటలయినా మన దేశ - కాల సందర్భాన్ని బట్టి పునర్విమర్శించుకోకుండా ఇంకెంత కాలం మాట్లాడలేం.

ఫోకాల్ట్ ఆలోచనని జుడిత్ బట్లర్ ముందుకు తీసుకువెళ్ళింది. ఆమె రచన 'జెండర్ ట్రబుల్' (1990)లో ఈ అంశాన్ని మరింత లోతుగా చర్చించింది. ఆమె అనేదేమంటే ఫెమినిజం కూడా లైంగికతని ఒక సామాజిక నిర్మాణంగా భావించకుండా దాని పరిమితుల్ని గుర్తించకుండానే చర్చకి పూనుకుందనీ అందువల్ల అది అసంపూర్తి చర్చగానే పరిణమిస్తోందనీ. ఆమె ఇంకా ఏమందంటే లైంగికతని స్త్రీ పురుష ప్రాకృతిక లింగ భేదం ఆధారంగానే నిర్ధారించడం వల్ల ప్రాకృతిక భేదాన్ని సామాజిక భేదంగా కొనసాగిస్తున్నట్టే అవుతున్నదని. అంటే మనుషుల్ని జెండర్ ఆధారంగా కూడా స్త్రీ పురుషులుగానే గుర్తించవలసి వస్తోంది తప్ప మరొక రకంగా కాదు. ఏ మనిషి అయినా, స్త్రీ గానీ పురుషుడు గానీ తన ముందున్న అనంత సంభావ్యతల్లో ఏదో ఒక దాన్ని ఎంచుకోనివ్వకుండా ఫెమినిజం కూడా మనుషుల్ని రెండుగా విడదీసి చూస్తోందని బట్లర్ ఆరోపణ. అలా కాకుండా జెండర్ అనేది సందర్భ స్పష్టమైన పరిస్థితిగా భావించవలసి ఉంటుందని ఆమె అంటుంది. ఉదాహరణకి ఒక నల్లజాతి స్త్రీ సమస్యని ఒక యూరోపియన్ స్త్రీ అర్థం చేసుకోగలిగినదానికన్నా

మరొక నల్లజాతి సహచరుడు ఎక్కువ అర్థం చేసుకోగలిగే సంభావ్యత ఉండవచ్చు. ఇక్కడ జెండర్ సరళ రూపంలో మనకి అర్థమయ్యే అంశం కాదు. ఆ నల్లజాతి సహచరుడికీ, ఆ నల్ల జాతి స్త్రీకీ మధ్య సంబంధాల్లో కూడా జెండర్ ఉండవచ్చు. కానీ వారిద్దరూ కూడా తెల్లజాతి స్త్రీ పురుషుల్తో ఏర్పడ్డ తమ సంబంధాల్లో జెండర్‌ని సంయుక్తంగా అనుభవంలోకి తెచ్చుకుంటారని కూడా మనం గుర్తించాలి. బట్లర్ దీన్ని ఇలా స్పష్టంగా చెప్పింది: ''జెండర్ వ్యక్తీకరణల వెనుక ముందే నిర్ధారితమైన జెండర్ గుర్తింపు అంటూ ఏమీ లేదు... నిజానికి ఆ గుర్తింపు అంటూ ఏదన్నా ఉంటే అది మనం దాని ఫలితాలుగా ఇంతదాకా భావిస్తూ వస్తున్న దాని 'వ్యక్తీకరణల' వల్ల ఏర్పడేదే''. అంటే స్పష్టంగా చెప్పాలంటే జెండర్ అనేది సందర్భానుసారంగా నీ ప్రవర్తనలో, నీ వ్యక్తీకరణలో ఏర్పడేదే తప్ప దానికదే శాశ్వతంగా నెలకొని ఉండే నిశ్చల లక్షణం కాదు.

అయితే ఫెమినిజం అవగాహనలో ఇప్పుడున్న పరిమితుల్ని ఎత్తి చూపడం ఫెమినిజంని తక్కువ చేయడం గానీ రద్దు చేయడం గానీ కాదు. పైగా అది దాని మానవీయ పార్శ్వాన్ని బలోపేతం చెయ్యడమేనని గుర్తించాలి.

లైంగికత అనేది సందర్భానుగుణమైన ఒక సామాజిక నిర్మాణమని ఫోకాల్ట్ చెప్పిందాన్ని, జెండర్ అనేది సందర్భానుగుణమైన ఒక సామాజిక వ్యక్తీకరణ అని బట్లర్ చెప్పిందాంతో పోల్చి చూసినప్పుడు మనకు తెలిసేదేమిటి?

లైంగికత అనేది మనకు మన సాంస్కృతిక - సామాజిక సందర్భాన్ని దాటి అర్థమయ్యే అంశం కాదు. మన సాంస్కృతిక - సామాజిక ప్రవర్తన తప్పనిసరిగా మన రాజకీయ సంబంధాల్ని ప్రభావితం చేస్తుంది కాబట్టి మన రాజకీయ విశ్వాసాలకీ, మన లైంగిక విశ్వాసాలకీ పరస్పర సంబంధం ఉంది. ప్రతి వ్యత్యాసమూ రాజకీయ స్వభావాన్ని కలిగి ఉంటుంది కాబట్టి స్త్రీ పురుష వ్యత్యాసం అన్నిటికన్నా ముందు రాజకీయ స్వభావాన్ని సంతరించుకుంటుంది. పురుష దేహం కన్నా స్త్రీ దేహం తేడాగా ఉండటం అనేది ఒక ప్రాకృతిక నిర్ధారణతో ఆగకుండా పితృస్వామ్యం అనే రాజకీయ రూపాన్ని ధరిస్తుంది. అటువంటి భేదాలే రాజకీయ బలానికి, అణచివేతకీ మద్దతు నిచ్చేవి అనుకుంటే నల్ల జాతి వాళ్ళని తెల్లజాతి వాళ్ళు పరిపాలించాలన్న సిద్ధాంతం వెనుక వున్నది అటువంటి లైంగిక విశ్వాసమే.

లైంగికత గురించి మనం మాట్లాడవలసి వస్తున్నదంటే దాని వెనుక గల సామాజిక సందర్భాన్ని మరింత లోతుగా అధ్యయనం చెయ్యడం మొదటి అవసరం. లైంగికత స్త్రీ - పురుష సహజమా లేక సందర్భనిష్ఠమా అన్నది తేల్చుకోవాలి. నిజమైన స్వాతంత్ర్యం సిద్ధించిన దశలో ( రాజకీయ స్వాతంత్ర్యం మాత్రమే కాదు, భావ స్వాతంత్ర్యం కూడా) స్త్రీ - పురుష భేదానికి ( ప్రాకృతిక అలాగే సామాజిక) అతీతంగా ఇద్దరు మానవుల మధ్య ఎటువంటి లైంగిక ప్రవర్తన ఉంటుంది? దాన్ని ఎటువంటి లైంగికతగా గుర్తించవచ్చు? ఆ లైంగిక ప్రవర్తన ( అటువంటిదంటూ అప్పుడు కూడా ఉంటే) వాళ్ళకి ఎటువంటి ఆనందాన్నిస్తుంది? ఆ ఆనందం ఇరువురికీ సమానంగా ఉంటుందా? అసలు సమానంగా ఉండాలన్న షరతు అవసరముంటుందా?...

లైంగికత గురించిన చర్చ అనివార్యంగా మానవ స్వాతంత్ర్యం గురించీ, ఇద్దరు స్వేచ్ఛాపరుల మధ్య సహజీవనం గురించీ చర్చించడంగా పరిణమించడం సహజమే కనుక ఆ చర్చ మరింత బలపడాలి, యూరోప్‌లోనే కాదు, ఇక్కడ కూడా.

# కళాపూర్ణోదయము - కామ ప్రవృత్తి

- డా॥ యు. ఏ. నరసింహమూర్తి

ప్రాచీన సాహిత్యంలో శృంగారానికి గణనీయమైన స్థానం ఉంది. శృంగార రస పోషణలో తెలుగు కవులు అనేకులు సంస్కృత కవుల మార్గంలో నడచారు. పింగళి సూరన మాత్రం అందరిలా కాకుండా ఈ విషయంలో కొంత విలక్షణతను చూపించేడు. కళా పూర్ణోదయ రచనలో ''అత్య పూర్వకథా సంవిధాన వైచిత్రి'', ''పుణ్య వస్తువర్ణన'' అనే అంశాలతో పాటు ఆయన దృష్టి తన ప్రబంధాన్ని ''శృంగార రసప్రాయం''గా తీర్చిదిద్దడం మీద నిలిచింది. ''శృంగార రస పూర్ణము''గా అనిగాని ''శృంగార రస మహితము''గా అనిగాని, ఇంకొక రీతిగా గాని అనకుండా ''శృంగార రస ప్రాయం''గా అనడంలో సూరన హృదయం ఏమిటి? తన కావ్యంలో ఆద్యంతం శృంగార రసమే ఉన్నట్లుగా కనిపించేలా చేసి అపూర్వతకు ఫలితంగా సిద్ధించే అద్భుతరసాన్ని సాధించడం ఆయన హృదయం. ఆశ్చర్యము (wonder) అద్భుతము (surprise) రెండూ భిన్నమైనవి. అనూహ్యత ఆశ్చర్యానికి కారణం. అపూర్వత అద్భుతత్వాన్ని కలిగిస్తుంది. కవితా శైలిలలోగాని, వ్యక్తిత్వ చిత్రణలలో గాని, సంప్రదాయంలో గాని ఇతర విషయాలలో గాని పారం పరీణంగా అనుసరింపబడుతూన్న నియమ నిబంధనలను సాహసోపేతంగా అతిక్రమిస్తే అపూర్వత సిద్ధిస్తుంది. దాని ఫలితంగా అద్భుత రస నిర్వహణం జరుగుతుంది. సూరన ''సారవత్సాహిత్య సౌమనస్యము'' లెరిగిన వాడు. అటువంటి వారి అతిక్రమణలు శోభిస్తాయి. సూరన శృంగార పరంగా తన విపరీత ప్రవృత్తిని ప్రదర్శిస్తూనే ఔచిత్య భంగం లేకుండా నిర్వహించగలిగేడు.

లోకంలో చాలామంది కవులు దివ్య శృంగారాన్ని వర్ణించేరు. సూరన ఎవరూ వర్ణించని దివ్యులను తన శృంగార పోషణ కాలంబనంగా గ్రహింపదలచి సరస్వతీ చతుర్ముఖుల ప్రణయాన్ని తన ప్రబంధానికి ఆధారభూమిగా గ్రహించేడు. ఇది నవ్యతగాని, విలక్షణతగ్గాని కావచ్చునుగాని ఇందులో విపరీత ప్రవృత్తి ఏమిటుందని ప్రశ్న కలుగుతుంది. సమాధానం ఇలా గుంది?

''అంతట నంతకంతకు నిరంతరమై తనరారు, మారుదు
ర్ధాంతతఁ గాంతఁ బాన్పునకు చేర్చెను, దన్మధురాధరామృతా
క్రాంతి రసోద్ధతిన్ దన మొగంబులు నాల్గును నొక్కమాటే య
త్యంతముఁ దత్తఱిల్లగఁ దదాననముం దనకై మరల్చుచున్. 5. 16.

బ్రహ్మ మన్మథుని ధాకకు తాళలేక సరస్వతిని శయ్యకు దార్చి తత్తరిల్లు తూన్న నాలుగు ముఖాలతో ఆమెను ముద్దు పెట్టుకోదలచుకున్నాడట. సూరనే ఇది రసోద్ధతి అని కంఠోక్తిగా చెప్పేడు.

---

డా॥ యు. ఏ. నరసింహమూర్తి, విజయనగరం, మహారాజా కళాశాలలో తెలుగు శాఖాధ్యక్షునిగా పదవీ విరమణ చేసి, అక్కడే యు. జి. సి. ఎమిరిటస్ రీసెర్చి ఫెలోగా ఉంటున్నారు.

సూరనకు ముందు ఎన్ని కావ్యాలు పుట్టేయి. ఎక్కడైనా ఇలాంటి వింత కనిపించిందా? లేదని ఆయనే చెప్పేడు.

''ఆ లీలలకు నవ్వి'' మేలు మే! లెంతయు
నీ వింత లన్యాయ మింత గలదె!
మీ మొగంబులు నాల్గు నీ మాడ్కి నువ్విళ్లు
లూరిన నేకాస్య నొకతె నేను
జాలుదునే! యివి చాలించెదరా! మఱి
యేమైనఁ గలదా!'' యంచా మృగాక్షి
మెడ బిగించుచు, నించుకెడఁగ వక్త్రము నిల్పి
యధరంబునకుఁ బాణి యడ్డ మిడుచు

మొలక నగవును గోపంబుఁ జెలువుఁ జిలుకు
తళుకుఁ జూపులఁ జూపులో తర్జనముల
చకిత భ్రూలతా తాండవంబుల సిరుల
మిగులఁ గరగించెఁ బ్రియుమది మెఱయు మదిని. 5 - 18.

పురుషుడు రసోద్ధతిని ప్రదర్శించేటప్పుడు సహజ లజ్జావతి యైన స్త్రీ అతని నెలా వారిస్తుందో, ఎలా తిరిగి రెచ్చగొడుతుందో తెలుగు పలుకుబడిలోని జీవాన్నంతటినీ కుమ్మరించి ఇంతటి సహజౌచిత్యాన్ని మెరిపిస్తూ ''పలుకనేర్చుట'', ''బహుతపః ఫలము'' అని చెప్పవచ్చును. ఈ తీరుగా సాగిన సరస్వతీ చతుర్ముఖుల ప్రణయ చిత్రణకు గల ప్రేరణ ఏమిటి? అది బహు పురుష రతి అని చెప్పాలి. ఒక స్త్రీ ఏకకాలంలో నలుగురు పురుషులతో శృంగార వ్యాపారాన్ని నిర్వహిస్తే ఎలా ఉంటుందో అనే విపరీత కామ ప్రవృత్తికి సంబంధించిన ఊహ ఈ కల్పనకు ప్రేరణ నిచ్చింది. ఇది పాశవిక ప్రవృత్తి కాదా? సూరన ఇలా రాయ వచ్చునా? అనే శంక కలుగుతుంది. అది పాశవికమో! కాదో! విపరీత ప్రవృత్తి గల మానవుల కిలాంటి ఊహలు కలగడం సహజం; కామ శాస్త్ర సమ్మతం. ఐనా కావ్యంలో నాల్గు ముఖాలున్న ఒకే పురుషుడు ఉండడంతో అనౌచిత్య ప్రవృత్తికి ఆస్కారం లేదు. వాణీ చతుర్ముఖుల ప్రణయం ఇలా ఆరంభమై మణిత ధ్వనికి కారణమై తరువాత కథనంతటినీ నడిపించింది. ఇలాగే ఒక పురుషుడు ఒకే సమయంలో ఇద్దరు ముగ్గురు స్త్రీలతో వినోదించడమనే ఊహ కూడా సూరనకు కలిగింది. భ్రాతి ప్రహసనంలో నారదుడు నలకూబరునితో ''ఇదియ నీ తోడ క్రీడింపగా తనమేనొక్కటి చాలదంచుఁ గడఁకన్ ద్వైరూప్యమున్ దాల్చెనో'' (3-212) అని పలుకుట. ఇది కూడా విపరీత కామ ప్రవృత్తిని తెలియ జేస్తోంది. కావ్యారంభంలో సామాన్య నాయికయైన కలభాషిణి 'కటారికత్తెయై విటాళినిట్టటు' చేసినట్లుగా సూరన వర్ణించేడు. ఒక స్త్రీ పొందును కోరే పురుషు లనేకులు ఉన్మత్తుల వడమనే కామావస్థను సూరన ఇక్కడ ఔచిత్యం చెడని రీతిగా వర్ణించేడు.

మణికంధరుడు గంధర్వుడు. దివ్యాంగనల శృంగార లీల లెన్నింటినో చూసినవాడు. కాని అతడు స్వర్గం నుండి నేలకు దిగివస్తూ ''కొమరుం బ్రాయపు గబ్బిగుబ్బెత' లను చూసి ''నాకమృగీనేత్ర' లను కాదన్నాడు. అతనికి తావలచింది రంభ అయింది. కలభాషిణి నారద మణికంధరుల ప్రసంగమంతా విని మణికంధరుని మెచ్చికోలును పట్టించు కోకుండా ''నలకూబరుని రూపలావణ్యాది సౌభాగ్యంబులకు మిక్కిలి మెచ్చినది.'' అందరూ తన వెంట వెంపర్లాడుతూ ఉంటే తాను వేరొకడి వెంట పడడం ఇక్కడి విపరీత ప్రవృత్తి. లోకంలో ఆడవాళ్లలో ఇలాంటి విలక్షణ ప్రవృత్తి కొంత ఉండటం ఇక్కడ ఔచిత్యానికి కారణ మౌతూంది.

కామ ప్రవృత్తిలోని ఇంకొక తీరును గూర్చి కూడా సూరన సూటిగా చెప్పేడు. ''ఈ రంభయును వీఁడు నేవేళయును రతిక్రీడా పరాయణుల్.... ఒక్కొక ప్రేమ చొప్పిది యుర్విఁగలదు'' (1-90) ఇక్కడ ''ఏ వేళయును'' అని సముచ్చయాన్ని వాడడంతో సర్వకాల సర్వావస్థలలోను రంభా నలకూబరులు రతిక్రీడా పరాయణులుగా ఉంటారని చెప్తూ లోకంలో ఇలాంటి వాళ్లు కొంతమంది ఉంటారని స్పష్టంగా చెప్పేడు. అంటే తాను చెప్పే ప్రతి అంశానికి లోకమే ప్రమాణమని, లోకాన్ననుసరించే తాను ఔచిత్య పాలన చేస్తానని సూరన ఇక్కడ భంగ్యంతరంగా చెప్తున్నాడు.

మణికంధరుడు తీర్థయాత్ర చేస్తూ ''మిక్కుటంబగు పెక్కువ నుక్కు మిగులు జిక్కువల చక్కఁదనంబును వెక్కిరించు నిరుత్తరీయ వర్తు లోత్తుంగ రంగత్కుచ యుగంబుల, సరస సల్లాపంబు లాడం జేసిన తెఱంగును గానుపింపఁ జరకల నిడిన కనత్కనక కలశంబుల తోడఁ బొలుపారుచు నీరాటరేవున, తీవి నెఱపు ద్రావిడ యువతీ వితతుల యతుల చతురిమ పరిమళిత లలిత వచన రచన రుచులు గొనవలని, తెలిసియుం దెరువడుగు తెరువరులం గూడుకొని పురంబు ప్రవేశించె'' నట! ఇక్కడ విష్ణు భక్తుడు, తీర్థయాత్రా వ్రతశీలుడు అయిన మణికంధరుడు ద్రావిడ స్త్రీల మాట కారితనం మీద మనసుపుట్టి దారి అడిగే నెపంతో వారి వెంటబడినట్లు వర్ణించడం ఉచితమా? అని ప్రశ్నించేరు మల్లాది వారు. ఇక్కడ తెలిసీ తోవ అడిగేవారు తెరువరులుగాని మణికంధరుడు కాడు. కాబట్టి ఔచిత్య శంకకు అవకాశమే లేదు. కామ ప్రవృత్తిలో వాచారతి అనే భేదాన్ని ప్రదర్శించడానికి సూరన ఈ సన్నివేశాన్ని ఉపయోగించుకున్నాడు. కోరిన వారితో ఏదో మిష కల్పించుకుని మాటలాడుతూ కామోపశమనాన్ని కలిగించుకునే వారిని చూస్తూనే ఉంటాం కదా!

కళాపూర్ణోదయం రెండవ ఆశ్వాసంలో మూడు పద్యాలలో (169, 170, 171) దాంపత్య శృంగారంలోని ఇంకొక విశేషాన్ని సూరన వర్ణించేడు. అది అంతకు ముందు లేనిది, అత్యంత సహజమైనది. శ్రీకృష్ణుడు పారిజాతాన్ని ద్వారకకు తెచ్చేటప్పుడు ఆ చెట్టు మీది పక్షులన్నీ దానితో పాటు ద్వారకకు వచ్చి తిరిగి నందన వనానికి చేరుకున్నాయి. అందులో ప్రసవానికి సిద్ధంగా ఉన్న ఒక ఆడ చిలుక ఎగురలేక పారిజాతంతో పాటు ద్వారకలోనే ఉన్నది. అది ప్రసవించి ఆ పిల్లలు పెద్దయ్యేదాకా

ఆ ఆడచిల్కని తిరిగి నందనోద్యానానికి తీసుకుని పోవడానికి మగ చిలుకకు వీలు కాలేదు. ఆ తర్వాత ఎన్నో సార్లు మన నందన వనానికి పోదాం రమ్మని ఆడచిలకని అడిగింది. ఆడ చిలుక 'అక్కడకంటె ఇక్కడే బాగుంది నేనురాను' పొమ్మంది. నా బంధువులంతా నందనవనంలో ఉన్నారు వారిని విడచి నేనురాలేనని మగ చిలుక మొరాయించింది. ఇప్పుడు వారికి దాంపత్య సుఖం ఎలా లభిస్తుంది? అందుకని మగ చిలుక దిన దినం స్వర్గానికి ద్వారకకు రాక పోకలు కొనసాగించింది. ఇది సూరన చెప్పిన కథ ఇందులోని చిలుకలు చిలుకలు కావు, మనుష్యులే. కవులెందరు లేరు, నాటికి నేటికి ఇంత క్లుప్తంగా భావగర్భితంగా చెప్పిన వారెందరున్నారు? శృంగారంలోని వివిధ దశలను ప్రదర్శించడంలో భాగంగా సూరన ఈ కథను కల్పించేడు.

ఆడుది మగవాణ్ణి కొంగున ముడివేసుకొని ఆడిస్తుందనడం లోకంలో వాడుక. అక్కడ కామ వాంఛే ప్రధానంగా కనిపిస్తుంది. ఆ ఆడించడం ఎలాంటిదో సూరన చూపిస్తాడు.

''కడు నల్లికలు గొను కలికి బిత్తర్తపుఁ జూ
పులి క్రొమ్మెఱుంగులు వలలు గాఁగఁ
నెఱయంగఁ బర్వెడు నిద్దంపు లేనవ్వు
తెలినిగ్గు తరగలు తెరలు గాఁగఁ
గొమరొందు నవవిలాసముల కన్బొమ లువి
వాడు చోపుడుఁ గోల లగుచుఁ దనరఁ
దేనె లుట్టెడు మాట తేటల పసలు వా
కట్టు మంత్రంబుల కరణి నమర
నీవు గడఁగి యమ్మునీంద్ర శార్దూలు త
పో మహత్త్వ దర్పమును హరించి
కీరవాణి! యతనిఁ గ్రీడా మృగంబుగా
జేయవలయుఁ గుసుమ సాయకునకు. 2 - 181.

లోకంలో మగవాళ్లను వశం చేసుకునే స్త్రీలెలా ప్రయత్నిస్తారో అదంతా ఇక్కడ సహజంగా కనిపిస్తుంది. రంభకు వశంవదుడైన మణికంధరుణ్ణి చూసి ఆమె చెలులు ''అద్దిరా! యయ్యకు మన్మథాభ్యుదయ'' మని పరిహసించేరట. సూరన పెంకెతనమంతా ఇలాంటి మాటల్లో కనిపిస్తుంది. అలా చూడటం, మాట్లాడడం స్త్రీ ప్రకృతికి సన్నిహితమైనది.

లోకంలో స్త్రీ పురుషులందరికీ అనురూప దాంపత్యం దొరకదు. ఊహలలో ఒక వ్యక్తి ఉంటే పొందు మరొక వ్యక్తితో కుదురుతుంది. అప్పుడు సురతాది క్రియలలో పాల్గొనే వ్యక్తులు తాము పొందుతున్న వ్యక్తుల వలన కాక, తన ఊహలలో ఉన్న వ్యక్తి వల్లనే ఆ సుఖాన్ని పొందుతూన్నట్లు

భావించుకుంటారు. ఇది కామశాస్త్ర సమ్మతమైన విషయం. శృంగారంలో ఇదొక తీరు. సూరన ఈ విషయాన్ని వర్ణించేడు.

''కళలంటి కఱఁచి తన చె- య్యులఁ జొక్కెడు తపసి మది చివుక్కురు మనఁగా.''
''నలకూబర విడువిడురా- యలసితి నని పల్కె మన్మథాతి వివశతన్.'' 3 - 52

ఇక్కడ రంభ మణికంధరుని వలన తాననుభవిస్తూన్న సుఖాన్ని నలకూబరుని వలన పొందుతూన్నట్లు ఊహించుకుంది అందువలన మణికంధరుని ''మది చివుక్కురు'' మందిట.

భిన్న వయోవస్థలకు చెందిన స్త్రీ పురుషుల నడుమ నడచే శృంగారం చూపరులకు వింతగా కనిపిస్తుంది. ముసలి వాడికి పడుచు పెళ్లాం, బికారికి సంపన్నకులీన దొరికితే లోకంలో ఇలాంటి పరిస్థితి ఏర్పడుతుంది. సహృదయ పక్షం నుండి ఈ అవస్థను ప్రదర్శించాలనే ముచ్చట సూరనకు కలిగింది. ''వేళాకోళపుఁదీఁగలుఁ బేలికలుఁ గళాసములును, బీఱబేడలు'' ధరించిన మణిస్తంభుడు కళభాషిణి నొక సింహం మీద కూర్చుండ బెట్టుకుని ఆకాశ మార్గంలో తీసుకునిపోతూ ఉంటే చూసిన రంభ చెలికత్తెలు ''ఎక్కడ దొరకెనొకో యీ చొక్కపు గుబ్బెత వెడంగు జోగికి? అహహా!'' (3-79) అని పరిహసించేరు. వాస్తవానికి కలభాషిణి మణిస్తంభుల మధ్య అప్పటికే కామ ప్రవృత్తి లేదు. కాని చూపరుల కలా అనిపించడంలో తప్పులేదు. లోకంలో ఇలాంటి వెన్నో జరుగుతాయి.

రంభానలకూబరుల్లా ఏ వేళా రతి క్రీడా పరాయణులై కొందరుండగా అందుకు విరుద్ధమైన కామప్రవృత్తి ఒకటుంది ఆలు మగలలో ఒకరికి సామాన్యమైన కామవాంఛ ఉంటుంది. రెండవ వారికి ఏదో ఒక ప్రత్యేక సందర్భంలోనే కామవాంఛ పొటమరిస్తుంది. అప్పుడే వారిలో శృంగారం అంకురిస్తుంది. ఈ అంశాన్ని సూరన్న ప్రత్యేకంగా నిర్వహించి సుగాత్రి శాలీనుల శృంగారాన్ని మహోదాత్తంగా తీర్చిదిద్దేడు. ''శాలీనుడు రసిక శిఖామణి కాబోలు! తన భార్య కృత్రిమములగు తళుకుబెళుకులను వదలి గొల్లభామరీతి నున్నఁగాని దగ్గరఁ జేర్పనని సంకల్పించుకున్నాడేమో!'' అని రామలింగారెడ్డి గారధిక్షేపించేరు. సూరన లోకజ్ఞుడు. కామం యొక్క వివిధ ప్రవృత్తులను చూపించడానికి పూనుకున్నవాడు. అందుకే అందులోని ఒక విపరీత ప్రవృత్తిని ప్రదర్శించడానికి శాలీనుణ్ణి గ్రహించేడు. ఇంటి దగ్గర సకల సదుపాయాలతో, దివ్యమైన అలంకరణతో అపురూప సౌందర్యంతో తన శయ్యకు చేరిన సుగాత్రి ఎన్ని నాళ్లు ప్రయత్నించినా అతనిలో కామం ప్రకోపించ లేదు.

''తోరంపుఁ జనుదోయి త్రుళ్లింత లిడఁగ
దుగుచోట్లు గుద్దంట ద్రవ్వి త్రవ్వి
వ్రేఁగైన పిఱుఁదు బల్విడిఁ జలింపంగను
వడినిట్టు నట్టును నడచినడచి

యడుసు తుంపురు చెక్కుటద్దంబులను బర్వ
మల్లకు మడవలు మార్చి మార్చి
నడుము లేఁ దీవియ నకనకల్ గుడువ నిం
పునఁ దగు మోపులు మోసి మోసి

చిఱుచెమటఁ చేర్చు వింత క్రొమ్మెఱుంగు తోడఁ
గొమరు మేనొప్ప సారెకుఁ గొప్పు కదల
నేమిటికినైన మున్న దామున్న యేఁగి యేఁగి
యెల్లపనులు నొనర్చి నింపెసఁగ మెసఁగ 4 - 99

సుగాత్రి ఇలాంటి రూపంలో కనబడగానే శాలీనుడికి కామప్రకోపం జరిగింది. ఇది సుగాత్రి తన కోసం పడుతూన్న శ్రమను చూసి సానుభూతి చూపించినందు వలన కలిగిన పరిణామం కాదు. ఆ సమయంలో అలాంటి స్థితిలో సుగాత్రి కాక ఇంకొక స్త్రీ ఉన్నా శాలీనుడిలో కామప్రకోపం జరిగే అవకాశం ఉంది. అంత మంచి వాడికి ఇలాంటి బుద్ధిపుడుతుందా అని అనుమానం కలగవచ్చును. కాని అది శాలీనుడి నైజం. ఈ శాలీనుడే మణిస్తంభుడయ్యాడు. ద్వారకలో కలభాషిణి ఇంట్లో కొన్నాళ్లున్నాడు. ఆమె తన నొరుసుకుంటూ సింహాన్నెక్కి మూడో మనిషి లేని తోవలో సుదీర్ఘ ప్రయాణం సాగించేడు. కాని ఆ పరిస్థితులలో ఎప్పుడూ మణిస్తంభుడికి కలభాషిణి మీద కామవాంఛ కలుగ లేదు. అసలా ఊహే లేదు. పాఠకులు కూడా ఎక్కడా అతణ్ణి శంకించరు కాని మృగేంద్ర వాహన చేత విసరి వేయబడిన తరువాత కలభాషిణిని చూసేక మణిస్తంభుడిలో కామవాంఛ రేగింది. దానికి కారణం ఆస్థితిలో కలభాషిణి రూపమే.

అమృతంబు దొలఁకు నట్లమరంగ వెల్వెలఁ
బాఱు ముఖేందు బింబంబు తోడఁ
జాలఁ గ్లన్దవ్వయి యా కూలంకషంబులై
తల్లడంబందు నేత్రముల తోడఁ
గడుఁ జెమర్చిన యట్టి కలికి లేఁ జెక్కుల
నంటెడు విగళత్కచాళి తోడ
వలి గుబ్బ పాలిండ్ల నిలువ కట్టీటు సం
క్షోభించు పయ్యెద కొంగు తోడ

వెఱపు నొక యొజ్జయై వింత విలసనములు
గఱపఁ జూపట్టు సౌందర్య గరిమ తోడ

సరభ సాకర్ష ణాక్షోభ చకితయైన
మదను జయలక్ష్మి లీల నిమ్మగువ దనర. 3 - 156.

ఈ కలభాషిణిని ''కనుగొనునంతనీ మన్మథ వశుఁడ'' (3-157) నైతినని మణిస్తంభుడన్నాడు. ఇది హఠాజ్జనితము, అసంకల్పితము, దీర్ఘవాంఛారహితము అయిన చర్య. ఆ క్షణం దాటిపోతే అతనిలోని కామవాంఛ అణగిపోయేదేమో! ఆక్షణమే అతణ్ణి వివశుణ్ణి చేసి కలభాషిణిని కౌగిలించుకునేలా చేసింది. అంతకు మించి చేసిందేమీ లేదు. చేయదలచిందీ లేక పోవచ్చును. ''కనుగొను నంతను'' అనుచోటనున్న అవధారణార్థకమైన ''అ'' ను ఔచిత్యం తెలిసి వాడుక చేయడంతో కామ ప్రవృత్తిలోని ఈ క్షణి కొద్రేకం అక్షీణౌచిత్య శోభాపరిస్పందాన్ని కలిగించింది. సుగాత్రి విషయంలో శాలీనుడిది కూడా క్షణికోద్రేకమే. ఆ క్షణంలో మంచం అక్కర్లేదు. పక్కా అక్కర్లేదు. ఐనా అది లోకసమ్మతం, నిరంతరం అయిన భార్యా సంబంధమైన శృంగారం కావడం చేత సుగాత్రి ''దినము నట్ల యేగి, యా తోటలో నట్లు పనులు చేసి, ప్రాణ విభుని నట్ల యిష్టరతుల నలరించె'' (4 -129) నని సూరన చెప్పేడు. అంటే అలాంటి అవస్థలో తప్ప శాలీనుడికి కామ ప్రకోపం జరగదని చెప్పేడన్న మాట. ''సంభ్రమించుచు పనులు చేయు'' సుగాత్రి శాలీనుడికి 'సరభ సాకర్షణాక్షోభ చకిత తైంన'' కలభాషిణి మణిస్తంభుడికి కామవాంఛ నుద్బుద్ధం చేసేరు. ఒక వ్యక్తి యందలి విశేష ప్రవృత్తిని నిరంతరాయంగా చిత్రీకరించడంలో సూరన ఔచిత్యాన్ని పాటించేడు.

''కామాతురాణాం నభయం నలజ్జా'' అని లోకంలో రూఢ మయింది. ఆ నిర్భీక నిర్లజ్జా ప్రవృత్తి ఎలా ఉంటుందో చూపించాలనే ముచ్చట కూడా సూరనకు కలిగించింది. కలభాషిణి ఆడుది. ఆమె నలకూబరుడి విషయంలో కామాతురగా ఉంది. ఆ కోరికను తీర్చుకోవడానికి గడుసుగా నారదుని వలన తన ఇష్టం వచ్చిన స్త్రీ రూపును ధరించగల వరాన్ని పొందింది. అది ఒక సాహసం. దూరదృష్టి, దూరశ్రవణము అనే విపరీత అమానుష శక్తులను ప్రదర్శించిన మణిస్తంభుడు తననేంచేస్తాడో అనే శంక లేక నిర్భయంగా సింహాసన్నెక్కి ఆకాశంలో ప్రయాణం చేసింది. ఆడదానికి ఈ తెంపరితనం ఎలా వచ్చింది? తెంపరితనం ఎలా కలిగింది? అది కామాతురత్వం కలిగిన తెంపరితనం. ఈవిడే -

'' ఒట్టుసుమీ! యన్న నొట్టు సుమీ! యంచు
నేమేమి? యనిన నేమేమి? యనుచు
గానీ గదే! యన్న గానీ గదే! యంచు
నింకేల? యనిన నింకేల? యనుచు
నోసి! పోవే యన్న నోసి! పోవే యంచు
నౌనంటి వనిన నౌనంటి వనుచు

మఱువకు మిదియన్న మఱువకు మిదియంచు
నీవెంత? యనిన నీవెంత? యనుచు

నొకతె మగనికి నాసించు టొప్ప దనిన
నొకతె మగనికి నాసించు టొప్ప దనుచు
బట్టి యాడె నారంభతోఁ బ్రథమరంభ
ప్రియుడు నిలుమన్న నిలువక పెద్ద రొదగ. 3 - 27.

ఇక్కడ గమనించదగిన విషయం ఒకటుంది. ఈ మాటలన్నీ రంభ ముందు పలికితే ప్రథమ రంభ అంటే కలభాషిణి పునశ్చరణ చేసింది. రంభది ఆవేదన. కలభాషిణిది రహస్య గోపనం చేయవలసిన ధూర్తలక్షణం. ఆవేదన నిండిన వారి మాటలు ఉద్వేగపూరితంగా, అవిచ్ఛిన్న ధారగా ఉంటాయి. మొండివాదనకు దిగినవారు ''త్వంశుంఠ'' అంటే ''త్వంశుంఠ'' అంటారు. కలభాషిణి సిగ్గు వదలి అటువంటి మొండివాదనకు దిగింది. అప్పుడామె కంతకంటె చేయదగినది వేరొకటి లేదు. ఇక్కడ ''ప్రియుడు నిలుమన్న నిలువక పెద్ద రొదగ'' అనడం సూరన లోకవృత్త పరిశీలనను, లలిత హాస్య ప్రియత్వాన్ని వెల్లడిస్తుంది. ఈ రంభా నలకూబర భ్రాంతి ప్రహసనమంతా వైచిత్రీవిలసితమై శృంగార రస నిర్వహణములోని సూరన విపరీత ప్రవృత్తిని వెల్లడిస్తూంది.

కామ వాంఛలో పురుషాయిత కేళి ఒకతీరు. అందుకని సూరన పనికట్టుకుని అదికూడా వర్ణించేడు.

ఉదకము గ్రోల వ్రేలెడు పయోదము పౌరుషకేళి సంభ్రమా
భ్యుదయ గళద్రమాకబరి పోలిక నొప్పఁ దటి ద్విలాసముల్
తదభివృతాంగక స్ఫురణలం దలపింపఁగ పయోధి యు
ప్పిదము శయించినట్టి మురభేది తెఱంగు వహించెఁ జూచితే. 4 - 203.

ఇది చిరవిరహానంతరం మణిస్తంభుడు సుముఖాసత్తితో కలిసి విహరించే సందర్భంలోని సముద్ర వర్ణనము. సాధారణంగా వ్యక్తులు ప్రకృతిని తత్కాలీన మనోభావానుగుణంగా దర్శిస్తారు. మణిస్తంభుడు సుముఖాసత్తి సింహాస్నెక్కి మేఘమండలానికి మీదుగా విహరిస్తున్నారు. అక్కడనుండి కిందకు చూస్తే మేఘం సముద్రం మీద వ్రేలాడుతూన్నట్లు కనిపించింది. ఆ సమయంలో మణిస్తంభుడు కామావిష్టుడై ఉన్నాడు. కాబట్టి అతనికి పైనున్న మేఘం కిందనున్న సముద్రంతో పురుషాయితకేళి జరుపుతున్నట్లు తోచింది. ఈ ఊహ మణిస్తంభుని ప్రకృతికి విరుద్ధంగా కనిపిస్తుంది. ''ఒకట పూర్వోత్తర విరోధ మొదవ కుండ'' ఔచిత్యాన్ని పోషిస్తానన్న పూనిక కలవాడు సూరన. అలాంటప్పుడు ఈ ప్రకృతి విరుద్ధ ప్రసంగమెలా వచ్చిందనే ప్రశ్న కలుగుతుంది. మణిస్తంభుడు

సహజంగా ఒక నిర్దిష్టావస్థలో మాత్రమే కామ ప్రకోపానికి లోనవుతాడన్నది నిజమే. కాని ఇప్పుడతనిలో ఒక అతృప్త కామ వాంఛ మిగిలిపోయింది. కలభాషిణి మీద అప్రయత్నంగా తనకు కలిగిన ఉద్ధృత కామ వాంఛ ఉపశమించక అతనిలోనే అతృప్తంగా అణగివుంది. అది ఉపశమిస్తే గాని ఆ ఆలోచన పోదు. ఇది కామంయొక్క తత్త్వాన్ననుసరించిన మాట. ఆ కారణంగా ఇక్కడి మణిస్తంభుని ఊహలు కామాసక్తిని వెల్లడిస్తున్నాయి. ఆ ఊహ అలంకారంగా మారేసరికి అనౌచిత్యంగా భాసించి విమర్శకుల కత్తి వాదనకు గురి అయింది. ఇక్కడ సముద్రాన్ని శ్రీమహావిష్ణువుగా భావించక ఇంకొక మిధునంగా ఊహిస్తే ఆ అనౌచిత్త్యం తొలగి ఉండేది.

విపరీత రతేచ్ఛ లోని వేరొక భేదాన్ని కూడా సూరన కావ్యౌ చిత్య మర్యాద నుజ్జ్వలంగా పోషిస్తూ ప్రదర్శించేడు.

''రతి సలిపి రందు సిద్ధుఁ డోయతివ! నీవు
పురుషుడవు గమ్ము నారిత్వమును భజింతు
నే'' ననుచు విపరీత రతేచ్ఛఁ బలికెఁ
బలుకుటయు నాదరమున నజ్జలజ ముఖియు'. 5- 95.

స్త్రీత్వము నీ వొందుము పురు- షత్వము నేఁదాల్తునని నిజప్రియుఁ బలికెన్
సత్వరత నట్లు వారల - స్త్రీత్వము పురుషత్వము విపరీతము లయ్యెన్. 5 - 96.

పురుషాయిత కేళిలో స్త్రీ పురుషుల విపరీత ప్రవృత్తి ఉన్నా అక్కడ స్త్రీ అనుభూతి స్త్రీకే చెందుతుంది. పురుషుడి అనుభూతి పురుషుడిదే ఔతుంది. కాని ''అంగనల కంగజ సంగరకేళికా విశేషదశల యందు నెక్కుడఁట సౌఖ్యగతుల్ మగవారికంటె!'' (5-105) నని కామసుఖము నెరిగిన లోకము చెప్పిన మాట. ''నాకిదియు నెఱింగికోనిపుడభీష్టము'' (5 - 108) అనే మణిస్తంభుని కోర్కె కేవలం అతనిదే కాదు కదా? తన ప్రబంధంలోని ప్రతి అంశాన్ని ''భావికార్య ఘటనానుగుణంలాగ'' తీర్చిదిద్దే సూరన ఈ విపరీత రతేచ్ఛా కల్పనకు మూడు దశలలో పాదులు కట్టి ఉంచేడు. బ్రహ్మ సరస్వతితో ''అతనికి సుముఖా సత్తి యనునది తండ్రియు, మణి స్తంభుడనెడివాడు తల్లియు'' (5.28) అని పలికేడు. సరస్వతి కూడా అది తెలియక తబ్బిబ్బు పడింది. కాని ఆమే రెండవ దశలో సుగాత్రీ శాలీనులకు 'నీకు గర్భంబు గాకుండ నాకు, నాకుఁ గొడుకు నీ కూటమిని కలుగుటకు నీకు'' (5.105) వరము లిచ్చిందని మణిస్తంభుడు చెప్పేడు.

ఈ విపరీత రతేచ్ఛా కల్పనం తరువాత సూరనకు ఇంకొక కామ ప్రవృత్తి మీద మనసు మళ్లింది. స్త్రీ ప్రకృతిని ధరించిన పురుషుడి మీద ఇంకొక పురుషుడు కామాసక్తుడైనట్లు కల్పించి సహృదయ పక్షాన్నాశ్రయించి అందులోని హాస్యాన్ని అనుభవించాలనుకున్నాడు. కాముకుడైన పురుషుడు అపరిచిత స్త్రీ సమక్షంలో తన పురుషకారాన్నెలా ప్రదర్శిస్తాడో సూరన చూపించేడు.

''అని చింతింప యదృచ్ఛ నచ్చెలువ తన్నావేళ నీక్షించినన్
ఘనసైన్యంబులు గొంతమీచఁ దన తుక్లారంపు తేజీఁ జివు
కున దాటించి కుదించి చిత్తరువు బాగుల్ మీఱనాడించి శో
భన తద్వల్గన వల్గదగ్రిమ రుచి స్థాయత్కిరీటంబుతోన్. 5 - 119.

ఇది సుముఖాసత్తి రూపంలో ఉన్న మణిస్తంభుణ్ణి చూసి కామాచిష్టుడైన సత్వదాత్ముని చేష్ట. ఇక్కడ సూరన తిక్కన కీచకుణ్ణి తలపిస్తూ ఇంకొకమెట్టు కట్టడానికి తలపడ్డాడు. కీచకుడు ద్రౌపదిని చూసి కామ వికారాన్ని పొందడంలో సహృదయుడొక తత్పరతను పొందుతాడు. తిరిగి తాను అలాంటి కల్పనే చేస్తే అందులో అపూర్వత ఉండదు. చమత్కారం ఉండదు. కాబట్టి సత్వదాత్ముడు యథార్థమైన కామవాంఛను పొందడం అతని పక్షంలో ఉచితంగాను, కామవాంఛను ఆభాసపూర్వకంగా ప్రదర్శించి సహృదయ పక్షంలో చమత్కారావహంగాను సూరన చిత్రించేడు. సత్వ దాత్ముడు ''అచ్చెలువను తన వద్దకు వచ్చుట కఢిగించుటలో'' (5 - 12) ఆమె భర్త ఉనికిని తృణీకరించేటంత ఉద్ధతిని ప్రదర్శించేడు. ఇది కూడా సూరన కోరి చేసిన కల్పనే. విపరీత కామవాంఛ కల పురుషుడు ఇతరుని భార్యను అతనికి తెలిసేలాగ సంగమించాలని కోరుకోవడంలో ఒక తృప్తి ననుభవిస్తాడు. సూరన ఈ ఊహతోనే ఈ కల్పన చేసాడనడానికొక సాక్ష్యముంది. అది దీనికి సమాంతరమైన కల్పన. విపరీత కామాసక్తుడు తన శక్తిని ప్రదర్శించడానికి ఇతర స్త్రీల సమక్షంలో తన భార్యతో శృంగార చేష్టలను చేయడానికి కుత్సాహిస్తాడు. సూరన ఇలాంటి కల్పన కూడా చేసేడు. యజ్ఞశర్మ భార్యల సమక్షంలో సాగిన త్రాగుబోతు ఆలుమగల సరసం ఇలాంటిదే. ( 5 - 123 - 131) సమాన్యౌచిత్యాన్ననుసరించి దంపతులు ఇతరుల సమక్షంలో అలా ప్రవర్తించకూడదు. అందుకే సూరన వారిని మధుపాన మత్తులను చేసేడు.

కామవాంఛలో అనేక రీతులున్నాయి. సాధారణ కామవాంఛకు లోనైన వ్యక్తి సైతం కొన్ని కొన్ని సందర్భాలలో కామ సంబంధమైన ఊహా స్వప్నాలలో తేలిపోతూ ఉంటాడు. అపురూప సౌందర్యవతి అయిన అపరిచిత స్త్రీ తనంతతానుగా వచ్చి తనపొందు కోరడాన్ని గూర్చిన అంశం అతని ఊహాస్వప్నాలలో ఒక భాగం కావచ్చును. సూరన ఈ సంగతి కూడా ఆలోచించేడేమో నన్నట్లుగా ఒక కల్పన చేసేడు.

''బిగి చనుత్తులు గుత్తపుం బయటలోఁ బింపిళ్లు గూయంగ శీ
ఘ్రగతిన్ భామ యొకర్తు వచ్చి ''యిదె యోగంధర్వ! నీ వొందె దీ
భృగుపాతంబు ఫలంబు నీ పరుసవారిం గావు'' మంచున్ ధగ
ద్ధగి తాశాంతరమైన ఖడ్గ మొకటిం దత్పాణి కిచ్చెన్ వెసన్. 6 -6.

ఆమె అభినవకౌముది. అతడు మణికంధరుడు. అపరిచితయైన అభినవ కౌముది కీ చొరవ ఆసన్న భయోత్పాతం కారణంగా కలిగినదేనా? సూరన ఊహనుండి పుట్టిందా? ఊహ సూరన శృంగార సౌధంలోని ఒక వాతాయనంలోంచి దుర్లిపడితే ఔచిత్య మా ఊహను ఆసన్న భయోత్పాత మనే సందర్భంలో పొదిగింది.

కామం సహజ ప్రకృతులను విచిత్రము. అనూహ్యము అయిన పరిణామాన్ని పొందేలా చేస్తుంది. రాక్షస ప్రకృతిని సాత్త్వికి ప్రకృతిగా పరిణమింప జేస్తుంది. సాత్త్విక ప్రకృతిని తామస ప్రకృతిగా మారుస్తుంది. ఈ అంశాన్ని నిరూపించడానికి సూరన తన శృంగార సౌధంలో ఒక మణిగోపురాన్ని నిర్మించి శృంగార శిల్పులలో ఎన్నికగన్న వాడయ్యాడు. అది శల్యాసురుని ప్రణయ వృత్తాంతము. శల్యాసురుడు ''శాంతి కంథ తనువునం బూని చరించు'' (6 - 33) వాడు. నిజాని కతనిది అసుర ప్రకృతి కామవాంఛ బలీయమైనది. స్త్రీ పురుషులలో ఎవరైనా తాము ప్రేమించిన వ్యక్తి పొందు లభించడానికి ఎంతటి త్యాగానికైనా వెనుదీయక పోవడం విపరీత కామ వాంఛలో ఒకతీరు. అభినవ కౌముది శల్యాసురుని ప్రేమను తిరస్కరించింది. రాక్షసుడైనా అతడామెను బలాత్కరించలేదు. కాని తనకు లభించని ఈ యువతి పొందు వేరొక పురుషుడి కెవడికీ లభించకూడదని అనుకున్నాడు. ఇది ఒక తీరు. అభినవ కౌముదిని పొందగల పురుషుడెంత శక్తిమంతుడైనా అతడిని చంపడానికి తగిన శక్తి కోసం శల్యాసురుడు మృగేంద్ర వాహనాలయంలో తన తల నరుకుకుని పునర్జీవితు డయ్యాడు. శల్యాసురుని ప్రణయంలోని ఉన్నతి అంతటితో ఆగిపోలేదు. అభినవ కౌముది మృగేంద్ర వాహనాలయంలోని ఖడ్గాన్ని పట్టుకుని వస్తూ ఉండడాన్ని చూచి శల్యాసురు డిలా అంటాడు.

''అతఁడపు డాసుధాకరనిభాననఁ గన్గొని సంభ్రమించుచున్
మతి గలగంగ నిల్లనియె నాపయి వచ్చిన నీకు నిష్ట దై
వతముల యాన సుమ్మి వరవర్ణిని! యెందుఁ దలంక నేను దు
ర్మతి వయి నీవు నాకుఁ దెగి మ్రగ్గెదవో! యని తల్లడిల్లెదన్.'' 6 - 62.

ఆమె కోసం ఇదివరకే ఒకసారి తల నరక్కున్నాడు. ఇప్పుడావిడ తనను చంపడానికి వస్తే ప్రతిఘటించ దలచుకోలేదు. ఎందుచేత? తనను చంపదలచుకున్న వారిని చంపే శక్తి తనకు లభించింది. అభినవకౌముది మరణిస్తే తన జీవితమే వ్యర్థం. అందుకే ఆవిడ ప్రయత్నాన్ని వారించడానికి ''ఇష్ట దైవతముల యాన' అన్నాడు. అభినవ కౌముది తన బారి నుండి రక్షించుకోవడానికి ఆత్మహత్యకు పూనుకున్నా తాను భరించలేడు. అందుకే తన భయాన్ని వ్యక్తం చేసేడు. ఇది శల్యాసురుని ఉన్నతి. ఈ ఉన్నతికి అతడిలోని కామ ప్రవృత్తి కారణమయింది.

కామ వాంఛ సాత్త్విక ప్రకృతిని తామస ప్రకృతికి దిగజార్చడాన్నికి సైతం సూరన చూపించేడు. ఒక వనంలో ఒక దేవాలయం ఉంది. అక్కడొక యువతి శిల్పం ఉంది. అది ఎంతో అందమైన శిల్పం.

అక్కడికొక యతివచ్చి ఆశిల్పాన్ని చూసేడు. బ్రహ్మను మించిన ఆశిల్పి నిర్మాణ చతురతను ప్రశంసించేడు. ఇలాంటి ఆడవాళ్లు భూమ్మీద ఉంటారా? అని గుటకలు మింగేడు. సన్న్యాసి కీ ఊహలు మంచివి కావని ఆత్మ విమర్శ చేసుకున్నాడు. ముఖం తిప్పుకున్నాడు. మళ్లీ మళ్లీ ఆ బొమ్మ మీదే కోరిక పుట్టింది. అటూ ఇటూ చూసి ఎవరూ లేరని నిర్ణయించుకుని ''నెమ్మనమునఁ బట్టలేక బిగియారఁ గవుంగిలించె'' ( 8 - 177)ను. అది చూసి నవ్విన సుగ్రహుణ్ణి శపించి యతి తామసు డయ్యాడు. ఏకాంతంలో కామోన్మాదానికి లోనై ఇలాంటి చేష్టలు చేసే వాళ్లు లోకంలో ఉంటారు కదా!

కామవాంఛకు సంబంధించిన ఇంకొక అంశం సుగాత్రీ శాలీనుల కథలో ఉంది. స్త్రీకి యౌవన సంరక్షణ కంటె మాతృత్వ వాంఛ బలీయమైన సహజాతము. పురుషుడు మాత్రం తన స్త్రీ యౌవనాన్ని కోల్పోకుండా ఉండాలని కోరుకుంటాడు. కాబట్టే శాలీనుడు ''అనిశము నీదు యౌవన శుభాకృతిఁ గౌఁగిటఁ జేర్చువేడుకన్, దనియమిఁ జేసి వేడితిని చక్కఁక నీకు గర్భ మెన్నడున్ జనితము కాక యుండ'' (4 - 165) అన్నాడు. సుగాత్రి తనకు సంతానం కావాలని శారదను కోరింది. ఇది మనస్తత్వ రహస్య మెరిగిన కల్పన. శాలీనుడికి స్థలం కానీ స్థలంలో, కాలం కాని కాలంలో కామవాంఛ రేగుతుంది. ''గుణాన్వితుండు గాని సుతుఁడు ప్రసూతుం డగునఁట! యకాల సురత క్రియలన్'' అని సుగాత్రి తల్లి తప్పు పట్టింది. కాని సుగాత్రి ఆమె మాటను పట్టించు కోకుండా మగని కోర్కెనే చెల్లించింది. ఇది కూడా సూరన విపరీత మనః ప్రవృత్తి నుండి పుట్టిన కల్పనే.

కళా పూర్ణోదయంలో ప్రదర్శించబడిన కామ ప్రవృత్తి అంతా తెలుగు సాహిత్యానికి అంతవరకు అచుంబితమైనది. వైవిధ్యం నిండిన ఈ శృంగార దశా విశేషాలను కల్పించడంలో సూరన రసాభాసం చేసేడని అలంకార శాస్త్ర మర్యాదల ననుసరించి కొందరు విమర్శించవచ్చును. కానీ ఎన్నో సంస్కృతాంధ్ర కావ్యాలలోని రసాభాస ఘట్టాలే రాణించేయి. సూరన శృంగార పరికల్పనంలోని ఔచిత్యపు సుద్దులు ''హృదయైక సాక్షికములు''; అపూర్వ భావనా విలసితాలు, ప్రతిభాసమున్మిషితాలు. ఇన్ని అచుంబితాలైన శృంగార 'కళా మర్మ భేదన సామ్రాజ్య సంపదను భవావస్థ'' లను కల్పించిన సూరన తెలుగు కవులలో విలక్షణుడు, విశిష్టుడు.

మానవులు తమలో జీవించి ఉన్నదాన్ని విద్వేష దృక్పథంతో చూసి, దానికి పరాయి వారయ్యారు. ఈ పరాయి తనం జైవిక (biological) మైంది కాదు. అది సామాజిక, ఆర్థికాలకు సంబంధించింది. అది మానవ చరిత్రలో పితృస్వామ్య సామాజిక వ్యవస్థ అభివృద్ధి చెందక ముందు లేదు.

**– Wilbelm Reich.**

# ఫ్రాయిడ్ లైంగిక సిద్ధాంతాలు

- అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

ఫ్రాయిడ్ తన సెక్స్ సిద్ధాంతాలను ప్రకటించినప్పుడు ప్రపంచం గగ్గోలు పెట్టింది. ఆరు నెలల పిల్లల్లో గూడ కామం ఉంటుందని ఫ్రాయిడ్ చెబితే దానిని అమాయక బాల్యం మీద దాడి అన్నారు. అసలతడిని ప్రపంచం సరిగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించలేదు. ఫ్రాయిడ్ సెక్స్ అనే పదాన్ని చాల విస్తృతార్థంతో వాడాడు. చిన్న పిల్లవాడు నోట్లో వేలు వేసుకొంటే వచ్చే సుఖం నుంచి, చలికాలంలో ఉన్ని కోటు వేసుకొంటే వచ్చే సుఖం వరకు సెక్సు క్రిందకే వస్తుందన్నాడు. శిశువు లైంగిక సహజాతం (sexual instinct)తో పుడుతుందని, దీని లైంగిక వస్తువులు (sexual objects) తలిదండ్రులని, వయోజన దశ చేరేటప్పటికి బహు సంకీర్ణ మార్పులకు లోనవుతుందని ప్రతిపాదించాడు. ఈ మార్పులు నాలుగు దశలలో జరుగుతాయి. 1) మౌఖిక దశ (oral stage) 2) పాయుదశ (anal stage) 3) శిశ్నదశ (phallic stage) 4) గుప్తదశ (latent period).

అయితే శిశువులోని లైంగికతకు నిర్దిష్ట రూపం ఉండదు. అది గట్లు లేని నది. ఇందులో ఉండే దర్శన, ప్రదర్శన, క్రౌర్య, దౌర్జన్య పాక్షిక ప్రవృత్తులు లైంగికతతో ముడిపడి ఉంటాయి. ఒక వ్యక్తి లైంగిక విపర్యాయానికి లోనయ్యాడంటే లైంగిక సహజాతం గట్లు తెగి, పై ప్రవృత్తులు విడి వడి పోయాయని మనం అర్థం చేసుకోవాలి.

మరి లైంగిక సహజాతానికి గట్లు ఎలా ఏర్పడతాయి? సంస్కృతి, విద్యలు గట్లు వేస్తాయి. అయితే ఎప్పుడూ నూటికి నూరుపాళ్ళు విజయవంతం కావు. అందుకనే మనం సాంఘిక విలువలను కొన్నింటిని అంగీకరిస్తాం, కొన్నింటిని అంగీకరించం.

శైశవ లైంగికత గుప్త దశ దగ్గర ఆగిపోకుండా, అందులో కొంత శక్తి విడివడి ఇతర లక్ష్యాలకు మళ్ళుతుంది. దీనినే ఉదాత్తీకరణం (sublimation) అంటాము. అంటే సంస్కృతి కట్టలు వేసి లిబిడో శక్తిని సంఘం అనుమతించిన కార్యాలకు మళ్ళించడం. ఈ కారణానే కళాఖండాలు, సాహిత్యం, పరిశ్రమలు, భాష, పార్లమెంటు రూపొందాయి. లైంగిక సహజాతంపై చెప్పిన నాలుగు దశల గుండా సజావుగా అభివ్యక్తీకరింపబడితే అతడు ఆరోగ్యవంతుడవుతాడు. లేదా ఏదశలోనైనా కూరుకు పోతే కుంటుపడితే అంటే స్థిరీభవనం (Fixation) చెందితే అనారోగ్యవంతుడవుతాడు. ఈ నాలుగు దశల గుండా జరిగే వికాసాన్ని ''మనో లైంగిక వికాసం'' (Psychosexual development) అంటారు.

**మౌఖిక దశ :** నోటి ద్వారా పెదవులు ద్వారా తల్లి స్తనం నుంచి పాలు గ్రహించి ఆకలి తీర్చుకొంటాడు. దీనితో పాటే లైంగిక తృప్తిని గూడ పొందుతాడు. కామ తృప్తి పొందుతున్నాడన

డానికి గుర్తు ఏమిటంటే ఆకలి తీరిన తరవాత గూడ స్తనాన్ని వదిలిపెట్ట నిరాకరిస్తాడు. అలా చూషిస్తూనే ఉంటాడు. శైశవంలో బిడ్డ త్వరగా పాలు మాన్పినా, లేదా బాగా ఆలస్యంగా మానినా పిల్లవాడు ఈ దశలో కుంఠితుడయ్యే ప్రమాదం ఉంది. ఎక్కువ కాలం పిల్లవాడు ఎక్కువ కాలం పాలు మాన్పకపోతే (స్తనం మీద ఆధారపడితే) పరాలంబనుడవుతాడు; పరాశ్రితుడవుతాడు. దీని వ్యతిరేకంగా జరిగితే సర్వస్వతంత్రుడవుతాడు.

**పాయుదశ :** ఈ దశ మొదటి రెండు మూడు సంవత్సరాలను ఆక్రమిస్తుంది నోటిని ఎలా కామకేంద్రంగా పిల్లవాడు ఉపయోగించుకొంటాడో పాయువు (గుదాన్ని)ను అలాగే ఉపయోగిస్తాడు. అలా ఉపయోగించే పిల్లలు మల విసర్జనను నిలుపు చేస్తారు. మలం సంచితమై కండర సంకోచం జరిగి సమీపంలోని అమత్వచ ప్రకోపించి తియ్యని బాధ, దానితో పాటు సుఖ సంవేదన కలుగుతుంది. అందుకని పిల్లలు మల విసర్జనం చేయడానికి తల్లి ఎంత బతిమాలినా, విముఖత చూపిస్తారు. ఈ పరిస్థితులలో మరుగుదొడ్డి శిక్షణ (toilet training)లో అతిగారాబం చేసినా, అతిగా శిక్షించినా పిల్లవాడు ఈ దశలో స్థిరీభవనం చెంది ఔద్వేగికం ఎదగలేడు. పెద్దవాడయ్యాక అతి దుబారా వ్యక్తిగా గాని, పిసినారిగా గాని తయారయ్యే వీలుంది.

శిశ్నదశ : ఈ దశలో కుటుంబ నాటకం జరుగుతుంది. ప్రతి పిల్లవాడు తల్లిని కామించి, తండ్రిని ద్వేషిస్తాడు. తల్లి ప్రేమ పూర్తిగా తనకే దక్కాలి... తల్లి ప్రేమను తండ్రి పంచుకొంటున్నాడు, తండ్రి తనకు పోటీ అవుతున్నాడు. తల్లి పూర్తిగా తనకేదక్కాలంటే తండ్రి లేకుండా పోవాలి. ఇదీ తండ్రి మీద ద్వేషానికి కారణం. ఇది 4,5 సంవత్సరాల వయసులో జరుగుతుంది. దీనిని ఇడిపస్ కాంప్లెక్స్ అంటారు. ఇడిపస్ రెక్స్ అనే గ్రీకు కథ పేరు ఈ సన్నివేశానికి ఫ్రాయిడ్ పెట్టాడు. ఇడిపస్ కథలోంచి ఫ్రాయిడ్ ఇడిపస్ సిద్ధాంతాన్ని తయారు చేశాడనే ప్రభుద్ధులున్నారు. సాధారణంగా సంస్కృతి అటువంటి వాంఛలను పిల్లవానిలో అనుమతించదు కనుక సంస్కృతి ప్రభావంతో, ఒత్తిడితో తల్లిని అలాచూడడం తప్పని, తండ్రిని అలా ద్వేషించడం తప్పని ఎరిగి క్రమంగా మామూలు మనిషి అవుతాడు.

ఈ కుటుంబ నాటకాన్ని సరిగా పరిష్కరించ లేక పోతే ఇక్కడే కుంఠితుడై, ఔద్వేగికంగా ఈ దశా లక్షణాలనే పెద్దైన తరవాత అవలంబిస్తాడు. తల్లి మీద స్థిరీభవనం చెందాడు గనుక తల్లిని బోలిన భార్య పెద్దవాడైన తరవాత వస్తే ఆమెతో లైంగిక కార్యం నెరపలేడు. ఎందుకంటే భార్యను చేరడం అంటే తల్లిని చేరడం అవుతుంది. అచేతనంలో తల్లి ఉంది సమాజ నీతి ఆ తల్లిని బయటకు రానీయదు, అదీ కథ. తెలుగులో వచ్చిన 'వింత కథ' (కృష్ణ వాణిశ్రీలు నాయకా నాయికలు) సినిమా థీమ్ ఇడిపస్ కాంప్లెక్స్.

ఆడ పిల్లల విషయంలో ఇలెక్ట్రా కాంప్లెక్స్ సంభవిస్తుందన్నాడు ఫ్రాయిడ్. ఆడ పిల్ల తల్లిని ద్వేషించి, తండ్రిని కామిస్తుంది.

పిల్లవాడు తల్లిని కామించడం, ఆడ పిల్ల తండ్రిని కామించడం - ఇవి ఐదు సంవత్సరాల వయస్సులో జరిగేవి. ఈ కోర్కెలు అసహజాలని సమాజనీతి అణచి వేస్తుంది. ఆ విధంగా సమాజ నీతిని జీర్ణించుకొన్న మనకు అటువంటి వాంఛలే పరమ నీచాలనిపిస్తాయి.

ఇడిపస్ సన్నివేశాన్ని సమర్థవంతంగా అధిగమించడం ద్వారా, అధ్యహం (super ego), లేదా అంతరాత్మ ఏర్పడుతుంది. అంటే అహానికి ఒక ఆదర్శం ఏర్పడుతుంది. ఈడిపస్ కాంప్లెక్స్‌కు అంతరాత్మ వారసురాలై దాని స్థానంలో ఇది ప్రవేశిస్తుంది.

**గుప్తదశ :** ఈదశ బిడ్డ ఆరో సంవత్సరంలో ప్రారంభమై యౌవన ప్రాదుర్భావం వరకు ఆక్రమిస్తుంది. ఈ దశలో పిల్లవాడు సజాతీయులకు ( మగపిల్లలకు) దగ్గరవుతాడు. ఆడ పిల్లలంటే సిగ్గుపడి, దూరంగా జరుగుతాడు. ఇదే ఆడపిల్లకూ వర్తిస్తుంది.

యౌవన ప్రాదుర్భావంతో కథ తారుమారు అవుతుంది. సజాతీయుల ప్రధానులై విజాతీయుల వైపు ఆకర్షితులవుతారు. ఈ దశలో ఏక ఆడపిల్లనో కాక ఆడ పిల్లలందరిని ప్రేమిస్తాడు. అలాగే ఆడపిల్ల మగ పిల్లలందరిని ప్రేమిస్తుంది.

**జననాంగదశ :** జననాంగాలు పరిణతి చెందని ముందరి దశలను ప్రాక్ - జననాంగ (pregenital) దశలంటారు. ఇవి మొదటి 5,6 సంవత్సరాలాక్రమిస్తాయి. ఈ దశలలో లైంగిక సహజాతం 'స్వానురాగ' (తనను తాను ప్రేమించు కోవడం) ప్రభావితమై ఉంటుంది. ప్రాక్ జననాంగ దశ లక్ష్యం సంతానోత్పత్తి కాదు. సుఖాన్ని పొందడం. ఈ సుఖాన్ని స్వశరీరం నుంచే పొందడం జరుగుతుంది.

గుప్త దశలో లైంగిక సహజాతం నిద్రాణంగా ఉండి, తరవాత అవయవాలు పరిణతి చెందడంతో, విజాతీయులకు ఆకర్షితమై సంతానోత్పత్తి దిశగా బయలుదేరుతుంది. క్లుప్తంగా చెప్పాలంటే శిశువు మొదట తనను తాను, ఆ తరవాత తల్లిని, ఆ తరవాత సజాతీయులను, లైంగిక ప్రచోదన పరిపక్వం చెందడంతో యువతి యువకుని, యువకుడు యువతిని ప్రేమించి కుటుంబాన్ని స్థాపిస్తారు. సంఘంలో వ్యక్తిగా తన పాత్రను నిర్వహిస్తాడు.

## లైంగిక విపర్యయాలు (Sexual deviations)

లైంగిక విపర్యయాలను అర్థం చేసుకోవాలంటే 1) లైంగిక వస్తువు 2) లైంగిక ధ్యేయాలను గురించి అర్థం చేసుకోవాలి. లైంగిక వస్తువు అంటే ఎవరి నుంచి దేని నుంచి లైంగికార్షణ వస్తుంది వారు లేక అది - లైంగిక ధ్యేయం అంటే, లైంగిక సహజాతం దేని కొరకు ఉద్యమిస్తుందో అది.

లైంగిక ఐక్యత ఆడ - మగమధ్య సమాజమనుమతించిన పద్ధతులలో జరిగితే అది సహజమైనది, సవ్యమైనది అంటాం. సవ్యమైన లైంగిక ధ్యేయం శిశ్న - యోని సంయోగం. ఇది లైంగికోద్రేకాన్ని తగ్గిస్తుంది. వాంఛను తృప్తి పరుస్తుంది. దీనికి దర్శన, స్పర్శ, చుంబనాదులనే అనుబంధక్రియలన్నా వీటిని వాత్స్యాయనుడు ''అభిమానికా'' లన్నాడు. ప్రాక్క్రీడ (fore-play) అన్నాడు ఫ్రాయిడ్. నాగరక ప్రపంచం వీటి విలువని గుర్తించింది.

పై చెప్పిన సంయోగానికి భిన్నంగా జరిగేదంతా అపసవ్యమే, విపర్యాయమే. కొంతమంది మగవారికి లైంగిక వస్తువు మగవాడైతే, కొందరు స్త్రీలకు స్త్రీ అవుతుంది. మొదటి వారిని హోమోసెక్సువల్స్ అని, రెండోవారిని లెస్బియన్స్ అని అంటాం. ఈ విపర్యయాలకు కారణాలేమిటి ?

ప్రతి మనిషి ఆడగాని, మగగాని, - ఇద్దరిలో రెండు అంశలు 1) పురుష అంశ 2) స్త్రీ అంశ ఉంటాయి. మనిషి ద్విలైంగికుడు. వీటిల్లో ఏది స్త్రీ అంశా, పురుష అంశా - ప్రబలంగా ఆధారపడి ఉంటుందనే దాని మీద కొంతవరకు ఆధారపడి ఉంటుంది. కొంతవరకు లైంగిక సహజాతమూ కారణమే. మొదట శైశవంలో సహజాతం అవ్యవస్థీకృతంగా ఉండి ఆ తరవాత సంస్కృతీకరణం చెంది నిర్దిష్టమార్గాలలో పయనిస్తుంది. సంస్కృతీకరణం అందరికీ ఒకే రకం జరగదు. అస్తవ్యస్తతలుంటాయి. ఈ అస్తవ్యస్తతలే లైంగిక విపర్యయాలకు చాల వరకు కారణం. అంతేకాదు, ఈ సహజాతం (లైంగిక) ఏకమూలకం కాక బహుమూలకం. ఈ మూలకాల సంస్కృతీకరణ విపర్యాసాలు తోడైనప్పుడు విడవడిపోయి విపర్యయాలకు దారి తీస్తాయి.

విలోమ లైంగికత (Sexual universion)తో విలోములైన వారు సజాతీయులనే అంటే పురుషుడు - పురుషుని, స్త్రీ - స్త్రీని కోరతారు. ద్విధాగతి విలోములు మనోలైంగికంగా రెండు జాతుల నుంచి పురుషుల నుంచి, స్త్రీల నుంచి లైంగిక వస్తువులను ఎంచుకొంటారు. లేదా చిద్విలోములు పరిస్థితులను బట్టి ఏ జాతి నుంచైనా ఎంచుకొంటారు. మనో విశ్లేషణ శాస్త్రం సజాతి లైంగికులు (Homosexuals)ను వేరు చేయడానికి అంగీకరించదు. ప్రతివానికి సజాతి లైంగితను నెరపగల సామర్థ్యం ఉంది. మనో విశ్లేషణ పరంగా చూస్తే స్త్రీ పురుషుని, పురుషుడు స్త్రీని ఎందుకు కోరుకోవాలో అర్థం కాదు.

విలోములైన ప్రతివాడు శైశవంలో స్త్రీ మీద (మామూలుగా తల్లి మీద) స్థిరీభవనం చెంది, దానిని అధిగమించిన తరవాత, తల్లితో తాదాత్మ్యమై తనకు తానే లైంగిక వస్తువై పోయి, ఆ తరవాత స్వానురాగ భూమికపై తనను బోలిన యువకుల కోసం అన్వేషిస్తాడు. స్త్రీ వీరిలో రేపిన ఉద్రేకాన్ని పుంలైంగిక వస్తువుల (తనను బోలిన యువకుల మీదికి) మదలిస్తాడు. వీరు మగవారి కోసం అంగలార్చడాన్ని, స్త్రీ నుంచి విరామ మెరుగని వీరి పలాయనం నిరూపిస్తుంది. మరి కొంతమంది

తమ శరీరంలోని భాగాలనే లైంగిక వస్తువులుగా ఎంచు కొంటారు. నోటిని అపాన ద్వారాన్ని లైంగి కావయవాలుగా ఉపయోగిస్తారు. శిశ్న - యోని సంయోగాన్ని విపర్యాయంగా జమకట్టని మనం శిశ్న-నోటి, శిశ్న- అపాన సంయోగాలను విపర్యయాలుగా జమకడతాం. ఎందుకని అక్కడ, ఇక్కడ లభించేది సుఖమే కదా. దీనికి కారణం జుగుప్స, లైంగిక క్రీడలో జిహ్వాయుద్ధం (నాలుకతో నాలుక) చేస్తారు ఆనందం. అదే నోట్లో నాలుకను గీచిన నాలుక బద్దతో మరొకరిని నాలుక గీచుకోమనండి, గుర్బొడుస్తుంది. కారణం జుగుప్స, ఇక్కడా అంతే. ఆనందంగా ముద్దు పెట్టుకొన్న పెదాలతో..., అసహ్యకరమైన మలం వచ్చే ఆ ద్వారంలో ... జుగుప్స లైంగిక ధ్యేయానికి పెద్ద అడ్డుగోడలా తయారవుతుంది.

మరి కొందరు అప్రాణులైన జేబు గుడ్డలను, దుస్తులు, వెంట్రుకలు, పాదం మొదలైన వాటిని లైంగిక వస్తువులుగా గ్రహిస్తారు. ఈ వస్తువులు లైంగిక వస్తువుకు ప్రతినిధులు. ప్రియుడు, ప్రియురాలు లకు సంబంధించిన వస్తువులు అమూల్యాలు. ఆమె బహూకరించిన జేబు గుడ్డ విలువ రెండు రూపాయలే కావచ్చు. కాని దాని విలువ అతనికి అనంతం.

ఆమె వక్షోజాలలో దాచిన చేతిగుడ్డ
నా ప్రేమ బంధాన్ని తెచ్చి ఇమ్మ - ఫాస్ట్.

అసలు లైంగిక వస్తువుకు కొన్ని కారణాల వల్ల ఈ వస్తువులు ప్రత్యామ్నాలై అతని మనసును ఆక్రమిస్తాయి.

గుప్తాంగాలను కొద్దిగా ప్రదర్శించడం ద్వారా అవి మంచి ఆసక్తికరమైన లైంగిక వస్తువులుగా తయారవుతాయి - కొంత మందిలో దర్శన లాలస వాటిని చూడడం వరకే పరిమితమవుతుంది. అంటే అతనికి కామ తృప్తి శిశ్న-యోని సంయోగంలో కాక కేవలం వాటిని చూడడంలోనే లభిస్తుంది - వీరిని దర్శన లాలసులు (Voyenrs) అంటారు.

సౌందర్య భావనకు మూలం లైంగికోద్దీపనంలోనే ఉంది. దర్శన లాలసలోని అభిరుచిని ఉదాత్తీకరిస్తే కళాఖండ సృష్టికి దారితీయవచ్చు. వాటిని చూసిన మాత్రాననే లైంగికోద్రేకాన్ని ప్రేరేపించే జననాంగాలు నిజంగా ఏ మాత్రం అందమైనవి కావు. లైంగిక ధ్యేయం కొందరిలో పీడించడంతో తృప్తి పడుతుంది. బాధను కలిగించడం సుఖాన్నిస్తుంది. దీనికి రెండు రూపాలున్నాయి. 1) పరపీడన కామం (Sadism) 2) స్వపీడన కామం (Masochism)లు. మొదటిది లైంగిక వస్తువును పీడించడం ద్వారా, రెండోదానిలో లైంగిక వస్తువుచే పీడింప బడడం ద్వారా లైంగిక సహజాతం తృప్తి పొందుతుంది.

ఈ విపర్యయాల గురించి ఆలోచించినట్లయితే, ఈ ''అతిక్రమణల'' లో పాల్గొనేవి మామూలు లైంగిక కారణాలే అని దైనందిన జీవితం నిరూపిస్తున్నది. పరిస్థితులు అనుకూలించినప్పుడు మామూలు మనిషి గూడ లైంగిక ధ్యేయాన్ని వదిలిపెట్టి, అటువంటి వక్రతలకు పాల్పడతాడు. ఎందుకంటె మామూలు మనిషి ఎవడూ లేడు. లైంగిక ధ్యేయాన్ని వక్రగతిని తొక్కనీయకుండా జుగుప్స, నీతి, అవమానం భీతి, బాధ మొదలైన నిరోధకాలు అడ్డుకొంటాయి. కొన్ని ఊహించని పరిస్థితులలో విపరీత పరిణామా లేర్పడతాయి. ఒకడు మల లేహనం (licking of feaces), శవ సంభోగం (శవధర్షణం-violation of cadevers) చేస్తారు. వీరిని జబ్బు మనుషుల క్రింద పరిగణించవలసిందే. ఇతరత్రా వీరు బాగానే ఉంటారు.

సున్నిత భాగాలైన స్తన, జననాంగాల మర్దనలో '''సుఖచూషణం'' ఉంది. ఇది క్రమంగా స్వరతి (masturbation)కు దారితీస్తుంది. ఈ స్వరతి సుఖం నుంచి ఎవడూ తప్పించుకోలేడు.

ఒక్కొమాటు అత్యాచారం జరిగిన బిడ్డలు అనేక విపర్యయాలకు లోనుకావచ్చు. ఈ వయసులో పిల్లల్లో జుగుప్స, అవమానం, నీతి లాంటి అవరోధాలు ఏమీ ఉండవు గనుక, వీరిలో విపర్యయాలు ఏర్పడడానికి ఆటంకాలేమి ఉండవు. అందుకని ఆ విపర్యయాలు ఆ బిడ్డ ప్రవృత్తిలో అంతర్భాగాలు కావచ్చు. అంటే ఆ బిడ్డ ప్రవృత్తి సరిగ్గా ''బహు రూప విపర్యాయ ప్రవృత్తి'' (Polymorphus perverse disposition)గా ఉంటుంది.

లైంగిక సహజాతం మొదట అవ్యవస్థంగా ఉండి పరిపక్వం చెందుతూ, యౌవనంలో లభించే సుఖాన్ని అన్వేషిస్తూ పయనిస్తుంది. యౌవన ప్రక్రియ యొక్క లైంగిక ధ్యేయం విసృష్టి (స్ఖలనం). ఇది సంతానోత్పత్తి సేవలో మునిగి ఉంటుంది. మొదట లైంగిక వస్తువును (బాల్యంలో) తల్లి స్తనంలో చూసినవాడు క్రమేపి దానిని వదలి యౌవనంలో మళ్ళీ అదే వస్తువును భార్యలో వెదుక్కొంటాడు. తల్లి గర్భంలోంచి బయటికి వచ్చిన బిడ్డ యౌవనంలో భార్యా గర్భంలోకి ప్రవేశిస్తున్నాడు.

ప్రారంభంలో లైంగిక సహజాతం అవ్యవస్థీకృతమై ఉంటుందనీ , తరవాత దానిని అవమానము, జుగుప్స, దయ, నీతి, అధికారం అనే శక్తులు సరైన మార్గంలో నడిపిస్తాయని, అని బహు సంక్లిష్టమని, బహుమూలక నిర్మితమనీ ఏ పర్యయాలలో ఈ మూలకాలు విడిపోతాయనీ, కొన్ని కొన్ని దశలలో అది స్థిరీభవనం చెందుతుందని వక్రతలకు దారి తీస్తుందనీ, సాధారణ వ్యక్తిలో అది అన్ని లైంగిక దశలను- మౌఖిక, పాయు, అపాన, శిశ్న, గుప్త జననాంగదశలను - సహజంగానే దాటుకొంటూ పోతుందని తెలుసుకొన్నాము.

# 'సెకండ్ సెక్స్'

\- బి. తిరుపతిరావు

చాలామంది భావిస్తున్నట్టుగా ఫ్రాన్స్ ఇరవయ్యో శతాబ్దపు తాత్విక కేంద్రం. పంతొమ్మిదవ శతాబ్దం వరకు జర్మనీ తాత్విక ప్రపంచపు రాజధానిగా వుంది. అయితే ఇరవయ్యో శతాబ్దంలో మాత్రం నిర్ద్వంద్వంగా ఫ్రాన్స్ తాత్వికకేంద్రంగా ఎదిగింది. అంతకుముందెన్నడూ లేనంతగా మానవ భావ ప్రపంచంలో ఫ్రెంచి తాత్వికులు గొప్ప సంచలనానికి కారకులయ్యారు. తాత్విక ప్రపంచాన్ని ఒక కుదుపు కుదిపి మొత్తం తాత్విక భావనల్ని పునర్ మూల్యాంకన చేయటం అనేది ఫ్రాన్స్ కేంద్రంగా జరిగింది. అనేక తాత్విక ధోరణులకు ఇరవయ్యో శతాబ్దంలో ఫ్రాన్స్ కేంద్రంగా వుండి అసంఖ్యాకమయిన తాత్వికుల్ని రంగం మీదకు తెచ్చింది. ఈ తాత్వికుల పరంపరలో వచ్చిన తాత్వికులలో ప్రముఖంగా చెప్పుకోవాల్సిన పేరు సిమాన్ ద బోవా (Simone de Beauvoir) (1908-1986). ఇరవయ్యో శతాబ్దపు రెండు గొప్ప మేధో ఉద్యమాలు, అస్తిత్వవాదం, స్త్రీ వాదం అనుకుంటే ఈ రెండు ఉద్యమాలలో సమానమైన శక్తితో ప్రతిపాదనలు చేయగలిగిన స్త్రీవాది సిమాన్ ద బోవా. మొదటి ఉద్యమం అసంబద్ధ, అర్థరాహిత్య ప్రపంచంలో మానవ అస్తిత్వాన్ని, ముఖ్యంగా వ్యక్తి సంకట స్థితిని వివరించటానికి ప్రయత్నించగా, రెండవ ఉద్యమం చారిత్రకంగా స్త్రీల అణిచివేతను, ఆ అణిచివేత చరిత్రను గురించి చర్చించటం, ప్రశ్నించటం చేసింది. ఈ రెండు ఉద్యమాలలో ద బోవా మౌలిక ప్రతిపాదనలు చేయగలిగింది. స్త్రీవాదంలో చాలా కీలకమయిన ప్రతిపాదనలు చేయటం ద్వారా ద బోవా ఆ తరువాత తాత్వికంగా ఎదిగిన స్త్రీ వాదానికి అంకురార్పణ చేయటం జరిగింది. చారిత్రకంగా స్త్రీ పురుషుడికి పరాయి (Other) గా వుండటమో లేక ప్రాధాన్యత లేనిదిగా వుండటమో జరుగుతూ వచ్చింది. సామాజికంగా చరిత్ర మొత్తంలో దిగవ స్థితిలోకి నెట్టివేయబడ్డ స్త్రీ స్థితిని శారీర శాస్త్ర, మనోవైజ్ఞానిక శాస్త్ర, సామాజిక శాస్త్ర పరిశీలనలోంచి విశ్లేషించే ప్రయత్నం చేయటమే కాక, ఈ స్థితిని చిత్రిస్తూ నవలలు రాయటం, ఆత్మకథలు రాయటం చేసింది. ఆమె రాసిన ఆత్మకథల్లో కూడా స్త్రీ పట్ల పాశ్చాత్య ప్రపంచపు వైఖరిని బహిర్గతం చేయటం కన్పిస్తుంది. గొప్ప మేధో సంబంధమయిన సయోధ్యతకి సంకేతాలుగా భావించబడే ఆమె రచనల్లో 'The Second Sex' చాలా కీలకమైన గ్రంథం.

'సెకండ్ సెక్స్' గ్రంథం ప్రారంభదశలో సంప్రదాయ వాదుల నుంచి మాత్రమే కాక, ఉదారవాదుల నుంచి కూడా తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొంది. అయితే క్రమంగా 1960ల నాటికి శక్తివంతంగా ముందుకు వచ్చిన స్త్రీవాద ఉద్యమానికి ఆ గ్రంథం మౌలిక ప్రేరణగా నిలవటమే కాక ఆ తరువాత

---

బి. తిరుపతిరావు, సిద్ధార్థా ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో
ఆంగ్లోపన్యాసకులుగా పని చేస్తున్నారు, విజయవాడ.

రూపు దిద్దుకున్న స్త్రీవాద అధ్యయనాలకు విశేష శక్తి నివ్వటం జరిగింది. పుట్టుకతో ఎవ్వరూ స్త్రీలు కాదు, స్త్రీలుగా రూపొందుతారు. ఈ రూపొందటంలో నాగరికత నిర్వర్తించే పాత్ర చాలా కీలకమయినది అని 'సెకండ్ సెక్స్' మౌలిక ప్రతిపాదన. 1949లో ప్రచురితమయిన 'సెకండ్ సెక్స్' ఆ తరువాత వచ్చిన ప్రతి స్త్రీవాద రచనని ప్రభావితం చేసింది. ఈ రచనతో విభేదించిన స్త్రీవాదులు కూడా ఈ రచనకున్న చారిత్రక ప్రాధాన్యతని నిరాకరించలేక పోయారు. 'సెకండ్ సెక్స్' ఒక రకంగా బహుళ విషయాల్ని చర్చించిన రచన. చరిత్ర, శరీర శాస్త్రం, మానవ శాస్త్రం, సాహిత్యం, మనో వైజ్ఞానిక శాస్త్రం, మార్క్సిజంలాంటి అనేక రంగాల నుంచి ప్రేరణ పొందటమే కాక ఈ శాస్త్రాల మీద ఒకానొక విమర్శనాత్మక అంచనాని ముందుకు తెచ్చిన గ్రంథం కూడా.

ద బోవా ప్రతిపాదనల ప్రకారం చరిత్ర మొత్తంలో స్త్రీ పురుషుడికి object గా కుదించ బడింది. స్త్రీకి Subject స్థాయిని నిరాకరించిన పురుషుడు స్త్రీని 'పరాయి'గానే చూడటం జరుగుతూ వచ్చింది. సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ రంగాలలో తన Subjectivity ని ప్రతిష్ఠించుకున్న పురుషుడు సారాంశంలో భావజాలం మీద ఆధిపత్యం సంపాదించి స్త్రీని ఆ భావజాలానికి లోబడివుండేటట్టు చేయగలిగాడు. స్త్రీలు తమకి తముగా ఈ తప్పుడు చైతన్యాన్ని తమలో తము అంతరంగీకరించుకునేటట్లు చేయటంలో పురుషుడు విజయం సాధించాడు. అస్తిత్వవాద పరిభాషలో చెప్పాలంటే స్త్రీలలో ఒకానొక 'bad fiath' ని సృష్టించటం ద్వారా వాళ్ళు నిరంతరం 'inauthenticity' లో వుండేటట్టు చేయటం జరిగింది. నిజానికి పితృస్వామ్యం స్త్రీని చలన రహితమయిన ప్రాకృత అంశంగా, పురుషుడు నిరంతరం చలన సహితమయిన అంశంగా పరిగణిస్తుంది. తద్వారా స్త్రీకి స్వయం ప్రతిపత్తితో కూడిన విషయి స్థాయిని నిరాకరిస్తుంది.

'సెకండ్ సెక్స్' లో ఒకచోట స్త్రీకి పితృస్వామ్యం నిరాకరించిన స్వయం ప్రతిపత్తిని గురించి ద బోవా ఇలా అంటుంది - "Thus humanity is male and man defines woman not in herself but as relative to him; she is not regarded as an autonomous being... She is defined and differentiated with reference to men and he with reference to her; she is the inessential as offored to the essential. He is the Subject, he is the Absolute - She is the Other". (The Second Sex, P. 16) అసలు మొత్తం పితృస్వామ్యం పురుషుణ్ని ఒక ఆదర్శం లేక నమూనా లేక నియం(norm)గా, స్త్రీని విచలనం లేక వ్యతిక్రమం (deviation) గా చిత్రించింది. ఈ క్రమాన్ని 'సెకండ్ సెక్స్' తాత్వికంగా సవాలు చేస్తుంది.

'సెకండ్ సెక్స్'లోని "One is not born, but rather becomes, a woman" అనే సుప్రసిద్ధ వాక్యం సెక్స్‌కి జండర్‌కి వున్న మౌలిక వ్యత్యాసాన్ని స్పష్ట పర్చుతుంది. 'సెక్స్' అనేది స్త్రీ

పురుషుల మధ్య శారీరక నిర్మితిలో వున్న వ్యత్యాసాన్ని సూచిస్తుంది. శారీరక ప్రత్యేకతని తెలియజేస్తుంది. 'జండర్' అనేది ఇందుకు భిన్నంగా సామాజిక నిర్మితి, సమాజం ఈ జండర్ నిర్మితి చాలా సహజం అనుకునేటట్టుగా రూపొందిస్తుంది. సామాజికంగా రూపొందే జండర్ ప్రతి సమాజంలో అమలవుతూ అసమానత్వం, అణిచివేత, లైంగిక హింస లాంటి అమానుష రూపాల ఆవిర్భావానికి కారణమవుతుంది. వందల సంవత్సరాల నుంచి అమలులో వుంటూ వచ్చిన 'anotomy is destiny' అనే భావనని తిరస్కరించటానికి సెక్స్‌కి, జండర్‌కి మధ్య ద బోవా చూపిన విభజన శక్తివంతంగా ఉపయోగపడింది. Judith Butler అనే ప్రముఖ వర్తమాన స్త్రీ వాద తత్వవేత్త ద బోవా సెక్స్‌కి, జండర్‌కి మధ్య చూపిన విభజన గురించి ఇలా అంటుంది - "The distinction between sex and gender has been cruicial to the long - standing feminist effort to debunk the claim that anotomy is destiny: sex is understood to be the invariant anotomically distinct, and factic aspects of the female body, whereas 'gender' is the crucial meaning and form that that body acquires, the variable modes of that body's acculturation. (Yale French Studies, No. 72, P. 35).

ఈ పుస్తకంలో ద బోవా బాల్యం నుంచి ముసలి తనం దాకా ఒక స్త్రీ జీవితాన్ని, పరిణామాన్ని పరిశీలిస్తుంది. వ్యక్తి రూపొందే క్రమంలో తల్లి - బిడ్డల సంబంధం నిర్వర్తించే కీలక పాత్రని, చేసే ప్రభావాల్ని కూడా చర్చించటం జరిగింది. బాల, బాలికలిద్దిరికీ love object మొదట తల్లే అయినప్పటికీ మగపిల్లలు చాలా త్వరగా, చాలా తక్కువ వయస్సులోనే మగపిల్లలు తాము మాతృ ప్రభావ తలం నుండి విడిపోవటం అనివార్యమని గ్రహించటం జరుగుతుంది. అలా విడిపోవటానికి మగపిల్లలకుకుటుంబం నుంచి, సమాజం నుంచి మద్దత్తు, ప్రోత్సాహం లభిస్తుంది. ఆడపిల్లల్ని ఇందుకు భిన్నంగా తల్లికి సన్నిహితంగా వుంచటంలో, దైనందిన కార్యక్రమాలలో సహాయపడేటట్లుగా నియంత్రించటం జరుగుతుంది. ఆడపిల్లలు తల్లి పాత్రని అనుకరిస్తూ వుంటారు. ఆటల్లో తాము కూడా పిల్లల తల్లులులాగా బొమ్మలతో సంకేతిస్తూ వుంటారు. అయితే ఆడ, మగ పిల్లలు ఇద్దరూ తల్లికి వున్న పునరుత్పత్తి శక్తిని చూసి ఆకర్షితులవుతారు. ద బోవా మాటల్లో చెపితే తల్లి దగ్గర ఏవో మంత్రశక్తులున్నట్టు పిల్లలు భావిస్తారు. ఈ విషయంలో ఆడపిల్లలు కూడా తల్లిలాగా తమకూ ఆ శక్తి వున్నందుకు 'గర్వంగా' కూడా భావిస్తారు అంటుంది ద బోవా.

ఈ పుస్తకంలో చాలా సందర్భాలలో రకరకాలుగా సమాజం స్త్రీలమీద కొనసాగించే వొత్తిళ్ళను గురించి చర్చిస్తుంది. ముఖ్యంగా స్త్రీలను తల్లులుగా, భార్యలుగా కుటుంబానికి పరిమితం

చేయటంలో సమాజం ముందుకు తెచ్చే వొత్తిడి గురించి చర్చిస్తుంది ద బోవా. పెళ్ళికాకుండా ఇళ్ళలో వుండే స్త్రీలను కుటుంబానికి అనవసరపు అధనపు భారంగా చూడటం అనేది అన్ని సమాజాల్లో కన్పించే సాధారణాంశం. ఇలా చూడటం ఫలితంగా స్త్రీలు తాము అధములమని, తమకన్నా ఏ భర్త అయినా గొప్పవాడని అనుకునేటట్లు చేయటంలో సమాజం విజయం సాధించటం జరుగుతోంది. పిల్లలు కనటంలో కూడా సమాజం స్త్రీని పెద్దగా వొత్తిడి చేయకుండానే, వాళ్ళని అంగీకరింపజేయటం జరుగుతోంది. మాతృత్వం తప్ప వేరే స్థితి ఏదీ స్త్రీకి లేకుండా చేయటం ద్వారా స్త్రీ అనివార్యంగా సంతాన ఉత్పత్తి ఏ నిర్బంధం లేకుండానే కొనసాగించ గలగటం జరుగుతోంది. సంప్రదాయాలు, చట్టాలు స్త్రీని పెళ్ళి వైపు నెట్టటం, గర్భ నిరోధక పద్ధతులు అవలంబించకుండా చేయటం, అబార్షన్‌ను నిషేధించటం, విడాకుల్ని నిరాకరించటం లాంటివి చేస్తూ వుంటాయి. మాతృత్వమనేది సంప్రదాయ వాతావరణంలో స్త్రీకి ఒక స్వేచ్ఛాపూరితమైన ఎన్నికలాగా కాకుండా ఒక ఖైదుగా పరిణమించింది. గర్భం, పిల్లల పెంపకం, మెనుస్ట్రుయేషన్ లాంటి అంశాల్ని ప్రచారం చేయటం ద్వారా, వాటిని స్త్రీ బలహీనతలుగా చిత్రించటం ద్వారా స్త్రీవాద పురుషాధిపత్యాన్ని నెలకొల్పటం సులభతరమౌతోంది. మాతృత్వమనేది సారాంశంలో స్త్రీని ఒకానొక ట్రాప్‌లో పడవేస్తోంది. ఆక్రమంలో స్త్రీ యవ్వనాన్ని, శక్తిని, జీవితం పట్ల ఆమెకు వుండే ఆకర్షణను క్రమంగా ధ్వంసం చేయటం జరుగుతోంది.

'సెకండ్ సెక్స్'లో చాలా చోట్ల ద బోవా తన స్వంత జీవితంలోని యదార్థ సంఘటనలను ఉదహరించటం ద్వారా అనేక సంక్లిష్ట విషయాల్ని స్పష్టం చేయటం జరుగుతోంది. క్యాథలిక్ కుటుంబాల్లో, ముఖ్యంగా తన తరం వాళ్ళను వీలున్నంత మంది పిల్లల్ని కనటానికి ప్రోత్సహించిన వైనాన్ని వివరించటం జరిగింది. అలా కనటాన్ని మతం చట్టబద్ధం చేసిన వైనాన్ని కూడా ద బోవా విశ్లేషిస్తోంది. ఈ సందర్భంలో సెయింట్ అగస్టిన్ ప్రకటనను ఉదహరిస్తుంది. సెయింట్ అగస్టిన్ ఇలా అన్నట్లు ఆమె ఉదాహరిస్తుంది - ''ఎంతమంది పిల్లల్ని కనగలిగిన శక్తి ఒక స్త్రీకి వుందో అంతమంది పిల్లల్ని కనకుండా వుండేందుకు ఆ స్త్రీ తీసుకునే ఏ చర్య అయినా అంతమంది శిశు హత్యలకు కారణమైన నేరం చేసినట్లే.''

ద బోవా దృష్టిలో మగవాడు పిల్లల్ని కనటంలో స్త్రీకి వున్న స్వయం ప్రతిపత్తిని నిరాకరిస్తూనో, తప్పుదోవ పట్టిస్తూనో వచ్చాడు. ఈ సందర్భంలో గ్రీకు విషాదాంత నాటక కర్త **Aeschylus** రాసిన ఒక వాక్యాన్ని ఉదాహరిస్తుంది. **Aeschylus** ప్రకారం 'తన బిడ్డ' అని అందరూ అంటూ వున్నట్టుగా ఒక బిడ్డకి జీవితమిచ్చేది తల్లి కాదు, ఆమె కేవలం తన వక్షంలో వేయబడిన బీజాన్ని పెంచుతుంది. అసలు ప్రాణం ఇచ్చేది తండ్రి. తల్లి కేవలం దైవ ఆజ్ఞ అనుసారం ఆ బిడ్డకు గార్డియన్.

ఇలా అనటం ద్వారా Aeschylus సమాజంలో స్త్రీ స్థానాన్ని, సమాజానికి ఆమె ఇచ్చే అంశాల్ని నిరాకరించటం జరుగుతోంది. అలాగే క్రైస్తవ మతంలోని వర్జిన్ మేరీ కల్ట్ అనేది పురుష ప్రపంచం సాధించిన అత్యున్నత విజయం. తన కుమారుడి పాదాలముందు మోకరిల్లటంలో మేరీ ప్రదర్శించిన ఆసక్తి పురుషుడి ఆధీనంలోకి స్త్రీని స్త్రీని నెట్టటాన్ని సంకేతించే విషయం. వర్జిన్ మేరీ కల్ట్ ఒక ఆదర్శపూరిత స్త్రీకి సంబంధించిన మిత్‌ని ముందుకు తెస్తుంది. ఈ మిత్ ఒక రకంగా స్త్రీ ఒక ఐహిక (Carnal) జీవి అని పురుషుడు గుర్తించకుండా వుండేందుకు ఉపయోగపడుతుంది. స్వచ్ఛమైన, దైవీకరించబడిన స్త్రీ దైహికమైనది కాకపోవటం వల్ల ప్రమాదరహితమయినది.

ద బోవా దృష్టిలో పురుషుడికి తాను 'పరాయి'గా చూస్తున్న స్త్రీమీద ఆధిపత్యం చలాయించాలని వుంటుంది. గత రెండువేల సంవత్సరాల పాశ్చాత్య చరిత్రలో ఈ విషయం స్పష్టమయింది. నిరంతరం స్త్రీ సంబంధంలో పురుషుడు లెక్కలేని తనంలో వుంటూ క్రమంగా స్వార్థపరుడూగా, నైతిక వ్యవస్థలో ద్వంద ప్రవృత్తితో వుంటూ, సారాంశంలో అదే నైతిక చట్రాలతో స్త్రీని అదుపు చేయటం జరుగుతోంది. స్త్రీ పురుషుల మధ్య సంబంధాలు. పురుషాధిపత్యం, స్త్రీ ఉదాసీనత్వం అనాగతి తర్కం చుట్టు నిర్మించబడుతున్నాయి. ఫలితంగా పురుషుడు ఆలోచనా రహితమయిన అధికార వాదంలో కూరుకుపోవటం జరుగుతోంది. స్త్రీ, పురుషులు ఇద్దరూ తమ నిజమైన అవసరాల్ని వ్యక్తీకరించుకునే స్థితిలో లేరు. ఇద్దరి ప్రవర్తనా ఒకానొక తప్పుడు విశ్వాసంలోంచి రూపొందుతోంది. స్త్రీ, పురుషుల మధ్య వున్న ద్వందాన్ని అధిగమించటం అనేది హేతుబద్ధ కార్యాచరణ ద్వారానే సాధ్యపడుతుంది. ముఖ్యంగా స్త్రీ తన శరీర సంబంధ పరిమితులు, సమాజం విధించిన పరిమితుల్ని అధిగమించాల్సిన అవసరం వుంది.

స్త్రీ లైంగికతతో పోల్చినప్పుడు పురుషుడి లైంగికతని ఆవరించి వున్న సమస్యలు అల్పం. 'సెకండ్ సెక్స్'లో స్త్రీ లైంగికతని ఆవరించి వున్న అనేక విషయాల్ని చాలా లోతుగా చర్చించటం జరిగింది. ముఖ్యంగా స్త్రీకి బహిష్టు అనేది ఒక అవమానకర, బాధాకర అంశంగా పరిణమించిందని, గర్భం అనేది ఒక పరాయి శరీరం స్త్రీ శరీరం మీద చేస్తున్న దాడిగా, పిల్లల పుట్టుక కూడా స్త్రీకి ప్రమాదకారిగా, కష్టంతో కూడిన విషయంగా వుందని సుదీర్ఘంగా చర్చిస్తుంది. Kathleen Wood - Ward అనే ఆమె ఇలా అంటుంది. "According to beauvoir, woman's body is a burden, and only after menopause is a woman truly herself". (Twentieth Century Literacy Criticism, Val. 71, P. 76) మెనోపాజ్ తరువాత మాత్రమే స్త్రీ, ఆమె శరీరం ఒకటి వుండటం సాధ్యం. ఈ విషయాలతో పాటు చాలా సందర్భాలలో ద బోవా స్త్రీ సామాజికరింప బడుతున్న క్రమాన్ని గురించి చాలా లోతుగా చర్చిస్తుంది.

స్త్రీ లైంగికతని, సామాజికంగా కొనసాగుతూ వున్న స్త్రీ అణిచివేతని అనేక పార్శ్వాలలోంచి విశ్లేషించటానికి ప్రయత్నించిన మొదటి గ్రంథంగా 'సెకండ్ సెక్స్'ని చెప్పవచ్చు. ఆ తరువాత వచ్చిన స్త్రీవాద తాత్విక గ్రంథాలు 'సెకండ్ సెక్స్' పరిమితుల్ని అధిగమించగలిగినప్పటికీ ఈ పుస్తకం ఇచ్చిన ప్రేరణ నిరాకరించ లేనిది. ఈ పుస్తకం వెలువడిన కాలాన్ని గురించి కొంత చూస్తే ఈ గ్రంథం చారిత్రకంగా నిర్వర్తించిన పాత్ర కొంతయినా అవగతమవుతుంది. 1947లో ద బోవా ఈ గ్రంథ రచనకుపక్రమించినప్పుడు అప్పుడే ఫ్రాన్స్ జర్మన్ ఆధిపత్యం నుంచి, విచీ (Vichy) పాలన నుంచి బయటపడే ప్రయత్నంలో వుంది. అప్పటికి ఫ్రెంచి స్త్రీలకి ఓటు హక్కు వచ్చి మూడేళ్ళు కూడా కాలేదు. 1949లో ఈ పుస్తకం ప్రచురింపబడే నాటికి కూడా గర్భనిరోధం, అబార్షన్ రెండూ చట్టవ్యతిరేక అంశాలుగానే వున్నాయి. నిజానికి ఫ్రాన్స్‌లో 1967లో మాత్రమే గర్భ నిరోధ సాధనాల అమ్మకం చట్ట బద్ధం చేయబడింది. ఈ నేపథ్యంలో చూసినప్పుడు 'సెకండ్ సెక్స్' గ్రంథంలో వున్న రాడికల్ అంశం విశదమవుతుంది.

ఈ గ్రంథం రాసిన మూడు దశాబ్దాలు గడచిన తరువాత ద బోవా ఆలోచనా పరిధి మరింత విస్తృతమయింది. ఈ పుస్తకం రాసేనాటికి స్త్రీ అణిచివేతని సోషలిజం మాత్రమే అంతం చేయగలదని స్పష్టంగా నమ్మి తనని తను స్త్రీవాదిగా కాక, ఒక సోషలిస్టుగా చిత్రించుకుంది ద బోవా. అయితే 1972 నాటికి ఆమె ఆలోచనలో చాలా మార్పు వచ్చింది. క్రమంగా స్త్రీ విముక్తి ఉద్యమంలో చేరింది. బహిరంగంగా తనని తాను స్త్రీవాదిగా ప్రకటించుకుంది. అయితే ఇక్కడ ఒక విషయం మాత్రం స్పష్టంగా గుర్తించాలి ద బోవా తాను సోషలిస్టునని 'సెకండ్ సెక్స్' రాసే నాటికి చెప్పుకున్నప్పటికీ మౌలికంగా, ఆ గ్రంథానికి ప్రేరణ మార్క్సిజం కాదు, అస్తిత్వవాదం. 1960ల తరువాత వచ్చిన 'Sexual Politics' లాంటి గ్రంథాలకు ప్రేరణగా నిలచిన 'సెకండ్ సెక్స్' క్రమంగా తీవ్ర విమర్శలకు గురియనప్పటికీ ఒక మౌలిక గ్రంథంగా స్త్రీవాద ఉద్యమాలా చరిత్రలో ఈ రచనని ఒక విశిష్ట స్థానం వుంది. నిజానికి ద బోవా మీద వచ్చిన చాలా విమర్శలకు 1972లో Alice Schwarzer కి ఇచ్చిన ఇంటర్వ్యూలో చాలా సమాధానాలు, కొన్ని కొత్త ప్రతిపాదనలు, పరిశీలనలు కనిపిస్తాయి.

> ప్రేమించడమెలాగో మగవాళ్ళు మరిచిపోయారు. ఆడవాళ్ళు అలా చేయకుండడమెలాగో మరిచిపోయారు. మనలను ఇప్పటివరకు బ్రతికించిన దానిని మరచిపోయే ప్రయత్నం చేద్దాం. నా ఉన్నదానికి ఆత్మహత్యకు నేనెంచుకొన్న ఆచ్ఛాదనం విప్లవం.
>
> **– Robin Morgan**

# సృష్టి చేసిన తప్పుకి సిలువమోస్తున్న స్త్రీ, పురుషులు

– సి. ధర్మారావు

స్త్రీనాం ద్విగుణమాహారం బుద్ధిచ్చాపి చతుర్గుణిమ్
సాహసం షడ్గుణం చైవ కామోష్టగుణ ముచ్యతే !

మన దేశ వారసత్వంలో భాగమైన ఈ సంస్కృత శ్లోకం చాలామందికి తెలిసే వుంటుంది. ఆహారం రెండురెట్లు, బుద్ధి నాలుగు రెట్లు, సాహసం ఆరురెట్లు, కామం ఎనిమిదిరెట్లు స్త్రీకి (పురుషుడికంటె) ఎక్కువ అని దీని అర్థం, అభిప్రాయం. అభిప్రాయం అని ఎందుకు అనవలసి వచ్చిందంటే, ఈ శ్లోకంలోని విషయాన్ని విశ్లేషించి శాస్త్రీయంగా రుజువు చేసే ప్రయత్నం ఎక్కడా కనబడదు. ఆహారం, బుద్ధి, సాహసం, కామం అనే నాలుగు గుణాల్లో కనీసం మొదటిది కొలమానానికి తేలిగ్గా అందుతుంది. మిగతావి అట్లా అందవు. మరి మన అనుభవంలో స్త్రీకి ఆకలి పురుషుడి కంటె రెట్టింపంటే ఎవ్వరం ఒప్పుకోం. దీనివల్ల మిగత మూడు అంశాల్లోని సబబును కూడా సందేహించ వచ్చు. చిత్రమేమిటంటే, లోకం అట్లా అనుకోదు. ఆ మూడు అంశాలు నిజమే అయి వుండవచ్చు అని పురుషుడి గుండెల్లో ఒక అనుమానం, ఒక భీతి ఏ మూలో గూడు కట్టుకునే వుంది. ఇది ఎందువల్ల? మానవ స్త్రీ, పురుషుల మధ్య అనాదిగా వున్న రాగ ద్వేషాల బంధంలో ఇదొక భాగమై వుండాలి. అయితే, కామ ప్రవృత్తి విషయంలో స్త్రీ, పురుషుల మధ్య వున్న భేదాలు అల్పమైనవి కావు. శాస్త్ర పరిశోధనలు తేల్చిన అంశాలు ఇవి :

| పురుషుడు | స్త్రీ |
|---|---|
| 1. కామప్రేరకాల్ని బాహ్యంగా చూసిన మాత్రాన విన్న మాత్రాన, ఊహించుకున్న మాత్రాన వెంటనే ఉద్రేకపడిపోతాడు. | 1. అట్లా లేదు. స్పర్శ, సాన్నిహిత్యం, సమయం కావాలి. |
| 2. భాగస్వామిని మారిన కొద్దీ రెచ్చిపోతాడు. రంగు, జాతి, దేశం, ఆఖరికి కులం ఇతని రంధికి మంచి సమిధలు. | 2. అట్లాలేదు. కొత్త వారితో సంపర్కం ఇచ్ఛగించదు. వేశ్య అయినా భయం భయంగా మసలుకుంటుంది. |
| 3. రతి కార్యాన్ని సృష్టి ప్రధానంగా జాతి కొనసాగింపుకు వుద్దేశించిందన్న స్పృహే వుండదు. తన ఒత్తిడి విడుదలే ఇతనికి సర్వస్వం. | 3. ఈమెకు అలాంటి ఒత్తిడి వుండదు. గర్భధారణ ఎప్పుడూ స్పృహలో వుంటుంది. |

సి. ధర్మారావు, రచయిత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘం మాజీ కార్యదర్శి, మరియు 'నడుస్తున్న చరిత్ర' మాస పత్రిక గౌరవ సంపాదకులు, హైదరాబాదు.

| | |
|---|---|
| 4. పై మూడో అంశానికి కొనసాగింపుగా స్త్రీని తన భోగానికి ఉపకరణంగా, తన సుఖానికి సాధనంగా భావించటం కద్దు. రతి ఇద్దరూ ఆడి ఇద్దరూ గెలవవలసిన క్రీడ అన్న ఆలోచనే లేదు. | 4. స్త్రీ క్రమంగా ఈ భావానికి రాజీ పడింది. ఈ తతంగం ఎప్పుడు ముగుస్తుందా, అతనికి సంతోషమైందా అనుకుంటుంది. |
| 5. రతికార్యంలో ఇతని తృప్తికి ఎన్నో చదరపు అంగుళాల చర్మపు రాపిడి అనువుగా వుంది. | 5. అలాంటి తృప్తికి ఈమె మర్మాంగం దాదాపు నిరర్థకం. ఒక చిన్న బొడిపెలో, రాపిడి మార్గంలో కాక పెడగా, ఈమె తృప్తి రహస్యం వుంది. |
| 6. రతి అన్నది తాను, తానే స్త్రీకి చేయవలసి వున్నదని, అది తన ఆధిక్యతకు, మగటిమికి తిరుగులేని రుజువు, సవాలూ అని భావిస్తాడు. | 6. ఇందులో మొదటి అంశం ఈమె కూడ నమ్ముతుంది. రెండోది - ఆమెకంత సంతోషం కలిగించే సంగతి కాదు. పట్టించుకోదు. |
| 7. నడిమి వయస్సునుంచీ అంగస్తంభన విషయంలో ఇతని భయాలూ, మానసిక క్షోభా, ఎక్కడా పోలికకు అందనివి. ఇతని శాపం. | 7. ఈ సమస్య లేదు. |
| 8. ఆధునిక యుగంలో స్త్రీవాదం పుంజుకుని, స్త్రీ భావ తృప్తి రంగం మీద కొచ్చిన కొద్దీ, ఇతని క్షోభ ఇంకా ఇంకా పారం ముట్టుతుంది. | 8. ఈ అవగాహన స్త్రీ వాదుల్లో ఇప్పుడిప్పుడే కలుగుతున్నదేమో, అయినా పరిష్కారం వాళ్ళకీ తోచటం లేదు. |
| 9. కామప్రేరణ ఇతనికి ఎంత శీఘ్రమో, తృప్తి కూడా అంత శీఘ్రం, తర్వాత స్పందన, ప్రతి స్పందనలు అంతంత మాత్రం. | 9. ప్రతిస్పందన కలగాలేగాని, దాని కొనసాగింపు, దానిలో నిలకడశక్తి అపారం, దీనినే మన సంస్కృత శ్లోక కర్త స్త్రీ కామంగా అపార్థం చేసుకున్నాడు. |
| 10. శీఘ్ర స్ఖలనం దాదాపు సార్వజనీనం. సహజంగా ఇతనికున్న రంధికి ఇది అనివార్య ఫలితమేమో. ఇది ఇతనికి మిక్కిలి నిస్పృహ కలిగిస్తుంది. | 10. ఎప్పుడు తతంగం ముగుస్తుందా అనుకునే స్త్రీకి, ఇది ఊరట. ప్రతిస్పందన అందుకుంటున్న అరుదైన సందర్భాల్లో ఈమెకి మరింత నిస్త్రాణ. |
| 11. స్త్రీ, పురుషుల కలయికల్లో ఎక్కువ భాగం భావప్రాప్తి, లేదా కనీసపు ఊరట ఇతనికి లభిస్తుంది. | 11. ఈమెకు కలగవు. |

ఈ వ్యత్యాసాలలో మొదటి అయిదు - సంతానోత్పత్తి కని ప్రకృతి కనపరిచిన అపరిమిత శ్రద్ధ వల్ల కలిగినవే. 'అపరిమితం' అన్నాచాలకుండా, ఈ విషయంలో 'అతి'గా పోయింది, ప్రకృతి. 'అతి సర్వత్ర వర్జయేత్' అని, పాపం, ప్రకృతి ఎరక్క పోయింది. పదీ, పదకొండూ అంశాలు ఈ ప్రకృతి వ్యసనం నుంచి నేరుగా కలిగిన దుష్ఫలితాలు. ఇక తొమ్మిదో అంశం కొంత విచారించ దగ్గది. ప్రతి స్పందనలో స్త్రీకి వున్నట్లు, పురుషుడి క్కూడ నిలకడ వుంటే సరిపోయేది గదా. లేదా ప్రేరణలోనే పురుషుడికి వున్న ఆబలో సగమైనా స్త్రీకి కూడ వుండవచ్చుగదా. మనిషి పరిణామక్రమం, అతని మెదడు, హృదయాల వికాసం వద్దకు వచ్చేప్పటికి ప్రకృతి గందరగోళంలో పడ్డట్టు కనుపిస్తుంది. మిగత జంతుజాలానికి సమానమైన ఒక్క పునరుత్పత్తి విషయికంగా అతనికి జంతు ధర్మాన్నే అంటగట్టి, అతనికి అత్యంత విలక్షణంగా ఆలోచనా నిశితత్వం, సుకుమార చేతన 'అంటు' కట్టటంలో అర్థమేమిటి? ఇంకా అతగాడి పరిణామంలో దాని జోక్యం చాపకింద నీరులాగ కొనసాగుతున్నదా, లేదా ప్రకృతి ఇతని విషయంలో చేతులెత్తేసిందా ?

**పురుషుడి నడ్డివిరిచిన బరువు**

ఏ ఒక్క సమాజంలోనో కాక, పురుషాధిక్య భావం వల్ల లోక వ్యాప్తంగా స్త్రీకి ఎంత అన్యాయం అనాదిగా జరిగిందో గుట్టల కొద్దీ సాక్ష్యం వుంది. ఆ అన్యాయం ఈ నాటికీ కొంత తక్కువ మోతాదులో కొనసాగుతూనే వుంది. ప్రాణాంతకమైన ఈ భావం అనేక కారణాల వల్ల కలిగి, క్రమంగా కరుడు గట్టి పోయింది. ఆదిలో ఆహార సేకరణకని, ఆ తర్వాత జీవనోపాధికని పురుషుడు బయటికి వెళ్లటం తప్పనిసరయింది. పిల్లలను, వృద్ధులను చూసుకోటానికి స్త్రీ ఇంట్లో వుండేది. గర్భధారణ సమయమైతే సరే సరి. ఇవన్నీ కాక సహజంగానే పురుషుడు స్త్రీ కంటే బలిష్ఠుడు. బాహ్యంగా ఇవన్నీ ఆధిక్య కారణాలే అయినా, స్త్రీకి నరనరాన ఈ భావం జీర్ణించుకునేటంత స్వకీయమైనవి కావు. పైగా సంతానాన్ని తానే ఇవ్వగలననే గర్వం ఆమెకు. మరి పురుషాధిక్య భావానికి దాసోహం అని ఆమె అన్నది రతి కార్యం మూలాన. అది పురుషుడే చెయ్యవలసిన, చెయ్యగలిగిన పని అని, అది అతని క్రియా శీలతకి కార్య శూరతకి ఒక రకంగా నిదర్శనమని, ఆ సమయంలో తాను కదలకుండా పడుకుని వుండటం తప్పించి తన వంతు పాత్ర ఏకోశానా లేదనే భావం లోలోన పాతుకుపోయింది. సామాజిక, శారీరక, ఆర్థిక కారణాలు వదిలి పెట్టిన కొంత ఖాళీని రతి క్రమం భర్తీ చేసింది. స్త్రీ బడుగు జోడీ అయింది.

విషాదమేమిటంటే - సామాజిక, శారీరక, ఆర్థిక కారణాలు పురుషుడి నెత్తిన ఎత్తిన ఆధిక్యతా భావపు బరువు ఎంత భారమైనా అతడు పళ్ల బిగువునైనా మోయటానికి సంసిద్ధుడే. ఎందుకంటె సంఘంలో అది అతనికి గొప్ప హోదానిస్తుంది. గర్వంగా తలెత్తుకు తిరగగలగటం కంటె మనిషి ఏమి కోరుకుంటాడు? కాని రతిక్రియలో - అది చేసేది తానే అన్న అధిక్యతా భావం, దాని కారణంగా అతడు ఎత్తుకున్న బరువు అతని నడ్డి విరిచింది.

**అనుమానం, భయం**

మనుష్య జాతి ఇన్ని వేల ఏళ్ల అనుభవం తర్వాత కూడ, కామకలాపం వివేకం వున్న స్త్రీ పురుషు లిద్దరూ పాల్గోవలసిన క్రీడ అని గ్రహించుకోక పోవటం ఆశ్చర్యమే కాక అగమ్యం అనిపిస్తుంది. ఆదాం, ఈవ్‌ల కథ వల్ల కాబోలు - క్రైస్తవ ప్రపంచం ఈ కలాపమే పాప కార్యం అన్న భావాన్ని ప్రచారం చేసి చేసీ, ఒక సహజ శారీరక ధర్మానికి మతపు మసక అద్దాలు తగిలించింది. ఈ శారీరక ధర్మాన్ని లొంగ దీయటం దాదాపు అసాధ్యం గనుక, అట్లాంటి ప్రచారం అనివార్యంగా అపరాధ భావానికీ, నయవంచనకి కారణమైంది. దీనికి తోడు సార్వజనీనంగా పురుషుడి అనుమానం వుండనే వుంది. ఈ అనుమానం ఎక్కడి నుంచి వచ్చింది? ఎప్పుడైతే రతి కలాపం పూర్తిగా తన బాధ్యత అని పురుషుడు భావించుకున్నాడో, అది అతని ప్రావీణ్యానికి పరీక్ష అయింది. 'మగటిమి' కి సవాలైంది. పైగా, యౌవన ప్రాయంలో అతని రంధి ఎంతగా అతని కళ్లు కప్పినా, ఆ పొందు చల్లారాక, ఈ రతి కార్యంలో తన స్త్రీ, తనంత సంతోషాన్నీ, కనీసం తృప్తినీ పొందటం లేదనే వాస్తవానికి అతని కళ్లు తెరుచుకుంటయి. ఇది అతని పాలిట పిడుగు పాటు! తన తృప్తికి, సంతోషానికి తన స్త్రీ వేరే జత కోసం చూస్తుందేమో అన్న అనుమానం తొలచటం మొదలవుతుంది. ఇది క్రమేణా పిశాచమై పీడించవచ్చుకూడ. తన జన్యు లక్షణాలు అంది పుచ్చుకుని, తన ఆస్తికీ, ప్రతిష్ఠకి వారసుడిని ఇవ్వాల్సిన స్త్రీ మరొకడి వైపు చూడటమే! ఈ ఉత్పాతం తప్పించటానికి హిందూ సంఘం పాతివ్రత్యం అనే కొత్త ధర్మాన్ని కనిపెట్టి, స్త్రీకి నూరి పోసీ పోసీ ఆమెని కట్టి పడెయ్యాలని చూసింది.

అసలే అజ్ఞానం, దానికి ఆజ్యం పోసే అనుమానం! భయం! శీఘ్ర స్ఖలనపు బెంగకి ఈ వికారాలు తోడైన పురుషుడు ఏమవుతాడు? ఒక్కసారి, ఒకే ఒక్క సారి రతిలో ఏ కారణాల వల్ల తాను ఓడినా ఈ భయాలూ, వికారాలూ అన్నీ చుట్టు ముడతాయి. తన స్త్రీ ఎంత దాచుకున్నా, తన ఓటమి వల్ల ఆమెకి చులకనైనట్టు, ఆమె హావభావాల్లో, కదలికల్లో ఎక్కడో తనని పరిహసిస్తున్నట్టు భావించుకుంటాడు. అది అతనికి జన్మాంతం మానని గాయం. క్రమంగా స్త్రీ అంటే భయం, ద్వేషం ఏర్పడతాయి. వట్టి అనుమానంతో భార్యల్ని తుదముట్టించటం చరిత్రలో అనాదిగా పురుషుల నిత్య కర్మ, కసితో అత్యాచారాలు, మూకుమ్మడి మానభంగాలు, తదనంతర హత్యలు కొల్లలు.

**సృష్టి లోపాల్ని బోధ పరచాలి**

ఎంతో సుందరమై, సున్నితమై, తలపుతో పులకింత కలిగి పొందుతో పరవశత్వం కలిగించవలసిన స్త్రీ, పురుష సహజ బంధంలో ఈ కృష్ణ పక్షం ఎట్లా చొరబడింది? మనం మొదట అనుకున్న వ్యత్యాసాలలో ఆరు, ఏడు, ఎనిమిది అంశాలు సమాజపరంగా, తన మనస్తత్వ పరంగా పురుషుడు కొని తెచ్చుకున్న ఆపదలు - ప్రకృతి సిద్ధమైనవి కావు. మనిషి కల్పించుకున్న 'సంస్కృతి' తెచ్చిపెట్టిన

సమస్యలు. మిగత ఎనిమిదీ ప్రకృతి చేసిన తప్పిదాలు పైగా దిద్దుబాటుకు అందనవి గదా ఈ ప్రకృతి చైదాలు !

సృష్టి చేసిన ఈ తప్పిదాల వల్ల - ఇందులో తన పాపమేమీ లేదని ఎరక్క పోవటం వల్ల, 'మగమహారాజు' ఎన్నో రకాల వికారాలకి, రుగ్మతలకి లోనయ్యాడు. పుట్టు నపుంసకత్వం సరే, భయజనిత నపుంసకత్వం లోకంలో చాలా ఎక్కువ. ముఖ్యంగా అవివాహితులు వైద్య సహాయానికి వెళ్లే అన్ని ఇతర రుగ్మతల కంటె ఈ కేసులు ఎక్కువ. శీఘ్ర స్ఖలనపు బెంగను గురించి ముందే ప్రస్తావించుకున్నాం. దీనికి ప్రతిగా స్ఖలన ప్రతిరోధం కూడ వుంది. స్వలింగసంపర్కం కూడ ప్రధానంగా రతి భంగ భయం నుంచి క్రమంగా అలవడేదే. ఇట్లాంటి భయం వల్ల, స్త్రీ జోలికి పోకుండా, ఆమె లోదుస్తుల్ని, పిన్నుల్ని, మెట్టెల్ని చూసుకుని ఉద్రేకపడే వికారం ఒకటివుంది. తన అంగం బహిరంగంగా ప్రదర్శించు కోవాలన్న వికారం మరొకటి. జంతువులతో సంపర్కం, పిల్లలపై అత్యాచారాలు వంటి వన్నీ ప్రాథమికంగా స్త్రీ భయం నుంచి పుట్టేవే. కామ కలాపమంటే మగవాడికి అతిగా వున్న యావ, వృథాదర్పం ఒకవైపున, స్వంత జోడీ విషయంలో నెత్తికెత్తుకున్న పూర్తి బాధ్యత మరొకవైపున అనాదిగా స్థిరపడ్డ వేశ్యా వృత్తికి ఆలంబనాలయ్యాయి.

సృష్టి లోపాలు అంటున్నాం - 'మనిషి' అనే ఇంత పరమాద్భుతాన్ని రూపొందించిన ప్రకృతి తప్పులు చేసిందా అని ఈనాడు అంతగా సందేహ పడరనుకుంటాను. ఎన్నో జంతు జాతులు అనుకూల నిర్మాణంతో, ప్రతికూల పరిసరాల్లో అంతమొందిన విషయం గ్రంథస్థమైందిగదా. దుప్పికి ఆ బ్రహ్మజెముడు కొమ్ములు సాయంకంటె హానే ఎక్కువ చేస్తున్నాయి. పరిణామ క్రమానికే మకుటాయమానమైన మనిషిలోనే - చిన్న పేగులు, పెద్ద పేగుల మధ్య నిక్కిచూసే 'అపెండిక్సు' పరమార్థమేమిటో ఈనాటికీ అంతుబట్టలేదు. అది వికటిస్తే మనిషికి ప్రాణాంతకమే.

సృష్టి చేసిన తప్పుకి సిలువ తాము మోస్తున్నామనే సంగతిని స్త్రీ పురుషులు గ్రహించుకున్న రోజు, తమ పరస్పర భయ సందేహాల్ని పారదోలుకున్న రోజు, ఒకింత వివేకంతో ప్రతి రోధాల్ని దాటి స్వేచ్ఛగా, సంతోషంగా జత కట్టిన రోజు మానవ జాతికే పునర్జన్మం అవుతుంది.

ఏ స్త్రీనీ ఎప్పుడూ గూడ ఆమె చేసిన పని ప్రతిభను దృష్టిలో ఉంచుకొని చూడరు. ఆమెను సెక్స్‌గా చూస్తారు. అందుకని ఆవిడ జీవన హక్కును కోల్పోకుండ ఉండాలంటే, ఏ రంగంలోనైనా తన స్థానాన్ని కాపాడుకోవాలంటే, ఆమె సెక్స్ పరంగా దయ చూపాల్సిందే. ఈ విధంగా తాను వివాహంలో గాని, వివాహం వెలుపల గాని, ఒక మగానికి గాని పదుగురు మగాళ్ళకు గాని తనను అమ్ముకోవలసిందే.

**– Emma Gold Men**

# దైనందిన జీవితంలో సెక్సువాలిటీ

– అంపశయ్య నవీన్

'సెక్సువాలిటి' అనే ఇంగ్లీషు మాటకు సరిఅయిన తెలుగు మాట దొరకడం కష్టమే - 'లైంగికత' అనే మాట సెక్సువాలిటి అన్న మాటలో ఉన్న విస్తృతమైన భావాన్ని స్ఫురింపజెయ్యదు. మొదట్లో 'సెక్సువాలిటి' అనే ఇంగ్లీషు మాటను స్త్రీ పురుషుల అంగాంగ సంబంధమైన దైహిక క్రీడ అన్న అర్థంలోనే వాడేవాళ్ళు. ఈ మాటలోనే పునరుత్పత్తి కోసం ఉద్దేశించబడిన ప్రక్రియ అనే భావం కూడా ఉండేది. కానీ సిగ్మండ్ ఫ్రాయిడ్ సెక్సువాలిటీ అనే ఈ మాటకు చాలా విస్తృతమైన అర్థాన్నిచ్చాడు. పునరుత్పత్తితో ఎలాంటి సంబంధం లేకుండా, అందుకోసం ఉద్దేశించబడిన అంగాంగాలతో ఎలాంటి సంబంధం లేకుండా మనిషి అనేక రకాలుగా తనలోని సెక్స్ కోరికల్ని తీర్చుకుంటాడు. బాల్యంలో పిల్లలు చేతివేళ్ళను నోట్లో పెట్టుకొని చూషించడం ద్వారా పొందే సుఖం కూడా సెక్సువాలిటీ కిందకే వస్తుందంటాడు ఫ్రాయిడ్. ఇదొక రకమైన పర్వర్షనే - జననాంగాలతో కాకుండా వేరే రకంగా సెక్స్ సుఖాన్ని పొందటాన్నే పర్వర్షన్ అంటాం.

ఇదివరకు చాలామంది అనుకున్నట్టుగా ఓ వ్యక్తి సెక్స్ జీవితం ఆరంభ యౌవనంతోనే (Puberty) ప్రారంభం కాదు. శిశువు పుట్టినప్పట్నించే - అంటే పాల కోసం తల్లి స్తనాన్ని చూషించడం ప్రారంభించినప్పట్నించే మనుష్యుల్లో సెక్సువాలిటి ప్రారంభమౌతుంది. తల్లి స్తనాన్ని చూషించడం ద్వారా శిశువు తన ఆకలిని మాత్రమే తీర్చుకోవడం లేదు - వేరే సుఖాన్ని కూడా అనుభవిస్తున్నాడు. ఈ సుఖం సెక్సువాలిటీకి సంబంధించింది. ఈ సెక్సువాలిటీతో ఇమిడి ఉన్న సుఖం కోసమే మనిషి తన జీవితమంతా అన్వేషిస్తుంటాడు.

శిశువు తల్లి స్తనాన్ని చూషించడం ద్వారా పొందే సుఖానికి దూరమైనప్పుడు ఆ సుఖాన్ని తన చేతివేళ్ళను చూషించడం ద్వారా పొందుతాడు. ఇలా మనిషిలో సెక్సువాలిటీకి సంబంధించిన పర్వర్షన్స్ (వక్రమార్గాలు) బాల్యంలోనే ఏర్పడతాయి. వేళ్ళను చూషించడం అనేది అలాంటి ఒక పర్వర్షన్. సహజమైన పద్ధతిలో కాకుండా వక్రమార్గంలో మన కోరికల్ని తీర్చుకోవడం పర్వర్షన్ అంటాం. స్వలింగ సంపర్కం (హోమొ సెక్సువాలిటి) అనేదొక పర్వర్షన్. ఇది వ్యక్తుల్లో చాలా చిన్న తనంలోనే ప్రారంభ మౌతుందంటాడు ఫ్రాయిడ్. అపొజిట్ సెక్స్‌కు చెందిన అంగాంగాల ద్వారా కాకుండా తన అంగాంగాల ద్వారానే సెక్స్ సుఖాన్ని పొందటానికి ప్రయత్నించడమే హోమొ సెక్సువాలిటీ యొక్క ప్రారంభదశ. శిశువు తన వేళ్ళను చూషిస్తూ సుఖాన్ని పొందటం అలాంటిదే. మాస్టర్‌బేషన్ ద్వారా (హస్తప్రయోగం) సుఖాన్ని పొందటం, అద్దంలోనూ, ఫోటోల్లోనూ మన రూపాన్ని చూసుకుంటూ తృప్తి పొందటం మొదలైనవన్నీ హోమొ సెక్సువల్ లక్షణాలే. తన రూపాన్ని తాను అమితంగా ప్రేమించు కోవడాన్నే "Narcissism" అంటారు. ఇది మరీ ముదిరిపోతే అపొజిట్ సెక్స్ పట్ల ఆకర్షణ అంతరించి

అంపశయ్య నవీన్‌గా ప్రసిద్ధులు, ప్రముఖ నవలా రచయిత, వరంగల్.

స్వలింగ జాతీయులమీద ఆకర్షణ పెరుగుతుంది. ఇలాంటి వాళ్ళే హోమో సెక్సువల్‌గా మారతారు. ప్రతివ్యక్తిలోనూ అంతరాంతరంగా ఈ హోమో సెక్సువల్ బీజాలుంటాయి. అయితే సభ్యసమాజం హోమో సెక్సువాలిటీని అంగీకరించదు కాబట్టి చాలామంది ఈ లక్షణాలను పైకి రాకుండా తమలోనే అణచివేసుకుంటారు. కొద్దిమందికి మాత్రం అలా అణచివేసుకోవడం సాధ్యం కాదు.

ఒకప్పుడు హోమో సెక్సువల్స్‌ని సమాజం తీవ్రంగా అసహ్యించుకొనేది. వాళ్ళను అవమానించడం, శిక్షించడం, సమాజం నుండి వెలివెయ్యడం జరుగుతుండేది. హోమో సెక్సువల్స్‌ని శిక్షించడానికి కఠినమైన చట్టాలుండేవి. ఇంగ్లాండ్‌లో ఆస్కార్‌వైల్డ్ అనే గొప్ప రచయితమీద హోమో సెక్సువల్ అన్న నేరాన్ని మోపి జైలుకు పంపించారు. అయితే ఇప్పుడు హోమో సెక్సువల్స్ పట్ల సమాజ దృక్పథం మారింది. ఇప్పుడు పాశ్చాత్య దేశాల్లో హోమో సెక్సువాలిటీ చట్టరీత్యా నేరం కాదు. హోమో సెక్సువాలిటీని శిక్షించడం కోసం రూపొందించబడిన చట్టాలను రద్దు చేశారు. ఇవ్వాళ్ళ ఇంగ్లాండ్ మొదలైన అనేక పాశ్చాత్య దేశాల్లో ఇద్దరు పురుషులు - వాళ్ళకు ఒకరిమీదొకరికి మక్కువ ఏర్పడితే - చట్టరీత్యా పెళ్ళి చేసుకొని సహజీవనం చెయ్యొచ్చు. అలాగే ఇద్దరు స్త్రీలు కూడా -

ప్రతి వ్యక్తిలోనూ స్త్రీ అంశ, పురుష అంశ - రెండూ ఉంటాయి. అందుకే మనిషిని 'ద్విలైంగికుడు' అంటారు. ఈ రెండింటి మధ్య సమతౌల్యం ఉన్నవాళ్ళు మామూలు జీవితం గడపగల్గుతారు - అలా సమతౌల్యాన్ని సాధించలేకపోయిన వాళ్ళల్లో పర్వర్షన్స్ ఏర్పడతాయి.

ఫ్రాయిడ్ సిద్ధాంతాల్లోకెల్లా అత్యంత వ్యతిరేకతకు గురయింది శైశవలైంగికత (Infantile Sexuality) అన్న సిద్ధాంతం. బాల్యంలోనే శిశువులు లైంగిక సుఖాన్ని అనుభవిస్తారనీ, వాళ్ళల్లో సెక్సువాలిటీతో ముడిపడి ఉండే శక్తులు - లిబిడో అప్పుడే ప్రారంభమౌతాయని ఫ్రాయిడ్ అనేక ఆధారాలతో తేల్చి చెప్పాడు. ఎంతో కాలంగా బాల్యం స్వచ్ఛతకూ, పవిత్రతకూ, అమాయకత్వానికీ నిలయమని భావిస్తున్న సభ్య సమాజానికి ఇది మింగుడు పడలేదు. అందుకే సమాజం ఫ్రాయిడ్ మీద దుమ్మెత్తి పోసింది. చాలామంది కవులూ, మేధావులూ ఊహిస్తున్నట్టుగా బాల్యంలో పవిత్రతగానీ, స్వచ్ఛతగానీ, ఏమీ లేవంటాడు ఫ్రాయిడ్. అయితే బాల్యంలో పిల్లలు అనుభవించే సెక్స్ సుఖంలో పునరుత్పత్తికి ఉద్దేశించబడిన అంగాల ప్రమేయం ఉండదు. ఆరంభ యౌవనంలోకి (Puberty) ప్రవేశించాకే సెక్సువాలిటీలో అంగాంగాల ప్రమేయం ఉంటుంది. అసలు ఒక వ్యక్తి జీవితాన్ని బాల్యం ప్రభావితం చేసినంతగా మరేదీ చెయ్యలేదన్నది ఫ్రాయిడ్ మానసిక విశ్లేషణా సిద్ధాంతంలో అత్యంత ప్రధానమైంది. బాల్యంలోనే మగ శిశువుల్లో ఈడిపస్ భావగ్రంధికి ( ఆడశిశువుల్లో ఎలక్ట్రా భావగ్రంధి) బీజాలు పడతాయి. ఈడిపస్ భావగ్రంధి కారణంగానే వ్యక్తుల్లో అపరాధ భావన (Guilt complex) ఏర్పడుతుంది.

యే పురుషుడికైనా మొదటి ప్రేయసి అతని తల్లే. ఈ భావన మనల్ని షాక్ చేస్తుంది. ప్రతి కొడుక్కీ అతని తల్లిమీదుండేది పవిత్ర ప్రేమేనని అందరూ అనుకుంటారు. కానీ తల్లీకొడుకుల మధ్య ఉండే ప్రేమలో పవిత్రత ఏమీలేదంటాడు ఫ్రాయిడ్. బాల్యంలో కొడుకు అవసరాన్ని తల్లే తీరుస్తుంది. తల్లి స్తన్యాన్ని గ్రోలుతూ శిశువు అద్భుతమైన ఆనందాన్ని పొందుతాడు. తల్లి స్పర్శే కొడుక్కి గొప్ప సుఖానుభూతిని కల్గిస్తుంది. తల్లి పూర్తిగా తన స్వంతం అనుకుంటాడు కొడుకు. కానీ తండ్రి తల్లిని తన స్వంతం కానీయకుండా అడ్డుపడ్తున్నాడనుకుంటాడు. ఎందుకంటే తల్లి తండ్రి అవసరాల్ని కూడా తీరుస్తున్నది. దాంతో కొడుక్కి తండ్రిమీద ఈర్ష్యతో కూడుకున్న ద్వేషం కల్గుతుంది. ఇదే ఈడిపస్ భ్రాంతికి మూలం.

క్రీస్తుకు పూర్వమే ''సోఫోక్లీజ్'' అనే గ్రీకు నాటక కర్త ''ఈడిపస్ ది కింగ్'' అనే విషాదాంత నాటకం రాశాడు. ఈ నాటకంలో ఈడిపస్ అనే కొడుకు యుద్ధంలో తండ్రిని చంపి - అతని భార్యను అంటే తనను కన్నతల్లిని పెళ్ళిచేసుకొని, ఆమెతో కాపురం చేసి ముగ్గురు పిల్లల్ని కంటాడు. అయితే ఇదంతా ఈడిపస్‌కు తను చంపింది తండ్రినేనని, పెళ్ళిచేసుకున్నది తల్లినేనని తెలియనప్పుడు జరుగుతుంది. నాటకం చివర్లో ఈడిపస్‌కీ విషయం తెలియగానే భయంకరమైన అపరాధ భావనకు లోనై, కళ్ళు పొడుచుకొని గుడ్డివాడైపోయి దేశం విడిచి వెళ్ళిపోతాడు. అతని తల్లికీవిషయం తెలిసినప్పుడు ఉరేసుకొని చనిపోతుంది.

ఈ నాటకంలోని ఈ కథలో మానవ మస్తత్వంలో దాగి ఉన్న అనేక ప్రవృత్తులు బయటపడ్డాయంటాడు ఫ్రాయిడ్. ప్రతి కొడుకులోనూ 'ఈడిపస్' ఉంటాడు. తల్లితో చాలా బలమైన అనుబంధం ఉంటుంది. ఆ అనుబంధంలో సెక్సువాలిటి ఉంటుంది. అయితే సభ్య సమాజం తల్లి కొడుకుల సంబంధాన్ని అత్యంత పవిత్రమైందిగా ముద్రవేస్తుంది కాబట్టి ప్రతి కొడుకు తనలోని ఈడిపస్‌ను సంహరించుకొని తల్లితో తన సంబంధాన్ని ఉన్నతీకరించుకోవడానికి (Sublimation) ప్రయత్నిస్తాడు.

మనిషి నాగరికుడిగా మారకముందు, ఆటవికుడుగా అడవుల్లో జంతువుల్లాగే తిరుగుతున్న రోజుల్లో స్త్రీ పురుషుల మధ్య వావి వరసలుండేవి కావు. వావి వరసలనేవి మానవులు నాగరికులయ్యాకే ఉత్పన్నమయ్యాయి. వావివరుసలనేవి లేకముందు అన్నాచెల్లెళ్ళ మధ్య, తల్లీ కొడుకుల మధ్య సెక్స్ సంబంధాలుండేవి. నాగరికులయ్యాక ఇలాంటి సంబంధాల్ని సమాజం నిషేధించింది కాబట్టి తోడబుట్టిన వాళ్ళ మధ్య సెక్సువల్ సంబంధాలు ( ఇన్‌సెస్ట్) అంతరించిపోయాయి. అయినా ప్రజల సామూహిక సుప్త చైతన్యాలలో ఈ ''ఇన్‌సెస్ట్'' అనేది అంతంకాలేదు. అందుకే కలల్లో అన్న చెల్లెల్ని అనుభవించడం లాంటివి వస్తూనే ఉంటాయి. అప్పుడప్పుడు వార్తా పత్రికల్లో తండ్రి కూతుర్ని చెరశాడనీ, అన్న చెల్లెల్ని అనుభవించాడనీ వార్తల్ని చదువుతుంటాం. నాగరికుడుగా మారక ముందు కొన్ని వేల సంవత్సరాల పాటు స్త్రీ పురుషులు సమూహాలుగా అడవుల్లో, ఒక చోట స్థిర నివాసం

అన్నది లేకుండా తిరిగారు. అప్పుడు వావివరసలనేవి లేవు. ఎవరు ఎవర్ని కన్నారో తెలీదు. ఎవరు ఎవరికి ఏమవుతారో తెలీదు. అప్పుడు మనిషిలో యేర్పడిన సహజాతాల అవశేషాలు ఈ నాటికూ కూడా మిగిలే ఉన్నాయి. సభ్య సమాజం 'ఇన్‌సెస్ట్'ను క్షమించరాని నేరంగా పరిగణిస్తుంది కాబట్టి అలాంటి కోరికల్ని మనం మన సుప్త చైతన్యంలోకి నెట్టేస్తాం. అలాగే అక్క-చెల్లెళ్ళ మధ్య సంబంధాల్ని, తల్లీ కొడుకుల మధ్య సంబంధాల్ని ఉన్నతీకరించుకుంటాం. ఈ సంబంధాలకొక స్వచ్ఛతనీ, పవిత్రతనూ ఆపాదిస్తాం. ఇలా ఉన్నతీకరించుకోవడం అనేది నాగరికతలో ఒక భాగంగా మారుతుంది.

సాధారణంగా మన సమాజంలోని చాలా కుటుంబాల్లో అత్తా కోడళ్ళ మధ్య సత్సంబంధాలుండవు. కోడల్ని అత్త, అత్తను కోడలు హృదయ పూర్వకంగా ప్రేమించడం ఇంచుమించు అసంభవమనే చెప్పాలి. దీనికి కారణమేమిటి అని ఆలోచిస్తే పురుషుల్లో వాళ్ళకు తెలియకుండానే యేర్పడే ''ఈడిపస్ కాంప్లెక్స్ నని అర్థమౌతుంది.

తల్లికి కొడుకు మీద, కొడుక్కి తల్లిమీద ఒక బలమైన అనుబంధం యేర్పడుతుంది. తన గర్భంలో నమాసాలు మోసి, కని, పెంచి, పెద్దచేసిన కొడుకు మీద తల్లికి చాలా సహజంగా ప్రేమ యేర్పడుతుంది. అలాగే కొడుక్కి తల్లిమీద ఈ భూమ్మీద కన్ను తెరచినప్పట్నించి కొడుకు అవసరాలన్నీ తల్లే తీరుస్తుంది. ప్రతి జీవి ఈ ప్రపంచంలో కొచ్చినప్పట్నించి ఆనందం కోసం అన్వేషిస్తుంటాడు. ప్రతి జీవికి ఈ ఆనందం మొదట్లో తల్లి ద్వారానే లభిస్తుంది. ప్రతి జీవికి సెక్స్ ద్వారా లభించే ఆనందం కంటె గొప్ప ఆనందం మరొకటి ఉండదు. ఈరకమైన ఆనందం కూడా మొదట్లో కొడుక్కి తల్లి ద్వారానే లభిస్తుంది. అందువల్లనే కొడుక్కు తల్లిమీద ఇంకెవరిమీద ఏర్పడనంత ప్రేమ యేర్పడుతుంది. ఈ ప్రేమలో సెక్సువాలిటీతో ముడిపడి ఉంటుందన్న విషయాన్ని మనం మరచిపోకూడదు. కాకపోతే ఈ ప్రేమలో సెక్సువాలిటీ ఏమీలేదని కొడుకు తనను తాను నమ్మించుకుంటాడు.

యుక్త వయస్సు వచ్చాక కొడుక్కి పెళ్ళవుతుంది. ఈ తల్లీ కొడుకుల మధ్యలోకి కోడలు అన్న మరో కొత్త వ్యక్తి ప్రవేశిస్తుంది - తన స్వంతం అనుకున్న కొడుకును ఈ కోడలు ఆక్రమించుకుంటున్నదన్న భావం తల్లికి కల్గుతుంది. దాంతో ఆమెను తన శత్రువుగా భావిస్తుంది. భర్త అనేవాడు తన స్వంతం అని భార్య అనుకుంటుంది. కాని భర్తను తన స్వంతం కానీయకుండా అత్త అడ్డు పడ్తోందని కోడలు అత్తను శత్రువుగా భావిస్తుంది. దాంతో ఇద్దరి మధ్య ఘర్షణ తప్పనిసరి అవుతుంది. వీళ్ళిద్దరి మధ్య కొడుకు నలిగిపోవడం కూడా తప్పనిసరవుతుంది. తల్లిని వదులుకోలేడు. భార్యను కాదనలేడు. ఒకప్పుడు తల్లి తన కోరికలన్నింటిని ఎలా తీర్చిందో ఇప్పుడు భార్య తీరుస్తున్నది - కాబట్టి భార్యమీద ప్రేమ కల్గుతుంది. కానీ భార్య కారణంగా తనకు తల్లి దూరమైపోతున్నదని ఫీలవుతాడు. ఓ భర్త తన హృదయంలో ప్రతిష్ఠించుకున్న తల్లి రూపానికి దగ్గరగా వచ్చే భార్యను భర్త

హృదయపూర్వకంగా ప్రేమించగల్గుతాడు. భార్యలో తల్లిని చూడగల్గినవాడే భార్యతో సుఖపడగల్గుతాడు.

భార్యాభర్తల సంబంధాల విషయంలో మనం మరో అంశాన్ని కూడా పరిశీలించాలి. భార్యభర్తల సంబంధాల్ని నిర్దేశించేది ప్రధానంగా సెక్సువాలిటీయే. పెళ్ళి అనేది ఇద్దరు స్త్రీ పురుషులు కలిసి ఉంటూ తమ సెక్స్ కోరికలు తీర్చుకుంటూ సంతానాన్ని కనడానికి సమాజం ఇచ్చే లైసెన్స్. అయితే ఇవ్వాళ్ళ సంతానం అనే సమస్య చాలా త్వరగానే పరిష్కారమౌతున్నది. ఒకరో, ఇద్దరో పిల్లలు కల్గగానే కుటుంబ నియంత్రణ ద్వారా దంపతులు పునరుత్పత్తికి ఫుల్‌స్టాప్ పెడ్తున్నారు. ఆ తర్వాత చాలా కాలం వరకు ఆ భార్యాభర్తలు కాపురం చేస్తారు. వాళ్ళ కాపురం సజావుగా సాగాలంటే వాళ్ళ మధ్య సెక్స్ సంబంధాలు సజావుగా ఉండాలి. ఒకరి కోరికల్ని మరొకరు తీర్చాలి. సెక్స్ కోరికల్ని తీర్చుకోవడం ద్వారానే వాళ్ళు ఆనందంగా ఉండగల్గుతారు. చాలా కాలం వరకు భార్యలు కేవలం భర్త కోసమే సెక్స్‌లో పాల్గొనేవాళ్ళు. సెక్స్ ద్వారా భార్యలకు ఎలాంటి సుఖం లభించేది కాదు. కానీ ఇప్పుడా పరిస్థితి మారింది. ఇటీవలి కాలంలో అనేక పట్టణాల్లో నిర్వహించబడిన ప్రజాభిప్రాయ సేకరణల ద్వారా తెలిసిందేమిటంటే స్త్రీలు కూడా ఇవ్వాళ సెక్స్ సుఖాల్ని పొందాలని ఆశిస్తున్నారు. సెక్స్ ద్వారా తనకు సంపూర్ణమైన సుఖాన్నిచ్చే భార్యను భర్త, భర్తను భార్య ప్రేమిస్తారు. వాళ్ళ కాపురం కలకాలం నిలుస్తుంది. ఇవ్వాళ్ళ యే దినపత్రిక తిరగేసినా, వార పత్రిక తిరగేసినా సెక్స్ ఎడ్యుకేషన్ అనేది పాఠకులకొక ప్రధాన ఆకర్షణగా మారింది. సెక్స్‌కు సంబంధించిన అనేక విషయాలను మన పూర్వులు ఇంతకాలం రహస్యంగా ఉంచటానికి ప్రయత్నించారు - కానీ సమాచార విప్లవం కారణంగా ఇవ్వాళ్ళ సకల విజ్ఞానం పాఠకులకు అందుబాటులో కొచ్చింది. అందువల్ల సెక్స్ ద్వారా స్త్రీలు, పురుషులు సంపూర్ణ సంతృప్తిని పొందటానికేం చెయ్యాలో ఇవ్వాళ్ళ సెక్సాలజిస్టులు అరటిపండు వొలిచిపెట్టినంత సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠకులకు తెలియజేస్తున్నారు. ఇదివరకు సెక్స్‌లో అచేతనంగా **(Passive)** గా ఉండి, భర్త కోసమే తప్ప ఈ పనిలో మాకేమీ సంబంధం లేదన్నట్టుగా స్త్రీలు ఉండేవాళ్ళు. ఈ కారణం వల్ల సెక్స్ వల్ల వాళ్ళకెలాంటి సుఖం లభించేది కాదు. ఇవ్వాళ్ళ ఆ పరిస్థితి మారింది. సెక్స్ ద్వారా సుఖాన్ని పొందే హక్కు పురుషుడికెంతుందో స్త్రీకి కూడా అంతే ఉంటుందన్న వాస్తవాన్ని ఇవ్వాళ్ళ స్త్రీలు గ్రహించారు. తమను సెక్సువల్‌గా తృప్తి పరచని భర్తను ఇవ్వాళ్ళ భార్యలు క్షమించడం లేదు. చాలా విడాకులకు సెక్స్ సంబంధాల్లో తృప్తి లేకపోవడమే కారణమౌతున్నది. అనేక వివాహేతర సంబంధాలకు కూడా సెక్సే ప్రధాన కారణం. తనను సెక్సువల్‌గా తృప్తి పరచే స్త్రీ కోసం పురుషుడు, పురుషుడి కోసం స్త్రీ అన్వేషిస్తూనే ఉంటారు. వివాహం ద్వారా అది సాధ్యం కానప్పుడు వివాహేతర సంబంధాలు పెట్టుకుంటారు. ఈ వివాహేతర సంబంధాలు సమాజంలో చాలా సమస్యలకు దారితీస్తాయి. ఎన్నో హత్యలకు ఈ వివాహేతర సంబంధాలే కారణమని మనం పత్రికల్లో చదువుతుంటాం.

సెక్స్‌లో పాల్గొనటమే కాకుండా సెక్స్‌ను చూడటం ద్వారా, సెక్స్‌ను గూర్చి మాట్లాడటం ద్వారా కూడా చాలామంది సెక్స్ సుఖాన్ని అనుభవిస్తుంటారు. సినిమాల్లో సెక్స్ దృశ్యాల్ని తప్పనిసరిగా జొప్పించడానికిదే కారణం. హీరోయిన్ హీరోను తన వక్షోజాలతో ఢీకొట్టే దృశ్యాలు ఇవ్వాళ్ళ సినిమాల్లో సర్వసాధారణమైపోయాయి. ఆ దృశ్యాన్ని చూస్తున్న పురుష ప్రేక్షకులందరూ హీరోలో తమను చూసుకుంటూ ఆ హీరోయిన్ తమనే ఢీకొట్టిందనుకుంటారు. అలా అనుకోవడం ద్వారా చాలా ఆనందాన్ని పొందుతారు. సెక్స్ దృశ్యాల్ని పైకి చాలా అసహ్యించుకుంటున్నట్టుగా కనిపించే చాలామంది పురుషులు లోలోపల వాటిని చూడాలని కాంక్షిస్తుంటారు. సెక్స్‌ను తలుపు చాటు నుండి చూస్తూ ఆనందించే మనస్తత్వాన్ని ''వోయరిజమ్'' అంటారు. సినిమాల్లో సెక్స్ దృశ్యాల్ని చొప్పించటానికి వ్యక్తుల్లోని ఈ 'వోయరిజమే' ప్రధాన కారణం.

కొందరేమో సెక్స్‌లో పాల్గొనడం కంటె సెక్స్‌ను గూర్చి అదే పనిగా మాట్లాడటం ద్వారా గొప్ప సుఖాన్ని అనుభవిస్తారు. ఇలాంటి వాళ్ళ నోట్లోంచి ఎప్పుడూ బూతు మాటలు ప్రవాహంలా ప్రవహిస్తుంటాయి. మైధున క్రియను తాము కళ్ళతో చూస్తున్నట్టుగా వర్ణించడం, ఫలానా స్త్రీకి ఫలానా పురుషుడితో సంబంధం ఉందని పుకార్లు ప్రచారం చెయ్యడం, వాళ్ళిద్దరూ ఓ గదిలో పడుకొని ఆ పని చేస్తున్నప్పుడు నేను చూశానని చెప్పడం లాంటి పనుల ద్వారా వీళ్ళు గొప్ప సెక్స్ సుఖాన్ని పొందుతారు. చాలాసార్లు మనం వీధుల్లో వెళ్తున్నప్పుడు ఇద్దరు స్త్రీలో, ఇద్దరు పురుషులో లేక స్త్రీలు పురుషులో యేదో గొడవ పెట్టుకొని ఉరంతా వినిపించేలా తిట్టుకోవడం చూస్తుంటాం - ఆ తిట్లన్నీ సెక్స్‌కు సంబంధించిన తిట్లే - ఆ తిట్లలో అన్నీ బూతు మాటలే ఆ బూతుమాటల్ని పదే పదే వల్లించడం ద్వారా వాళ్ళు వాళ్ళకు తెలియకుండానే గొప్ప సెక్స్ సుఖాన్ని పొందుతారు. కొందరు సెక్స్ సుఖాన్ని వాళ్ళ జననాంగాల ద్వారా కాకుండా వాళ్ళ నోళ్ళతో పొందుతుంటారు. నోటిద్వారా ఎన్ని బూతు మాటల్ని వల్లిస్తే, వీళ్ళకంత తృప్తి లభిస్తుంది. ఇది కూడా ఒక పర్వర్షనే. అందుకే ఎప్పుడూ బూతులు మాట్లాడే వాళ్ళని కూడా 'పర్వర్ట్స్' గానే గుర్తించాలి. ఇలా మానవ సమాజంలో సెక్స్ అనేదొక బలమైన నిర్ణాయక శక్తి అని అంగీకరించాలి. ఈ నాటికిక్కూడా కొందరు పెద్ద మనుషులు సెక్స్ అనేది లేనేలేదన్నట్టుగా ప్రవర్తిస్తుంటారు. వీళ్ళ దృష్టిలో సెక్స్‌ని గూర్చి మాట్లాడటం తప్పు. దానిలోని మంచి చెడ్డల్ని స్వేచ్ఛగా చర్చించడం తప్పు - సెక్స్ అనేది బూతు - అపవిత్రమైంది. సంస్కారవంతులెవరూ దాన్ని గురించి పట్టించుకోవద్దు - సంతానం కోసం తప్ప సెక్స్‌కు మరో స్థానం లేదు - కేవలం సంతానం కోసమే స్త్రీ పురుషులు సెక్స్‌లో పాల్గొనాలి. సంతానం అక్కర్లేదనుకుంటే బ్రహ్మచర్యాన్ని పాటించాలి. ఇవన్నీ బూజు పట్టి కుళ్ళిపోయిన భావాలు. సెక్స్ అనేది జీవితంలోని ఒక ముఖ్యమైన భాగం. ఆర్థికాంశాలకూ, సామాజికాంశాలకూ ఎంత ప్రాధాన్యం ఉందో సెక్స్‌కు కూడా అంత ప్రాధాన్యం ఉందని గుర్తించాలి. సెక్స్ ద్వారా మనిషి పొందే ఆనందానికంటె గొప్ప ఆనందం మరొకటి లేదని సమాజం గుర్తించాలి. ఆరోగ్యకరమైన, సక్రమమైన సెక్స్ సుఖాన్ని పొందటానికి ప్రతివ్యక్తికీ ఉన్న హక్కుని సమాజం గుర్తించాలి.

# వాత్స్యాయనుడి కామ సూత్రములు - లైంగిక సంస్కృతి

- కాత్యాయనీవిద్మహే

జీవిత చైతన్యానికి మూల కారణమైన సహజ ప్రేరణలలో 'కామం' ఒకటి. జ్ఞానానుభవాల ద్వారా మానవ జాతిలో ఇది సంస్కృతిగా పరివర్తన చెందింది. దైహిక అవసరంగా వున్న ప్రాథమిక స్థాయి నుండి స్త్రీ పురుష సంబంధ స్థితిని నిబంధించే నిర్మాణంగా పరిణామం చెందింది. ఈ విషయంలో తన కాలానికే అభివృద్ధి చెంది వున్న జ్ఞానాన్ని క్రోడీకరించి విశ్లేషిస్తూ వాత్స్యాయనుడు 'కామ సూత్రములు'★ రచించాడు. వాత్స్యాయనుడు క్రీస్తుపూర్వం ఒకటవ శతాబ్దివాడుగా చెప్పబడు తున్నాడు. స్త్రీ పురుషులిద్దరి దైహిక భాగస్వామ్యం అనివార్యం అయిన కామాన్ని గురించి సమగ్రంగా చర్చించిన ప్రాచీన భారతీయ శాస్త్ర గ్రంథంగా 'కామసూత్రములు' చారిత్రక ప్రాధాన్యాన్ని కలిగివుంది. లైంగిక రాజకీయాల గురించి స్త్రీ వాదం ఇచ్చిన కొత్త జ్ఞానపు వెలుగులో ఈ పుస్తకాన్ని అధ్యయనం చేయవలసిన అవసరం వుంది.

'వాత్స్యాయన కామసూత్రములు' ధర్మార్థకామములు మూడింటినీ పురుషార్థాలుగా గుర్తించింది. వీటికి ఒకదానితో మరొకదానికి వైరుధ్యం లేదని నూరేళ్ళ జీవితకాలంలో పురుషుడు వీటికి సమప్రాధాన్యత నిచ్చి సేవించాలని (౧ - ౨ - ౧ సూత్రసంఖ్య 88) చెప్పింది. శరీర స్థితికి హేతువు కావటం వలన కామము సర్వదా సేవింప వలసినదేనని స్పష్టం చేసింది. (౧ - ౨ - ౪౬) ధర్మార్థాలకు సంబంధించిన విద్యలను అభ్యసిస్తూనే, వాటికి అవరోధం కాకుండా కామసూత్ర సంబంధ విద్యలను అభ్యసించాలని పురుషులకు స్త్రీలకు కూడా చెప్పింది (౧ - 3 - ౧ సూత్ర సంఖ్య 140 మరియు ౧ - 3 - ౨ సూత్రసంఖ్య 141) కామ మోహాలను మానవ పతనానికి కారణంగా భావించి నిషేధించిన సామాజిక సంస్కృతిని ధిక్కరించి 'కామం' ఒక దైహికావసరమని, ఆహారంలాగానే సేవించవలసినదని చెప్పటంలోనూ, కామ సంబంధమైన జ్ఞానం స్త్రీ పురుషులిద్దరూ అభ్యసించి పొందవలసినదేనని చెప్పటంలోనూ 'కామ సూత్రములు' గ్రంథ రచన నిస్సందేహంగా ఆ కాలానికి ఒక ముందడుగు చర్య. స్త్రీలకు శాస్త్రాలు పఠించే అధికారం, సామర్థ్యం రెండూ లేవన్న పూర్వాచార్యుల మతాన్ని ధిక్కరించి వాత్స్యాయనుడు స్త్రీలు కూడా కామశాస్త్రం అధ్యయనం చేయటానికి అర్హులని పేర్కొన్నాడు. ఆ రకంగా కూడా ఈ రచన అభివృద్ధికరమైన ఆలోచనలను, అభిప్రాయాలను అధ్యయనరంగంలో చర్చకు తెచ్చింది.

అయితే కాస్త జాగ్రత్తగా పరిశీలిస్తే కామసూత్రాల అధ్యయన అధికారులుగా స్త్రీలకు వున్న అవకాశాలను వాత్స్యాయనుడు వివరించిన క్రమంలో స్త్రీలకు పురుషుల కంటే భిన్నంగా వున్న

---

★ యశోధరుని జయమంగళ వ్యాఖ్యతో సహా పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి చేసిన ఆంధ్రానువాదం (ద్వితీయ ముద్రణ) 1930, ఆర్యభారతీ గ్రంథ మాలిక.

---

ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే, తెలుగు విభాగం, యూనివర్సిటీ ఆర్ట్స్, సైన్స్ కాలేజ్, కాకతీయ యూనివర్సిటీలో పనిచేస్తున్నారు.

సామాజిక సాంస్కృతిక పరిమితులు అర్థం అవుతాయి. కామ సూత్రాల అధ్యయనానికి స్త్రీలు సమర్థులంటూనే స్త్రీల సమర్థత గురించిన శంకను వ్యక్తం చేశాడు వాత్స్యాయనుడు. సమర్థులైన వాళ్ళు శాస్త్రాన్నంతా సమగ్రంగా అధ్యయనం చేయవచ్చునని, అంత శ్రమపడలేని వాళ్ళు ప్రయోగ విధానం తెలుసుకొంటే సరిపోతుందని ఈ రెండూ కూడా చేయలేని వాళ్ళు సంప్రయోగ భాగాన్ని (అన్వయ భాగం) అయినా ప్రత్యేకంగా అధ్యయనం చేయవచ్చునని అన్నాడు ( ౧ - 3 - ౧౩ సూత్ర సంఖ్య: 152) అందుకు స్త్రీలకు విశ్వాసయోగ్యులు అయిన స్త్రీలే గురువులుగా వుండాలని ప్రత్యేకంగా నిర్దేశించి చెప్పాడు ( ౧ - 3 - ౧౫ సూత్ర సంఖ్య : 154) కామ శాస్త్ర అధ్యయనానికి పురుషులు అర్హులు, సమర్థులు అన్న భావం, అది వాళ్ళకు అవసరం అన్న ఆమోదం సమాజంలో స్థిరపడి వున్నాయి. ఎవరి దగ్గరైనా ఏ విధంగానైనా నేర్చుకోగలిగిన అవకాశాలు, స్వతంత్రం వాళ్ళకు వున్నాయి. స్త్రీలకు ఆ పరిస్థితి లేదు కనుకనే కొత్తగా వాళ్ళకు కామశాస్త్ర జ్ఞానం అందుబాటులోకి తీసుకొని రావాలంటే పితృస్వామిక సామాజిక కౌటుంబిక పరిధిలో దాది కూతురు, చెలికత్తె, పినతల్లి లేక పెత్తల్లి, వృద్ధదాసి, తరచుగా ఇంటికి వచ్చిపోయే భిక్షుకి మొదలైన స్త్రీలు మాత్రమే గురువులు కాగలిగారు.

స్త్రీలు కూడా కామ శాస్త్రజ్ఞాన విషయాలను అధ్యయనం చేయదగినవారేనని చెప్పిన వాత్స్యాయనుడు తాను కూర్చిన 'కామసూత్రములు' మాత్రం ప్రధానంగా పురుషులను సంబోధించే వ్రాశాడు. పుస్తకం లోపలి అంశాలను పరిశీలించి చూస్తే ఈ విషయం బోధపడుతుంది. ఈ పుస్తకంలో ఏడు అధికరణాలున్నాయి. మొదటిది సాధారణ అధికరణం. ఇందులో నాలుగు అధ్యాయాలలో కామానికి ధర్మార్థాలతో వుండే సంబంధం, శాస్త్ర అధ్యయన ప్రయోజనం, నాగరిక జీవన విధానం వివరించబడ్డాయి. పురుషుడు జీవితంలో ధర్మార్థ కామాలకు ఇయ్యవలసిన సమప్రాధాన్యతను చెప్పటమే కాకుండా విద్యలను నేర్చిన పిదప గృహస్థ ధర్మమును స్వీకరించి నాగరిక జీవితాన్ని జీవించాలని చెప్పి ఆ జీవితం ఎలా వుండాలో నిర్దేశించింది కామశాస్త్రంలోని ఈ అధికరణం. ఆ జీవితం పురుషుడి జీవితమే కానీ స్త్రీ జీవితం కాదు.

రెండవది సాంప్రయోగాధికరణం. ఇందులో పది అధ్యాయాల క్రింద లైంగిక సంబంధాలలోని వివిధ దశలు, విశేషాలు వివరించబడ్డాయి. మూడవది కన్యా సంప్రయుక్తాధికరణం. ఇందులో అయిదు అధ్యాయాల క్రింద కన్యను ఎట్లా వరించి వివాహమాడి లైంగిక సంబంధాలకు అభిముఖంగా ఆమె ప్రవృత్తిని మలుచుకోవాలో చెప్పటం జరిగింది. అంతేకాక ఇది పెళ్ళి చేసుకొనటానికి వీలు పడని కన్యలను ఏ ఉపాయాల ద్వారా పొందవచ్చునో సూచించింది. కనుక ఇది పూర్తిగా పురుషులను సంబోధించిన అధికరణమే. నాలుగవది భార్యాధికారి కాధికరణం. ఇందులో రెండు అధ్యాయాలు న్నాయి. భార్య యొక్క ప్రధాన వర్తనం గృహానికి సంబంధించినదని ప్రతిపాదించి భార్య భర్త పట్ల భర్తవైపు బంధువుల పట్ల, గృహ నిర్వహణలోనూ ప్రవర్తించవలసిన పద్ధతిని నిర్దేశించింది. బహుభార్యత్వ వ్యవస్థను స్థిరీకరిస్తూ పెద్ద భార్య ప్రవర్తన ఎలా వుండాలో కూడా సూచించింది.

స్త్రీలను సంబోధించినప్పటికి అంతిమంగా అది పురుషుడి సుఖజీవిత ప్రయోజనానికి ఆమెను అధీనురాలిగా తీర్చిదిద్దటానికేనన్నది ఈ అధికరణంలో చర్చించబడిన విషయాలు స్పష్టం చేస్తాయి.

ఐదవది పారదారికాధికరణము. ఇందులో ఆరు అధ్యాయాలున్నాయి. ఇతరుల భార్యలను పొందటానికి కారణాలు, పొందే పద్ధతులు, రాజు అనుసరించవలసిన విధానాలు, అంతఃపుర స్త్రీలను రక్షించుకొనే పద్ధతులు ఇందులో చర్చకు వచ్చాయి. అంటే ఇది పూర్తిగా పురుషులను ఉద్దేశించినదే. ఆరవది వైశాకాధి కరణము. ఇందులో ఆరు అధ్యాయాలున్నాయి. వేశ్యలు పురుషుడితో ప్రవర్తించవలసిన పద్ధతులను వివరించిన ఈ అధికరణం సంబోధించింది స్త్రీలనే అయినా పురుషుల అవసరాలు తీర్చటం సంతృప్తికరమైన లైంగిక సంబంధాలను సమకూర్చటం దాని అంతరార్థం. ఏడవది ఔపనిషది కాధికరణము. రెండు అధ్యాయాల క్రింద విభజించి సౌందర్యపోషక సామగ్రి గురించి ఇందులో చెప్పటం జరిగింది. మొత్తం మీద ఈ పుస్తకంలో పురుషుడు నాగరిక జీవన వసతి సౌఖ్యాలు ఎలా పొందాలో తను వాంఛించే స్త్రీలను ఎలా వశపరుచుకొని సుఖించాలో సూచించటానికే నాలుగు అధ్యాయాలు ప్రాధాన్యం ఇచ్చాయి. రెండు అధ్యాయాలు స్త్రీలను ఉద్దేశించి వేరువేరుగా వ్రాయబడినా అవి పురుషుడి కుటుంబ జీవితాన్ని, లైంగిక జీవితాన్ని సుఖ శాంతులతో సంతృప్తితో నింపటానికి అటు భార్యలైనా ఇటు వేశ్యలయినా తమను తాము ఎలా సంసిద్ధులను చేసుకొనాలో చెప్పటానికే ఉద్దేశించబడినాయి. ఆ రకంగా ఈ రచన పితృస్వామిక లైంగిక రాజకీయాలను వ్యవస్థీకరించటంలో, బలపరచటంలో ప్రధాన పాత్ర వహించింది.

మొదటి అధికరణంలో నాగరికుడు భౌతిక జీవిత వసతి సౌఖ్యాలను ఎలా సమకూర్చుకొనాలో చెప్పిన తరువాత స్త్రీ సంబంధంగా అతను పొందవలసిన సౌఖ్యాలను చెప్పబోయే ముందు కామము వర్ణ వ్యవస్థకు లోబడి సవర్ణ స్త్రీలతోటి సంబంధంలోనే తీర్చుకొనవలసిన అవసరమని, అదే శాస్త్రీయమని చెప్పింది కామశాస్త్రం. ఇక్కడే లైంగికత దేహానికి మాత్రమే సంబంధించినది కాక ఒక జీవిత విధానంగా సంస్కృతిగా రూపెత్తటం కనిపిస్తుంది. కామము వలన పుత్రులు కలగటం, పుత్రుల వలన యశము కలగటం లోక సమ్మతమని కూడా సూత్రీకరించింది కామ శాస్త్రం (౧ - ౫ - ౧ సూత్ర సంఖ్య 217). నాయకుడి గురించి చెప్తున్న సందర్భం ఇది. అంటే పురుషుడి కామానికి వంశాన్ని నిలపగల సంతానాన్ని పొందటమే ఫలమని నిర్దేశించటం జరిగిందన్నమాట. ఆ రకంగా దైహిక లాలసకు పితృస్వామిక కుటుంబ ధర్మం పై నుంచి ఆరోపించబడింది. పురుషుడు తన దైహిక లాలసను తీర్చుకొనటానికి ఎటువంటి స్త్రీని ఎంచుకొనాలి అన్నది మరొక ప్రశ్న. నాగరక నాయకుడికి నాయిక కాగలిగిన స్త్రీలు నలుగురు అని చెప్పింది కామశాస్త్రం. ఒకామె కన్యక. ఇంకొకామె పునర్భువు. మూడవ ఆమె వేశ్య. మరొక స్త్రీ పరదార (౧ - ౫ - ౪ సూత్ర సంఖ్య 220 మరియు 242). కన్యక పుత్రఫల, సుఖఫల అని రెండు విధములని వివరణ కూడా ఇచ్చింది. పుత్రులకోసం పొందవలసిన కన్య సవర్ణురాలై వుండాలని, కామ సుఖం కోసం పొందే స్త్రీ ఏ వర్ణానికి చెందినా ఫరవాలేదని చెప్పటం జరిగింది. పురుషుడి కామానికి పుత్రులను పొందటం, సుఖాపేక్ష

అన్న రెండు లక్ష్యాలున్నాయన్న మాట. వీటిని వేరువేరు స్త్రీల ద్వారా పొందే అవకాశం అతనికి సమాజంలో వుంది. సుఖాపేక్షతో పురుషుడు పునర్భువును అంటే ఇంతకు ముందే ఒకరితో కాపురం చేసిన స్త్రీని, వేశ్యను, చివరకు పరుల భార్యను కూడా ఆశించవచ్చు. సాధించవచ్చు. లైంగిక జీవితం పురుషుడికి ఎంత విశృంఖల విహారంగా వుందో దీనినిబట్టి గుర్తించవచ్చు. ఒక పురుషుడు నాలుగు మార్గాలలో స్త్రీ సౌఖ్యాన్ని పొందటం శాస్త్ర సమ్మతమైంది. కానీ స్త్రీకి మాత్రం నాయకుడు ఒక్కడే అని కామ శాస్త్రం కంఠోక్తిగా చెప్పింది. ( ౧ - ౫ - ౨౦ సూత్ర సంఖ్య 244)

సాంప్రయోగికాధికరణంలో రతి భేదాలను వివరించే సందర్భంలో కామ శాస్త్రం సంయోగ కాలంలో స్త్రీ పురుషులలో ఆనందానికి సంతృప్తికి చెందిన భావం ఎవరికి కలుగుతుంది అన్న విషయాన్ని సుదీర్ఘంగా చర్చించింది. స్త్రీకి భావ ప్రాప్తి లేదన్న పూర్వుల మతాన్ని ప్రస్తావించి, వారి వాదనలను సైతం పేర్కొని పురుషుని యందు వలెనే స్త్రీకి కూడ భావ ప్రాప్తి వున్నదని ప్రతిపాదించాడు వాత్స్యాయనుడు. అయినా రతి చర్యలో పురుషుడు కర్త, స్త్రీ ఆధారం కావటం ప్రకృతి ధర్మమని, కర్త స్వతంత్రుడు, ఆధారము అస్వతంత్రము కావటం వలన కర్తకు ఆధారానికి వున్న భిన్న స్వభావాల కారణం వలన వాళ్ళిద్దరూ రతిక్రమంలో పొందే భావప్రాప్తి విలక్షణంగా వుంటుందని ౨ - ౧ - ౪౫ - ౪౬ సూత్ర సంఖ్య 301, 302) (౨ - ౧ - ౫౩ 309) అయినా ఏక కార్య ప్రవృత్తులైన స్త్రీ పురుషులకు రతి సౌఖ్యం ఒకే రకంగా కలుగుతుందని వాత్స్యాయనుడు చెప్పాడు ౨ - ౧ - ౬౩ సూత్ర సంఖ్య 319). స్త్రీకి శరీరం వుందని, దానికి అనుభవం పొందగల లక్షణం వుందని గుర్తించి చెప్పటంలో వాత్స్యాయనుడు సరిగ్గానే వున్నాడు. కానీ పితృస్వామిక కుటుంబ మాయలో పడి ఆ చైతన్యాన్ని ఎక్కడో కోల్పోయాడు. పురుషుడి విషయంలో దేహ ధర్మం, స్త్రీల విషయంలో కుటుంబ ధర్మం వాత్స్యాయనుడిని నడిపించాయి.

కన్యా సంప్రయుక్తకాధికరణంలో కన్యను వరించి వివాహం చేసుకొన్న పురుషుడు త్రిరాత్ర దీక్షలో ఆమెను ఎట్లా తన వాంఛా పరితృప్తికి అనుకూలంగా మలుచుకొనాలో చెప్పబడింది. మాట్లాడించటం, తన పనులు పురమాయించటం, లజ్జను పోగొట్టే స్పర్శాదులను సంభాషణలను చేయటం - ఈ మొదలైనవన్నీ పురుషుడు కన్య పట్ల చేయవలసినవి. అయితే అవి ఆమెకు అతి చనువునిచ్చి తన స్వేచ్ఛా వర్తనానికి భంగకరం కాకుండా పురుషుడు జాగ్రత్త పడాలని వాత్స్యాయనుడి ఉద్దేశం ( ౩ - ౨ - ౩౦ సూత్ర సంఖ్య 751-752). ఆత్మ సంప్రీతి జనకం కనుక పురుషుడు కన్యను సానుకూలురాలిగా చేసుకొని సుఖించాలని చెప్పాడు ( ౩ - ౨ - ౪౨ సూత్ర సంఖ్య 753-756). వివాహం వలన పొందిన కన్యతో తక్షణ లైంగిక సుఖాన్ని ఆశించకుండా స్నేహంగా, సహనంగా ప్రవర్తించమని పురుషుడికి ఈ విధంగా ఉపదేశం చేయటంలో అంతిమంగా అతనికి రతిసుఖం సంతృప్తి కరంగా లభిస్తుందన్నదే ఫలితార్థంగా కనబడుతుంది. మరి భార్య అయిన స్త్రీ యొక్క శారీరక సుఖాపేక్షను గురించి ఆమె వైపు నుండి జరిగిన ఆలోచనలను, చేసిన చేయవలసిన ప్రయత్నాలను వాత్స్యాయనుడు ఏమన్నా నమోదు చేశాడా అంటే లేదనే చెప్పాలి.

భార్య అయిన స్త్రీ పురుషుడి విషయంలో ఏరకంగా ప్రవర్తించాలో చెప్పటానికి 'భార్యాధికారి కాధికరణము' వుంది. తానొక్కతే తన పురుషునకు భార్య అయిన స్త్రీ భర్తను దేవునివలె తలచి అతనికి అనుకూలమైన రీతిలో మెలగాలని ఈ అధికరణంలోని ప్రారంభ సూత్రంలోనే చెప్పాడు వాత్స్యాయనుడు ( ४-౧-౧ సూత్ర సంఖ్య 889). ఈ అనుకూలత శరీర స్థితికి సంబంధించింది. దాంపత్యంలో అతని సౌఖ్యం లక్ష్యంగా ఆమె తనను తాను మలుచుకొనాలని చెప్పినట్లయింది. ఆ తరువాత సూత్రాలన్నీ ఆమె ఇంట్లో చేయవలసిన పనులకు సంబంధించినవి. శుచి శుభ్రతలకు, తోటల పెంపకానికి, గృహ నిర్వహణకు సంబంధించినవి. ఆమె ఎప్పుడెప్పుడు భర్తతో ఏరకంగా మాట్లాడవచ్చునో, మాట్లాడకూడదో, ఏది చేయవచ్చునో, చేయకూడదో వీటికి సంబంధించిన విధి నిషేధ రూప సూత్రాలవి. ఇట్లా సత్ప్రవర్తనతో భర్తను అత్తమామలను ఉపచరిస్తూ జీవించే భార్యకు ధర్మార్థ కామములు, పతివ్రత అన్న పేరు సిద్ధించటమే కాక తనవంటి భార్యలు మరెవరూ లేని ఏకపత్నీ వ్రతుడు భర్తగా లభిస్తాడని ప్రథమాధ్యాయం ఫలితాన్ని గురించి కూడా చెప్పింది.

అట్లాగే సపత్నులు వున్న భార్య పెద్ద భార్య అయితే ఎలా ప్రవర్తించాలో చిన్న భార్య అయితే ఎలా ప్రవర్తించాలో సపత్నులతోటి వ్యవహారం ఎలా వుంటుందో తరువాతి అధ్యాయంలో వివరించబడింది. భర్త వంశాభివృద్ధి కోసం పిల్లలు లేని భార్య భర్తను మరొక వివాహానికి ప్రోత్సహించాలని, పిల్లలను కన్న సవతి పట్ల, ఆమె పిల్లల పట్ల, పరిచారికుల పట్ల భర్త అభిప్రాయాన్ని కనిపెడుతూ తాను కూడా ప్రేమను, ఇష్టాన్ని కనపరచాలని, సవతులందరిలో తానే భర్తకు కూరిమి గల భార్య కావాలనుకొనే చిన్న భార్య అతని మనస్సుకు ఆనందం కలిగేటట్లు శుశ్రూష చేయాలని, భర్త దయ మీదనే తన బ్రతుకు ఆధారపడి వున్నదని అతని మనస్సు కరిగేట్లు చెప్పుకొనాలని చెప్పిన కామ శాస్త్రం స్త్రీని పూర్తిగా పురుషుడికి అధీనురాలిగా స్థిరీకరించింది. ఈ సూత్రాలను చదివి జితక్రోధయై, ఈ ప్రకారం ప్రవర్తించిన స్త్రీ ఐహికాముష్మిక ఫలాన్ని పొందుతుందని ఫలశృతి కూడా చెప్పబడింది.

భార్యాధికార కాధికారణము అంటే భార్య యొక్క అధికారానికి సంబంధించిన అధికరణం అని అర్థం. భార్యాధికారకాధికరణంలోని రెండు అధ్యాయాలు చూస్తే భార్యకు వున్న అధికారం ఏమిటి అన్న ప్రశ్న రాక మానదు. తన దేహ సౌఖ్యాన్ని, సౌందర్యాన్ని గురించి, జీవిత సౌఖ్యాన్ని గురించి ఆలోచించటానికి ప్రవర్తించటానికి ఆమెకు ఎక్కడా అవకాశం లేదు. భార్యకు ఇంటి పనులతో భర్త సుఖ సంతోషాలు లక్ష్యంగా పనిచేయటంతోనూ జీవిత కాలమంతా సరిపోతుంది. సపత్నులున్న స్త్రీకి అయితే వాళ్ళందరితో సర్దుబాట్లు చేసుకొంటూ బ్రతకటానికి సంబంధించిన ఆలోచనలు ఆందోళనలు అదనంగా వుంటాయి. భార్యకు సత్ప్రవర్తన, ఉపచార విధి నిర్దేశించ బడ్డాయి. సపత్నులున్న స్త్రీకి కోపాన్ని జయించటం లక్ష్యం చేయబడింది. వీటన్నిటిలో స్త్రీకి 'దేహ స్పృహ' వుండే అవకాశమే తక్కువ. లైంగిక సుఖాపేక్షను వ్యక్తీకరించటానికి, సంతృప్తిని సాధించటానికి బహు భార్యా వ్యవస్థ పెద్ద అవరోధం. కోరికలే కలుగకుండా నిరంతర చాకిరి,

కోరికలు తీరకపోతే వచ్చే కోపాన్ని అణచుకొనటం స్త్రీకి నిర్దేశించబడిన క్రమంలో స్త్రీల దేహం అభావం అవుతుంది. పితృస్వామిక సంస్కృతీ భారం క్రింద నలిగి నశించిన స్త్రీ శరీరం పురుషుడికి మాత్రమే ఒక వాస్తవం. అది అతనికి సంపూర్ణ సుఖదాయకం కావలసిందే. భార్య కావచ్చు, ఉంపుడు కత్తె కావచ్చు, వేశ్య కావచ్చు ఎవరైనా అతని సుఖప్రాప్తికి సాధనాలు మాత్రమే. కామ సూత్రములులో వాళ్ళ పాత్ర ఆ రకంగానే నిర్వచించబడింది. కామమే జీవనం అయిన వేశ్య కూడా తాను డబ్బు కోసం కాక రతి సుఖం కోసమే పురుషుడిని కోరుకొంటున్నదన్న విశ్వాసం కలిగించాలని తాను అతని వల్ల పొందుతున్న ప్రీతి స్వాభావికమైందన్న అభిప్రాయం కలిగించాలని (౬-౧-౧-౭ సూత్ర సంఖ్య 1305 - 06) కామ శాస్త్రం చెప్పటంలో పురుషుడి సుఖానుభవానికి ఆటంకం ఏర్పడకూడదన్న భావమే ప్రధానం. దీని పరాకాష్ట రూపమే వేశ్యకు సైతం ఏకచారిణీ వృత్తాన్ని విధించటం. అంటే ఒక పురుషుణ్ణే భర్తగా భావించి అతని విశ్వాసాన్ని చూరగొంటూ అతని సౌఖ్యం తన జీవిత లక్ష్యంగా ప్రవర్తించటం. వేశ్య వల్ల రతి సౌఖ్యం మాత్రమే కాక భార్య ద్వారా లభించే వినయ విధేయతలు, విశ్వాసనీయత కూడా పురుషుడు కోరుకొంటున్నాడంటే లైంగిక సంబంధాలలో స్త్రీ శరీరం, దాన్ని మించి పితృ స్వామిక సమాజ నిర్మిత స్త్రీ ధర్మం పురుషుడి అహాన్ని సంతృప్తి పరచగల అంశాలు అవుతున్నాయని అర్థం.

పురుషుడి లైంగికాసక్తుల పరితృప్తికి భార్య, ఉంపుడు కత్తె, వేశ్య మాత్రమే కాక పరదార కూడా సాధనమే. ఆమెను పొందే మార్గాలు కూడా అనేకం ఆవిష్కరించుకొనటం జరిగింది. అదే సమయంలో తన భార్యను పరపురుషుల నుండి రక్షించుకొనాలన్న తాపత్రయం కూడా పురుషుడికి ఎక్కువే. దీనిని కూడా 'కామసూత్రములు' నమోదు చేసింది(౫-౬-౪౩సూత్ర సంఖ్య 1295). దైహిక వాస్తవానికి పవిత్ర కుటుంబ భావనకు మధ్య వున్న వైరుధ్య ఫలితమిది. ఈ వైరుధ్యం కారణంగానే పురుషుడికి సుఖభోగ జీవితం ఏకైక లక్ష్యం అయితే ఆ పురుషుడి సుఖం కోసం సమస్త భౌతిక సౌకర్యాలను సమకూర్చటం, దైహికంగా, మానసికంగా తనను తాను సిద్ధం చేసుకొనటం స్త్రీ ధర్మం అయింది. ఈ ద్వంద్వ విలువల లైంగిక రాజకీయాలకు వాత్స్యాయనుడి 'కామసూత్రములు' ప్రతినిధి రచన అయింది.

మహిళా ఉద్యమం సజాతి లైంగికులైన (lesbians) ఆడవాళ్ళ కుట్ర అయినందున, కన్యలు, విజాతి లైంగికులు (heterosexuals) బ్రహ్మచారులు, ద్విలైంగికులు (bisexuals) అయిన మహిళల కుట్ర అయినందున - కుట్రదారులమైన మేము, 'లైంగిక' అనే పదానికి ముందు తగిలించిన అసంబద్ధ పదబంధాలను అనభ్యాసించి (unlearn) మహిళలలా మమ్మే మేము తెలుసుకొంటున్నాం, సృజించుకొంటున్నాం, నిర్వచించుకొంటున్నాము.

**– Robin Morgan**

ఈ నాటికీ విలువ తగ్గని

# వాత్స్యాయన కామసూత్రం

- గవిని వెంకట స్వామి

భారతీయ సంప్రదాయం వ్యక్తికి మూడు జీవిత లక్ష్యాలను నిర్దేశించింది. అది ధర్మం, అర్థం, కామం. ఈ మూడింటికి దేనికి ఇవ్వవలసిన స్థానం దానికి ఇస్తూ జీవించినప్పుడు ఆ జీవితం సఫలం అవుతుంది. ఆ మూడు పురుషార్థాలను నిర్వచిస్తూ వివరిస్తూ చేసిన మూడు ప్రసిద్ధ రచనల్లో వాత్స్యాయన కామసూత్రం ఒకటి. మిగతావి కౌటిల్యుని అర్థ శాస్త్రం, మనుస్మృతి లేక మానవ ధర్మ శాస్త్రం. వీటన్నిటిలో ఉన్న సామాన్య లక్షణం అవి సంకలిత గ్రంథాలు కావడం. అంతకు ముందు కొన్ని వందల యేళ్ళుగా అంచెలంచెలుగా పెరిగిన విజ్ఞానాన్ని తమ మౌలిక ప్రతిభతో సమన్వయం చేసి, ఆయా శాఖల్లో విజ్ఞాన సర్వస్వాలుగా గ్రంథించిన జ్ఞాన భాండాగారాలు అవి. ఆనాటి సర్వశాస్త్రాలకి సహజమైన లక్షణం ఇంకొకటి ఉంది. అవి చాలావరకు వర్ణనాత్మకాలు; కొంత వరకు శాసనాత్మకాలు, ఉపదేశాత్మకాలూ.

కౌటిల్యుని అర్థ శాస్త్రంతో కామసూత్రానికి రచనా విధానంలో చాలా పోలికలు ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. అర్థ శాస్త్రం మూడో శతాబ్దిదని చెప్పటానికి చారిత్రక ఆధారాలు ఉన్నాయి. జాకోబి పండితుడు కూడా ఈ అభిప్రాయాన్నే బలపరుస్తున్నాడు. కామసూత్ర రచన అర్థ శాస్త్రానికి సమకాలీనమని పలువురు పరిశోధకుల అభిప్రాయం. మరీ ప్రాచీనతను ఆపాదించటానికి ఇష్టంలేని కీత్ వంటి పాశ్చాత్య పండితులు దీనిని క్రీ.శ. ఐదో శతాబ్దానికి నెట్టారు. కాని, అంతర్గత సాక్ష్యాలను బట్టి, రచనా శైలిని బట్టి కామ సూత్రం క్రీ.పూ. మూడో శతాబ్దిదేనని పండితులు భావిస్తున్నారు. కామసూత్రం ప్రస్తుత రూపాన్ని ఎప్పుడు ధరించిందో స్పష్టంగా నిర్ధారించి చెప్పలేక పోయినప్పటికీ, అది ఒక వైజ్ఞానిక సంప్రదాయంగా అతి ప్రాచీన కాలం నించీ ఉండి వుండాలి. వాత్స్యాయనుడు గ్రంథాదిలో తన పూర్వుల నెందరినో స్మరించాడు.

బ్రతుకు సమస్యల వైరుధ్యాల ఘర్షణలతో సతమతమయ్యే మానవ ప్రవృత్తి పరిపూర్ణతను సాధించటానికి చేసే జిజ్ఞాసాయుతమైన, సృజనాత్మక భావ సంఘర్షణలో నుంచే సమస్త శాస్త్రాలు, కళా రూపాలూ ప్రాణం పోసుకుంటాయి. మానవ జాతి చరిత్ర అంతా భావ గమన చరిత్రే.

ఒక ఉన్నత సాంస్కృతిక స్థాయిని అందుకున్న సమాజంలోనే కామాన్ని కళగా అభ్యసించడం, అధ్యయనం చెయ్యడం సాధ్యపడుతోంది. ఈ కృషి శాస్త్ర స్థాయిని పొందాలంటే అంతకు ముందు ఎంతో మంది పరిశీలకులు తమ అనుభవాలను, అంతర్వీక్షణలను క్రోడీకరించి వుండాలి.

కామసూత్రానికి ఎన్నో వ్యాఖ్యానాలు వెలువడ్డాయి. దీనిలోని భావాలు, కల్పనలు, సాహిత్యంలో, కథలలో, గాథలలో ప్రచారంలో ఉన్నాయి. అయినా కామశాస్త్రం గురించి మాట్లాడుకోవడం మర్యాదస్తుల లక్షణం కాదన్న అభిప్రాయం లోకంలో వుంది. ఆ శాస్త్రం కేవలం బంధాలు,

---

గవిని వెంకట స్వామి, సాహితీ వేత్త, హైదరాబాద్.

ఆలింగనాలు, చుంబనాలకే పరిమితమన్న అపోహ కూడా వుంది. నిజానికి వాత్స్యాయనుడు ఆ శాస్త్రంలో జీవితాన్ని కళాఖండంగా మలుచుకోవడానికి అనువైన మార్గాలను చర్చించాడు. అది మానవ జీవితాన్ని ఆవరించి వుంటున్న లైంగిక తత్వాన్ని పరిశీలిస్తుంది. అది నేరుగా ఒక జీవిత దృక్పథాన్నే (Weltanshuung) ఆవిష్కరిస్తుంది. వాత్స్యాయన పరిశీలనలు, అంతర్దృష్టి అనేక స్థాయిలలో మానవ స్వభావాన్ని అంతర్ ప్రపంచాన్ని స్పృశిస్తున్నట్టు, అంతర్గత ఉద్వేగాల సంక్లిష్టతకు అద్దం పడుతున్నట్లు అనిపిస్తోంది.

కౌటిల్యుడు 'అర్థం' అనే పదాన్ని ఎంత విస్తృతార్థంలో వాడాడో వాత్స్యాయనుడు కూడా 'కామాన్ని' విపులార్థ బోధకంగా ప్రయోగించాడు. తృతీయ పురుషార్థమైన కామాన్ని సాధించడం ద్వారా జీవిత సాఫల్యం ఏ విధంగా పొందవచ్చో కామసూత్రం పలు కోణాల నుంచి చర్చిస్తుంది. ఒక యుగం భారతీయ మేధా సంపత్తికి, సాహసోపేతమైన యోచనా శీలతకు ఇది తార్కాణం. అందుకే అది సంస్కృతి వాచకం (Culture Text)గా భాసిస్తుంది. ఆ మూల పాఠాన్ని ఎంత మంది వ్యాఖ్యాతలు వ్యాఖ్యానించినా, దానిలో అంతర్లీనంగా ప్రవహించే సారభూతమైన సందేశాన్ని, కామనల, వాంఛల విశ్వరూపాన్ని ఎవరికి వారు చదివి, అనుభవించి, ఆనందించవలసిందే.

మనిషిలో ప్రగాఢమైన ప్రాకృతిక తత్వం లైంగికత. అందుకే దాని శక్తిని, ప్రాబల్యాన్ని గమనించిన మన పూర్వులు దానిని పురుషార్థాలలో చేర్చారు. పురుషార్థ భావన భారతీయ సంస్కృతిలో చాలా విలువైనది. సమస్త మానవ కృషులన్నీ ఈ పురుషార్థాల చుట్టూ పరిభ్రమిస్తుంటాయి. పురుషార్థాలనూ వాటి ప్రయోజనాలనూ ప్రస్తావించటానికే మనం మొదట్లో చెప్పుకున్న రచనలు. అవి ఎన్నో యేళ్ళు పరిశ్రమించి, సముపార్జించిన జ్ఞానానికి ప్రతీకలు. అందువల్ల ఈ శాస్త్రాలలోని విలువైన వీక్షణలను స్వీకరించి, సమకాలీన జీవిత విధానానికి అనువర్తింప జేసుకోవడం విజ్ఞత కాదా?

మరి ఇంత ముఖ్యమైన కామ సూత్రాన్ని నిరాకరించి, నిరసించటానికి గల కారణాలను అన్వేషించడమంటే గడచిన వెయ్యేళ్ళ సామాజిక, సాంస్కృతిక చరిత్రను అర్థం చేసుకునే ప్రయత్నమే. ఇది భారతీయ జీవన విధానంలో చోటు చేసుకున్న ద్వంద్వ వైఖరికి, కుహనా సంస్కారానికి ఆనవాలుగా భావించాలి. భారత సమాజంలో స్వభావవాద చింతన, జిజ్ఞాస పరిఢవిల్లిన కాలంలో అన్ని శాస్త్రాలకి దక్కిన గౌరవమే కామ శాస్త్రానికి కూడా దక్కింది. సమాజంలో జిజ్ఞాస నశించి, కృత్రిమ సంస్కారం, మిథ్యా విలువలు మన జీవితాలను ఆక్రమించిన తరవాతనే ఈ పరిస్థితి దాపురించింది. ఈ దేశంలో క్రైస్తవ మతం కాలూనప్పటి నుంచి ప్రచారం పొందిన 'తొలి పాపం' భావ ప్రభావంలో కొట్టుకుపోయిన 'నవ్యుల' కు సహజంగానే సెక్సు గర్హనీయ విషయంగా తోస్తుంది. పందొమ్మిదో శతాబ్దంలో ప్రారంభమైన మత పునరుజ్జీవన ప్రయత్నాలు సెక్సునీ భారతీయ కళా వైభవానికి ప్రతీకలుగా నిలిచిన కళా రూపాలను, రామణీయకతను నిరాకరించిన వైనం ద్యోతకమవుతుంది. దానికి తోడు ఈ శతాబ్దిలో దార్శనిక చింతనని పక్కకునెట్టి, గురు పీఠాలు నిరాశా వాదాన్ని, వైరాగ్యాన్ని నూరి పోస్తున్నాయి. భారతీయ ప్రతిభకి సొంతమైన తర్కపటిమ స్పష్టమైన, అర్థవంతమైన భాషా ప్రయోగం ఈ స్వాములకి తెలియని విద్య, ఈ సాధువుల, సన్యాసుల

బోధలు విద్యాగంధం లేని జన సామాన్యాన్నే కాకుండా అధికాధికంగా వైమనస్యతకు లోనవుతున్న పట్టణ ప్రాంతాలలోని విద్యావంతులను సైతం ఆకట్టుకుంటున్నాయి. ఈ మార్మిక, తాంత్రిక గురువులు మానవ సహజమైన జిజ్ఞాసను చంపి భావ దాస్యాన్ని పెంచి పోషిస్తున్నారు. ఏది శ్రేయస్కరమో, ఏది హితకరమో తేల్చుకోలేని జనం అపరాధ భావనతో సహజమైన శృంగార జీవితానికి, లైంగిక సంతృప్తికి దూరమైపోతున్నారు. కామ శాస్త్రాలకు జన్మనిచ్చిన భారత భూమిలో ఈ పరిణామం అత్యంత విచారకరం.

కామసూత్రంలో సాధారణ, సాంప్రయోగిక, కన్యా సంప్రయుక్తక, భార్య, పారదారిక, వైశిక, ఔపనిషదిక అనే ఏడు అధికరణాలు 1700 సూత్రాలలో 36 అధ్యాయాలు ఉన్నాయి. దీనికి యశోధరుడు రాసిన 'జయమంగళ' అనే వ్యాఖ్య ప్రసిద్ధమైంది.

మానవ శరీర నిర్మాణం కామ కళకు అనువైనది. ఈ శరీర సౌష్ఠవం ఆసరాగా నాట్యం (ఆట) శిల్పం అభివృద్ధి చెందినై. వివిధ భంగిమలను, విన్యాసాలను క్రమబద్ధంగా ప్రదర్శించటమే నాట్యం. అది ఉన్నత స్థాయిలో ఆంగికమే కాకుండా, సంక్లిష్ట భావ ప్రకటన సాధనంగా పరిణత చెందింది. ఈ రతి భంగిమలనే దేవాలయ శిల్పం ప్రదర్శించింది. ఖజురహో దేవాలయాలలోని మిథున శిల్పం దీనికి మంచి ఉదాహరణ.

మానవుని స్థాయిలో లైంగికత జంతువుల్లో మాదిరిగా శారీరక సంయోగం కాదు. సంతానోత్పత్తి జీవ ధర్మం అయినప్పటికీ, మానవుల్లో అది మానసిక ఆనందానికీ, ప్రశాంత చిత్తతకు మూలమైంది. రతిలో పారవశ్యం, భావ ప్రాప్తి అనిర్వచనీయమైన, అనితరసాధ్యమైన ఆనంద ప్రాప్తికి హేతువు. భావ ప్రాప్తి భాగస్వాముల అనురాగానికి, స్నేహ బంధానికి, కుటుంబ జీవితానికి పునాదిగా నిలుస్తుంది. ఈ కారణాల వల్ల లైంగికత సంతాన ప్రయోజనాన్ని మించిన సామాజిక, సాంస్కృతిక విలువను సంతరించుకుంది.

రతిలో స్త్రీ పురుషులు సమాన భాగస్వాములు. ఎవరి వ్యక్తిత్వం వారిదే, వ్యక్తులుగా వాళ్ళు స్వతంత్రులు (autonomous) అయితే వాళ్ళని నిరంతరం మానసికంగా బంధించి వుంచేది కామమే. సర్వ మానవ జాతికి సామాన్యమయిన ఉద్వేగాలను, ఊహలను చిత్రించినందువల్లనే కామసూత్రానికి అంతటి ఆకర్షణా, విలువ. వాత్స్యాయనాది కామ సూత్రకారులకి మానవ ఉద్వేగాలన్నీ చిర పరిచితాలే. వాటి ప్రవర్తన, తీరు తెన్నులు వాళ్ళకి క్షుణ్ణంగా తెలుసు.

ధర్మార్థ కామాలను సాధించటానికి పురుషుడే కాదు, వాత్స్యాయనుడి దృష్టిలో స్త్రీలు కూడా అర్హులే. కనుక పెళ్ళికి ముందే కామ శాస్త్రాన్ని అభ్యసించాలని కనీసం అందులోని కొంత భాగమైనా చదివి అర్థం చేసుకొని వుండాలని వాత్స్యాయనుడు అభిప్రాయపడ్డాడు. దీనిని బట్టి ''న స్త్రీ స్వాతంత్ర్యమర్హతి'' అని స్మృతులు శాసించినా, ఆచరణలో స్త్రీ ఆనాటి సమాజంలో ఎక్కువ స్వేచ్ఛ అనుభవించేదని అనిపిస్తోంది. కామసూత్రాలకి సమాంతరంగా సాగిన సారస్వతంలో కూడా

ఇలాంటి స్వేచ్ఛా ప్రవృత్తి కనిపిస్తోంది. అష్టవిధ నాయికలలో అభిసారికకు ఉన్న ప్రాధాన్యత తెలిసిందే. కాళిదాసు కావ్యాలలోని వర్ణనలో గాథాసప్తశతి లోని గాథాలు స్త్రీల శృంగార జీవితానికి నిదర్శనాలు. మేఘ సందేశంలో మేడల మీద మధిరా పానంతో మత్తిల్లిన యువతులు సురత క్రీడలో తేలియాడుతూ ఉత్సాహాన్ని ఇనుమడింప చేయడానికి మధువును సేవించే దృశ్యాలు ఎదురవుతాయి. గాథాసప్తశతిలో పారదారికం - పర భార్యలతో పొత్తు - వ్యసనంగా వర్ణించబడింది.

ప్రాచీన భారతదేశంలో ఇంద్రియ జన్య సుఖాలని నిరాకరించటం జీవితాదర్శం కాదు. స్వభావ వాద చింతన పరిఢవిల్లిన కాలంలో జీవితాన్ని అనుభవించడమే లక్ష్యంగా కనిపిస్తోంది. భౌతిక సుఖాలను తిరస్కరించే నైరాశ్య భావం భారతీయ సమాజంలో క్షీణ యుగంలో పౌరాణిక సంస్కృతి తీసుకువచ్చిన పెను మార్పు.

కామ సూత్రం స్త్రీని కేవలం భోగ వస్తువుగా, పురుషుడి ఆనందానికి హేతువుగా, స్వీకర్తగా **(passive recipient)** కాకుండా సురతంలో సంపూర్ణ భాగస్వామిగా వర్ణించింది. పైగా కామ శిల్పం తెలిసిన స్త్రీ రతిలో ఆనందస్ఫుటంచులు చవి చూడటం ద్వారా పురుషునికి అధికాధిక సంతృప్తి కలగజేస్తుందని ప్రతిపాదించింది.

అంతేకాదు. స్త్రీలని శృంగార జీవులుగా, కామాతురలుగా కాక, వాళ్ళకీ అనుభూతులు, ఉద్వేగాలు ఉంటాయనీ, పురుషులు రత్యానందం పొందాలంటే స్త్రీల చిత్త వృత్తులను, మనోగత భావాలను, హృదయ సౌకుమార్యాన్ని అర్థం చేసుకుని ప్రవర్తించాలని నిర్దేశిస్తున్నది.

వాత్స్యాయనుడు వధువు సంకోచాలను భయాలను పోగొట్టే ప్రయత్నంలో పురుషుడు ఎంత సున్నితంగా వ్యవహరించాలో చెప్పాడు. మగవాడు మొదటి మూడు రాత్రులు రతికి ఉపక్రమించకుండా భాగస్వామి అభిప్రాయాలను, అనుభూతులను అర్థం చేసుకొని ఆమెలో అనురాగాన్ని చిగురింప జేయాలని ఉపదేశించాడు. లైంగికతలో ప్రేమ యొక్క విలువని ప్రతిపాదించటంలో వాత్స్యాయనుడి శాస్త్రీయ దృష్టి మనం గ్రహించగలం. అనురాగం లేని సెక్స్ అనర్థదాయకమని ఆధునిక పరిశోధనలు నిరూపిస్తున్నాయి.

అష్టవిధ వివాహాలలో గాంధర్వం ఉత్తమోత్తమమైనదిగా వాత్స్యాయనుడు సూచించాడు. నిజానికి ఆనాటి సాంఘిక ధర్మానికి ఇది విరుద్ధమైన ప్రతిపాదన. పెళ్ళికి పరమ ప్రయోజనం దంపతుల మధ్య అనురాగం వృద్ధి పొందటమే అని తెలిసిన వాత్స్యాయనుడు ప్రేమ వివాహానికి పెద్ద పీట వేశాడు.

కామసూత్రంలో పారదారిక ప్రకరణం చాలా ఆసక్తికరమైనది. దీనిలో పర స్త్రీలను పొందే విధానాలు, పరిస్థితులు చర్చించిన వాత్స్యాయనుడు ఈ యుక్తులు, విధానాలు తెలుసుకోవడం వల్ల ప్రతి వ్యక్తి తన భార్యలను రక్షించుకునే ప్రయత్నం చేస్తాడని రాశాడు. సంసారంలో సంతృప్తి పొందని స్త్రీ వెలిచవికి అలవాటు పడే ప్రమాదం ఉందని అలాంటి పరిస్థితి రాకుండా జాగ్రత్త పడేందుకే ఈ విషయం ప్రస్తావించినట్లు చెప్పాడు. అసలు ఈ భాగం గోణికా పుత్రుడే రచించినట్లు

కామసూత్రంలో ఉంది. ఎవరు చేర్చినప్పటికి పరదారికాధికరణం ఆనాటి సామాజిక జీవితాన్ని, మానవ స్వభావాన్ని ప్రతిఫలిస్తుంది. అలాంటి పరిస్థితే లేకపోతే ఈ విషయం మీద ఇంత విపులమైన చర్చ చేయాలన్న ఊహే కలుగదు. కనీసం అది వైయక్తిక వాంఛలను, ఉద్రేకాలను సంఘనీతితో సమన్వయం చేయాలన్న ప్రయత్నమైనా కావాలి.

వాత్స్యాయనుడు స్త్రీలని శృంగార దేవతలు, పురుషుడి యొక్క కామ తృప్తికి ఉపయోగపడే పనిముట్లుగా చిత్రించాడని విమర్శించడం చాలా తేలిక. వాత్స్యాయనుడు కానీ, బాభ్రవీయులకు కానీ స్త్రీ పురుషుల సమానత్వ చర్చ వాళ్ళ లక్ష్యం కాదు. ఆనాటి తాత్విక చైతన్యంలోనే ఈ భావం లేదు. ప్రత్యేక చారిత్రక పరిస్థితుల్లో వికసిస్తూ వచ్చిన వైజ్ఞానిక రచనను ఈనాటి ప్రమాణాలతో కొలవడం న్యాయం కాదు. వాత్స్యాయనుడి పరిమితులు వాత్స్యాయనుడికున్నై. ఒకానొక చారిత్రక సన్నివేశంలో, అందరికీ ఆమోద యోగ్యమైన విలువల క్రమంలోనుంచే ఆనాటి వాళ్ళ ఊహలు, ఆవేశాలు ఆకృతి పొందుతుంటాయి. సర్వ మానవులకు సామాన్యమైన లైంగిక శక్తి స్త్రీ పురుష సంబంధాలలో ప్రవర్తిల్లే తీరుని విశ్లేషించడమే వాత్స్యాయనుడి విశిష్టత.

వేశ్యలని గురించిన చర్చకూడా ఆనాటి సామాజిక స్థితిగతుల్ని తెలియజేస్తుంది. వేశ్యలు, గణికలు ఒక ప్రధానమైన వర్గంగా గుర్తించబడ్డ రోజులవి. పూర్వ సాహిత్యంలో వేశ్యల ప్రస్తావన అనేక చోట్ల కనిపిస్తోంది. గ్రీకు, రోమన్ సారస్వతం కూడా ఈ అంశాన్ని ధృవపరుస్తోంది. నాటి సామాజిక, సాంస్కృతిక జీవితంలో గణికల పాత్ర తక్కువేమీ కాదు. వేశ్యా వ్యవస్థ ఈనాడు ఆ రూపంలో లేకపోయినా, నవ నాగరిక ప్రపంచంలో అది కొత్త కొత్త అవతారాలెత్తి, బహు రూపాలలో కొనసాగుతూ ఉండటం విజ్ఞులు గమనించకపోరు. చారిత్రక దృష్టిని విడిచి, ప్రాచీన శాస్త్రాల్ని ఖండించడం నేల విడిచిన సాము.

కామ శాస్త్రం స్త్రీ పురుషుల స్వభావాలను, శృంగార చేష్టలను, రతి విధానాలను వర్గీకరించి కొత్త పరిభాష సృష్టించింది. వస్తువుని నిర్వచించి, వర్గీకరించి సాంకేతిక పరిభాషను కల్పించటం అన్ని శాస్త్రాలలో కనిపించే సాధారణ లక్షణం. ఇది భారతీయ చింతనలోని మౌలికాంశం. విషయ ధారణకు మననం చేసుకోవడానికి ఇది చాలా ఉపయుక్తం.

ప్రయోగశాలతో పని లేకుండా, ఊహాశక్తితో అనుభవాన్ని జోడించి, రతి రహస్యాలను ఆవిష్కరించిన వాత్స్యాయనాది శాస్త్రజ్ఞులు నిజంగా మానవ జాతిపట్ల ఎనలేని శ్రద్ధాసక్తులు కలవాళ్ళు. ఆధునిక పరిశోధనలో వెలుగులోకి వచ్చిన కామ కేంద్రాలను గురించి, భావప్రాప్తిని గురించి కామశాస్త్రం ఏనాడో చర్చించింది. స్త్రీ కూడా స్ఖలిస్తుందన్న విషయాన్ని యశోధరుడు, కళ్యాణమల్లుడు, కొక్కోకుడు ప్రస్తావించారు. అమరు శతకంలో కూడా ఈ అంశం వర్ణించబడ్డది.

కామ సూత్రం ఎంత విలక్షణమైన రచన అయినా దానిలోని ప్రతి అంశమూ ఆమోదయోగ్య మైనదని కాదు. ఆఖరి అధ్యాయంలో చేర్చబడ్డ కామోద్దీపన ద్రవ్యాలు వశీకరణ వ్యూహాలు, ప్రాయోగికంగా ఋజువు చేయకుండా నమ్మలేము.

ఈ శాస్త్రాన్ని 'ధర్మార్థ కామేభ్యోనమః అని ప్రారంభించి

తదే తద్బ్రహ్మ చర్యేణ పరేణ చ సమాధినా
విహితం లోక యాత్రార్థం న రాగార్థోஉస్య సంవిధిః

రక్షన్ ధర్మార్థ కామానాం స్థితిం స్వాం లోకవర్తినీమ్
అస్య శాస్త్రస్య తత్వజ్ఞో భవత్యేవ జితేంద్రియః

వాత్స్యాయుని ఈ రచన బ్రహ్మచర్య దీక్షతో గొప్ప చింతనతో జనుల చక్కని జీవనానికై రచింపబడింది (చెయ్యబడింది). అంతేకాని, కేవలం కామం (రాగం) కోసం మాత్రమే కాదు.

ఈ శాస్త్ర తత్వాన్ని తెలుసుకున్నవాడు ధర్మార్థ కామ పురుషార్థాలను లోకంలో దేని దేని స్థితిని (ప్రాధాన్యతను) దానికి ఇచ్చి, జితేంద్రియుడే అవుతాడని గ్రంథాంతంలో వాత్స్యాయనుడు చెప్పాడు.

మానవ మనస్తత్వంలోని మారుమూల కోణాలను కామసూత్రం దర్శించిన తీరు, ఆధునిక పరిశోధనలు దానిని సమర్థిస్తున్న లక్షణం, ఆ రచనలో బారుకీ అంతస్సూత్రంగా సాగే మానవత్వ స్పర్శ - ఇవన్నీ విశదీకరించడం ఈ వ్యాస ప్రయోజనానికీ పరిధికీ మించిన పని.

యూరోపియన్ రినైజాన్సు ఉద్యమం ఊపందుకునే దాకా ప్రపంచ దేశాలలో భారతదేశం సంగీత సారస్వతాలలో, శిక్షా వ్యాకరణాలలో, తర్క మీమాంసా శాస్త్రాలలో మానవ మేధో జీవితానికి తార్కాణాలుగా నిలుస్తాయి. ఈ చింతనా వ్యవస్థలను చక్కగా అధ్యయనం చెయ్యడం ద్వారా మానవ మేధో వ్యాపారాన్ని, ప్రవర్తనా రీతుల్ని గ్రహించడానికి వీలవుతుంది. ఈ చింతన కొన్ని ప్రాథమిక తాత్విక ప్రతిపాదనలపై ఆధారపడి వికసించింది. ధర్మార్థ కామాలనే పురుషార్థాల దృష్ట్యా జీవిత ప్రయోజనాలను, లక్ష్యాలను నిర్వచించుకున్నప్పుడే జీవిత సాఫల్యానికి మానవుడు ఆచరించవలసిన విధానం నిర్ణయమైపోయింది.

ఈ దార్శనిక సంప్రదాయం, అన్వీక్షకీ విద్య అనుస్యూతంగా, అవిచ్ఛిన్నంగా కొనసాగినంతకాలం భారత సంస్కృతి దేదీప్యమానంగా ప్రకాశించింది. ఇక్కడ వివరించడానికి వీలు గాని చారిత్రక కారణాల వల్ల ఆ జిజ్ఞాసా సంప్రదాయం అడుగంటింది.

ఆ వారసత్వం మన కందించిన జ్ఞాన భాండాగారాన్ని భేదించి, వ్యాఖ్యానించి, ఆధునిక విజ్ఞానంతో సమన్వయం చేసుకుంటూ సంపన్నం చేసుకోగలిగినప్పుడే మన పూర్వులు సమకూర్చి పెట్టిన జ్ఞానానికి సార్థకత. ఆ పని జరగనంత వరకూ భారత సమాజం అనుకరణ, అనుసరణ సమాజంగానే మనగలుగుతోంది. దీని అర్థం గతంలోని ప్రాచీన విజ్ఞానాన్ని పునరుద్ధరించటమని కాదు. ఆ జ్ఞానాన్ని విమర్శనాత్మకంగా వివేచించి, విలువ కట్టి, పునరుద్దీపింప జెయ్యాలని. ఆ విధంగా దానిలోని సార్వకాలిక, సార్వజనీన భావాలను, విభావనలను సమకాలిక మానవాళి సమస్యలకు అన్వయించి, పరిష్కార మార్గాలను అన్వేషించే ప్రయత్నమే పునరుజ్జీవనోద్యమం.

# లోపభూయిష్టమైన జెండర్ - సెక్సువాలిటీ విధానం

- అనిశెట్టి రజిత

జెండర్, లైంగికతలు మానవ జాతి విస్తరణతో ప్రధాన పాత్ర పోషించాయి. స్త్రీ శరీరం మీద ప్రపంచ చరిత్ర లిఖించబడి ఉండటం అనేది అతిశయోక్తి కాదు అబద్ధమూ కాదు. అధికారం (రాజ్యం) కోసం, స్త్రీని సొంతం చేసుకోవడం కోసం ఎన్నో యుద్ధాలూ, ఘర్షణలూ జరిగాయి. రాజ్యం, రాజ్య విస్తరణ, రాజ్య సంపదలు, రాజ్యాధిపత్యం ఒకవైపు, స్త్రీ దేహం, లైంగికత్వంపై హక్కు- అన్నీ పురుషత్వపు, వీరత్వపు లక్షణాలుగా గుర్తింపును పొందాయి.

తప్పు, నేరము, పాపము భౌగోళికమే (Geographical) కాదు. అవి బైలాజికల్ అండ్ అనాటమికల్ (Biological - Anatomical) కూడా. తప్పంటే విభిన్న స్థలాల్లో, విభిన్న సందర్భాల్లో స్త్రీ పురుషుల లైంగిక కలయికకు సంబంధించిన తప్పు.

సెక్సువాలిటీ అంటేనే దైహికత మరియు సంస్కృతితో ముడిపడి ఉన్నదే. ఎన్ని రక్తాలు కలిస్తే ఇన్ని జాతులు, తెగలు ఏర్పడి ఉన్నాయో. ఒకే రక్తం ఒకే మనుషులు అనే భావనకు Physiological వర్తింపే గానీ రక్త సంబంధాల్లో ఒకే రక్తం అనేది సాంస్కృతిక విలువల అల్లికతో ముడిబడి ఉన్నది. ఎక్కడ ఏ సంబంధం తప్పు, ఎందుకు తప్పు. ఎక్కడ ఏ సంబంధం ఒప్పు, ఎందుకు ఒప్పు అనేదానికి ప్రపంచమంతటా ఒకే నియమం, ఒకే పద్ధతి అంటూ లేదు. స్త్రీ పురుషుల లైంగిక సంబంధాలకు, లైంగిక ప్రేమలకు, వైవాహిక ఒప్పందాలకు పవిత్రతను ఆపాదించడం ఒక బూటకం. పవిత్ర అపవిత్రాలు అనేవి ఒక కట్టడికి చెందిన భావజాలమే. నిజానికి లోకంలో సెక్సువాలిటీకి సంబంధించి వావి వరుసలు, కుటుంబ సామాజిక బాంధవ్యాలు, గిరిగీయడాలూ, బరితెగించడాలూ, నిందలూ, నేరాలూ, పాపాలూ, శిక్షించడాలూ అన్నీ లోపభూయిష్టమైన సెక్సువల్ విధానాల వల్లనే పాటించబడుతున్నవి.

నిర్బంధపూరితమూ నియంతృత్వమయమూ అయిన లైంగిక సంబంధాలు సమాజంలో ఆరోగ్యకరమూ, శాస్త్రీయమూ అయిన మానవ సంబంధాలను ప్రతిబింబించలేవు. జెండర్ సంబంధాల్లో సంపూర్ణమైన ప్రజాస్వామీకరణ నేటి అవసరం. మూసల్నీ, నమూనాల్నీ చెదరగొట్టి నవీనమైన సహజ మానవ సంబంధాలు ప్రతిష్ఠించడం ప్రజాస్వామ్యం. జెండర్ సమానత్వంతో రాజకీయార్థిక లైంగిక కుల సంబంధాల్లో సమానత్వం సాధించవచ్చును. లైంగికావగాహనల్లో మార్పు వల్ల స్త్రీ పురుషుల ఉత్పత్తి పునరుత్పత్తి సంబంధాల్లో సమూలమైన మార్పు తేవచ్చును.

బంధాలను సంబంధాలను పవిత్రమనో, అపవిత్రమనో విభజించడం ఒక ముసుగు. ఉద్వేగ భావోద్వేగ ప్రేరణలను, లైంగిక స్పందనలను, దైహిక ప్రకోపాలను, శారీరక వాంఛలను, శృంగార కోరికలను జెండర్ ఆధిపత్యంలో, స్వార్థానికి అనుగుణంగా నీతి తంత్రాల్లో కుతంత్రించడం నేరం, అన్యాయం. ఈ కరుడుగట్టిన సెక్సువాలిటీ భావ పరంపరను బద్దలు గొట్టాల్సిన పని నేటి స్వేచ్ఛా ప్రియులదే. స్వేచ్ఛంటే సమయ సందర్భాలు, ఇష్టాయిష్టాలు లేని అసందర్భమూ, అనర్థకమూ అయిన విశృంఖలమైన నిస్సిగ్గుకరమైన సెక్సువల్ సంబంధాలు కాదు. అదిప్పుడు అమలులో ఉన్నదే. బలప్రదర్శన, అత్యాచారంతో కూడుకున్న విపరీతపు స్వేచ్ఛ ఒకరికి, క్రూర నిర్బంధం మరొకరికి ఎంతటి న్యాయం అనేది సెక్సువాలిటీ ప్రశ్న.

ఆస్తులను, సంపదలను అప్పంగించేందుకు ఏర్పర్చిన వివాహవ్యవస్థ అత్యంత పవిత్రమూ, అవశ్యమూ అయినదిగా నమ్మించారు. వ్యవస్థల స్థిరీకరణ పవిత్రీకరణలో స్త్రీల లైంగికత్వాన్ని తమ ఆధీన చట్రంలో బంధించడమే ప్రధాన ధ్యేయమైంది. పవిత్ర సాంస్కృతిక విలువల వ్యవస్థలన్నీ పురుషుల స్వేచ్ఛనూ విశృంఖలతనూ ఆవగింజంత నియంత్రించ లేక పోగా స్త్రీల శీల పవిత్రతకు ఇనుపకచ్చడాలను, భయాలను జోడించి అణిచివేతను తొడుగుగా ప్రయోగించింది. స్త్రీలను శీల చట్రాల్లో బంధించి లైంగిక భోగ్య సాధనాలుగా వారి మనోదేహాలపై ఆధిపత్యాన్ని చలాయించింది ధర్మ సమాజం. నీతి సూత్రాలూ, ధర్మ సూత్రాలూ, మత ప్రవచనాలూ, బోధలూ, విలువలూ అన్నీ స్త్రీ ప్రాకృతిక శక్తులనూ, వాంఛలను మూసల్లోకే, నమూనాల్లోకి కుదించి పబ్బం గడుపుకోవడంలో ఏ అవకాశాన్నీ వొదులుకోలేదు.

చేయవలసిన లైంగిక అఘాయిత్యాలన్నీ చేస్తూనే, స్త్రీని చంచల మనస్వినిగా, పాప భూయిష్టమైనదిగా, అపవిత్రమైనదిగా, కులటగా దూషిస్తూ హీనపర్చడంలో నిరంతర యంత్రంలా పనిచేస్తూనే ఉన్నది పితృ స్వామ్య సమాజం.

పుట్టుకతో పురుషులు ఉన్నతులనీ - స్త్రీలు అధములనీ
జన్మతా పురుషులు బలవంతులనీ - స్త్రీలు బలహీనులనీ
పురుషులు పోషించేవారూ - స్త్రీలు ఆధారితులనీ
పురుషులు వీరులూ, ధీరులూ - స్త్రీలు అబలలూ, బీరువులనీ
పురుషులు అనుభవించేవారూ, దైవ స్వరూపులూ - స్త్రీలు
అనుభవించబడే వారూ, అపవిత్రులూ, పాపహేతువులనీ ...

ఎన్ని దురాచారాలు, అబద్ధాలు, మూఢత్వాలు, దుష్టత్వాలు, కుట్రలు... అన్నీ అంతా స్త్రీ లైంగికత్వాన్ని ఇష్టారాజ్యంగా కొల్లగొట్టడానికే, శాడిస్టిక్ స్వభావాల్ని తృప్తి పర్చుకునేందుకే. అన్ని మోసాలు, అనాచారాలు, హింసలూ స్త్రీ లైంగికత్వం వైపే గురి పెట్టబడి ఉంటాయి. శరీరం ప్రధానంగా

లైంగిక స్పృహ కలిగినది. దాని చుట్టూ అల్లుకున్న ముళ్ళ తీగలు సంస్కృతి. ఆ సంస్కృతి ఒక దోపిడీ ఆయుధం. మనిషి ప్రాథమికంగా జంతువు. ఇది కోరలు కనిపించని రెండు కాళ్ళ విషపు మేధ కలిగివున్న క్రూర జంతువు. అందుకే ప్రపంచంలోని సమస్త జీవ జంతుజాలంపై ఆధిపత్యం సాధించాడు మనిషి. స్త్రీని సాటి ప్రాణిగా, మనిషిగా కాక లొంగదీసుకోవాల్సిన సాటి జంతువుగా భావిస్తుండటంలో మృగత్వమంతా బయట పడుతున్నది. అంటే జెండర్ విధానమే సెక్సువాలిటీకి ప్రాధాన్యతనూ, వివక్షతా పూరితమైన హోదాను ఆపాదించింది.

ఏ రెండు ప్రాణులైనా ఒకే స్థలంలో కొద్ది కాలం కలుసుండాల్సిన పరిస్థితి కలిగితే వాటి మధ్య సన్నిహితత్వం ఏర్పడటం ప్రాకృతిక సూత్రం. ఫ్రాయిడ్ లైంగికత గురించి చెప్పిన విభిన్న అంశాలు అంగీకరించే ధైర్యం ఉన్నా లేకపోయినా యదార్థమైనవే. ఈ సంబంధాలనే ''పవిత్ర'', ''అపవిత్ర'', ''శాస్త్రీయ'', ''అశాస్త్రీయ'' ఆమోదిత, అనామోదిత సంబంధాలుగా విడదీసి నిలబెట్టింది ఆధిపత్య ధర్మ సమాజం. స్త్రీలను శీల పరిధిలో పరిశీలించి శ్రమ - లైంగిక దోపిడీ చేస్తుందీ వ్యవస్థ. శీలవతి, గుణవతి, సౌందర్యవతీ అయిన స్త్రీ మగ సంతానాన్ని కని ఇవ్వడం ఒక కర్తవ్యంగా మారింది. స్త్రీ పాతివ్రత్యం, నిప్పులాంటి శీలం కలిగినదై ఏక భర్తా విధేయురాలై ఉండటం గూర్చి ప్రత్యేక శాసనాలు రాసిన సమాజం అనుమానించి శీలాన్ని అగ్ని పరీక్షకు కూడా నిర్దేశిస్తుంది. ఇది పురుషోత్తమపు ఉత్తమ చర్యగా కథలల్లారు. భర్త తదనంతరం స్త్రీలకు బతికే హక్కు లేదని ఆమె మరెవ్వరి సొత్తూ కారాదని, పాతివ్రత్యం భంగపడవద్దనీ చచ్చిన మగని కాష్ఠంపై బతికిన భార్యనేసి దహించి సతీ ధర్మమని ప్రకటించారు. సతి చావు పుణ్యకార్యమైంది. స్వర్గం చేరే మగని సేవలకు భార్యను చంపడం అవసరమైంది.

రోగిష్టివాడైనా, జారుడైనా, తాగుబోతైనా పతి సేవ పరమ పవిత్రపు పాతివ్రత్యపు కర్తవ్యమన్నారు. పతి పర స్త్రీని కోరితే ఆ సాంగత్యానికి స్త్రీ వినమ్రంగా భక్తిగా సహకరించాలన్నారు. అట్లా చేసిన స్త్రీలు పరమ సాధ్వీమణులుగా, పతివ్రతా శిరోమణులుగా పురాణ గాథల్లో కీర్తించబడ్డారు. స్త్రీలు సీత, సావిత్రి, అనసూయల రోల్ మోడల్స్‌గా ఉండాలని ఆధునిక శకంలోని అత్యధిక శాతం మనువు శిష్యులు కోరుకోవడం నేటికీ చూస్తూనే ఉన్నాం. మనువు ఒక రుషి మనువుకాదు. మను వొక వ్యవస్థ. ముక్కు పచ్చలారని బాలికల్ని పండు ముదసలి మొగుళ్లకు కన్యాదానం చేసిన నీచత్వం దౌర్జన్యం చూసిందే మనువాదపు అడుగుజాడల్లో.

అసలు స్త్రీ లైంగికత్వానికి ఇష్టాయిష్టాలు లేవు, హక్కులూ లేవు. స్త్రీ లైంగికత్వం మగని వంశం నిలబెట్టడానికి, లైంగిక సుఖాలు అందించడానికి, మగవారి పశు కామాన్ని తీర్చడానికే. పురోగమించిన, పురోగమిస్తున్న వివిధ దేశాల సమాజాల్లో స్త్రీ లైంగికతను ''వ్యాపారం'' చేసుకోవడం చూస్తున్నాం.

అందాల పోటీలు, అంగాంగ ప్రదర్శనలు ప్రపంచ ప్రఖ్యాత గౌరవనీయ ప్రక్రియలిప్పుడు. యంత్రనాగరికతతో దిన దినం నూతన సాంకేతిక ప్రగతితో సహవాసం చేస్తూకూడా ఆడవాళ్ళపై అత్యాచారాలూ, స్త్రీ శరీరం అమ్మకపు సరుకుగా అంగట్లో పెడ్తున్నది పెట్టుబడిదారీ మార్కెట్ కొనుగోలు వ్యవస్థ.

స్త్రీ శరీరం చుట్టూ విచిత్ర భావ జాలమే కాదు రాజకీయ భావజాలం కూడా కొండ చిలువలా చుట్టుకుని ఉంది. ఆ కొండ చిలువ పితృ స్వామ్య దురహంకారం. నేటి రాజకీయార్థిక శాస్త్రమంతా లైంగిక రాజకీయార్థిక శాస్త్రమంటే అదే.

వర్ణ వర్గ వ్యవస్థల్లో వర్ణాలూ వర్గాలూ కులాలననుసరించి స్త్రీ లైంగికత్వంపై పెత్తనాలూ... అత్యాచారాలు కొనసాగుతుంటాయి. ఒక్కో వర్గం స్త్రీని ఒక్కో విధంగా, ఒక్కో కులం స్త్రీని ఒక్కో విధంగా చూస్తుంది సమాజం. స్త్రీ లైంగికత్వం చుట్టూ ఎక్కువ తక్కువ వర్గహోదాలు కులం స్థాయిలు వ్యాపించి ఉంటాయి. అటు అగ్రకులం ఇటు నిమ్నకులం ఏ స్త్రీ అయినా అంటరానిదే. అయినా స్త్రీ శరీరం లైంగిక యంత్రమే. ఆత్మ న్యూన్యత, అతి స్వభావం సెక్సువల్ అజ్ఞానం వల్ల ఏర్పడుతాయి. నగ్న వికృతమీ సమాజ సంస్కృతి. ఉద్వేగ అనుభూతులను ఉదాత్తీకరించడానికి వ్యక్తీకరించడానికి భాష, సాధనం, మార్గం, స్వేచ్ఛ లేని వాళ్ళు సెక్సువాలిటీ పట్ల ఏ భావనా లేక స్వయం సాంస్కృతిక నిర్బంధంలో మగ్గుతుంటారు.

స్త్రీల విషయంలోనైతే యజమానులను ఎంచుకునేంత కొద్దిపాటి స్వేచ్ఛే తప్ప యజమాన్యం నుండి విముక్తమయ్యే అవకాశం లేదు. కళలకూ జ్ఞానానికీ (చదువుకు) స్త్రీలు అనర్హులు కాబట్టి ప్రాపంచిక వ్యక్తీకరణలు తెలియవు. సిగ్గుపడాలి, సింగారించుకోవాలి, ఆకర్షించాలి, అందాన్ని కాపాడుకోవాలి అంతా యజమాని పట్ల అంకిత భావంతోనే, యజమాని ఒదిలేస్తాడేమోనన్న భయంతోనే. మగవాడు ఏలేవాడు స్త్రీ ఏల బడేది. మగవాడు అధిపతి, రాజు, స్త్రీ భూమి, రాజ్యం, రాజ్య సంపద, సొంత ఆస్తి. స్త్రీ రసజ్ఞ పురుషుడు రసికుడు. స్త్రీ సెక్సువాలిటీ నిజానికి స్త్రీ ఇష్టం, సొంతం కాదు. అది మగవాని ఆస్తి. మగవాని సుఖ భోగ్యానికి వేదిక. ఇది బరిబత్తల సమాజం. ఇది వైకల్యపు సంస్కృతి. వక్ర నీతుల సమ్మేళనమీ ధర్మ వ్యవస్థ పరివర్తనం అవసరం లేకుంటే పతనమే.

> ఆడపిల్ల శిశ్నదశ (Phallic stage)లో ఉన్నప్పుడు, ఆమె యోని శీర్షం (Clitoris) ముఖ్య కామ కేంద్రం. కాని అది ఎప్పటికి అలాగే ఉండిపోదు. ఆ పిల్ల ఎదిగి స్త్రీగా మారేటప్పటికి ఆ యోని శీర్షం మొత్తంగా గాని, పాక్షికంగా గాని, దాని సున్నితత్వాన్ని, దాని ప్రాముఖ్యాన్ని యోనికి అందించాలి.
>
> \- ఫ్రాయిడ్

# పరపురుష సంపర్కం కలనైనా కరవాయె

- కె. ఎస్. మంగళ గౌరి

రచయిత్రి తమ వ్యాసాన్ని శీర్షిక లేకుండా పంపారు. శీర్షిక పెట్టవలసిన బాధ్యత నామీద పడింది. ఈ శీర్షికలో స్వప్నాల ప్రస్తావన ఉంది కాబట్టి, నేను నా నిద్రలో కావాల్సిన స్వప్నాన్ని తెప్పించుకొని, శీర్షికను సూచించమని అర్థించాను. పై శీర్షిక స్వప్నం సూచించిందే. కావలసిన స్వప్నం తెప్పించుకోవచ్చా? అవి సమస్యలకు పరిష్కారం చెబుతాయా? అనే ప్రశ్న చాల మందికి రావచ్చు. కావలసిన స్వప్నాలను తెప్పించుకొనే ఆచరణాత్మక విధానాన్ని అవి చెప్పే పరిష్కారాల గురించి నా ''స్వప్న సందేశం'' (కలలకు అర్థం చెప్పడం ఎలా?) అనే గ్రంథంలో వివరించాను. అయితే కలలు ఇచ్చే పరిష్కారాలు అన్ని సార్లు సరైనవి కాకపోవచ్చు.

ఈ వ్యాసంలో వితంతువు కన్న కలలో ముసుగు లేమీ లేవు. మామూలుగా కలలు మారు వేషాలలో వస్తాయి. ఇది లైంగిక కల. వితంతవు కలలో ఏదో ఆశించింది. కాని ఆమె కలలో గూడ ఆమె అంతరాత్మ (conscience) మేల్కొని కల సన్నివేశాన్ని మార్పించి, పురుషుని స్థానంలో బిగువైన స్త్రీని ఉంచి, స్వలింగ సంపర్కాన్ని ప్రతిపాదించిందనీ చెప్పవచ్చు. లేదా ఆ స్త్రీ తానే అయితే స్వరతిని ప్రతిపాదించిందనీ చెప్పవచ్చు.

లేడీ సెకియా ట్రిస్ట్ కలకు అర్థం 'స్వరతి'గా చెప్పారన్నారు. కలకు సంబంధించిన సన్నివేశాలకు వితంతువు జాగ్రదవస్థలో చేసే ప్రతిస్పందనల ఆధారంగా కలకు అర్థం చెప్పాలి. ఆ వివరాలు లేవు.

- సంపాదకుడు

మిసిమి సెక్సువాలిటీ మీద ప్రత్యేక సంచికను ప్రచురించ తలపెట్టిందని తెలిసి చాల ఆనందం వేసింది. ఈ విషయం మీద చర్చకు వచ్చే వివిధ విషయాలు కొంతమంది విజ్ఞుల దృష్టినయినా ఆకర్షించి ఆలోచనలను రేకెత్తిస్తుందని ఆశకలిగింది.

ఈ వ్యాసం వ్రాయటంలో మరో ప్రయోజనం కూడా నెరవేరుతుందనిపిస్తోంది. అది సమాజంలో విధవల స్థితికి సంబంధించింది. వీరి దీనస్థితి గురించి (గురజాడ వారి) వీరేశలింగ పంతులు గారి కాలం నుంచి ఆలోచించినా సాంఘికమైన పరిష్కారమే తప్ప శాస్త్రీయమైన అవగాహన అవసరమనే ఊహమనకు కలగలేదనిపిస్తుంది. ఇన్నేళ్ళ తరువాత ఆ కోణంలో ఆలోచించాల్సిన అవసరం అర్థమవుతోంది.

'ఆహార నిద్ర భయమైథునాదులు' మానవులందరికీ అవసరమైనవి.

సెక్స్ ఒక అందమైన కళ. అందరికీ అవసరమైనది, శారీరక, మానసిక ఆనందాలను కలిగించేది. ముఖ్యంగా Preservation of species కు అవసరమైన Biological need.

---

కె.ఎస్. మంగళగౌరి, ఎ.పి. స్టడీ సర్కిల్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు, హైదరాబాదు.

యుక్తవయసుకు వచ్చిన యువతీ యువకులు పరస్పరం చూసుకున్న వెంటనే సెక్స్ స్పందనలు కలగడటం Biologicalగా సహజం. చెప్పుకోవడానికి కొద్దిగా ఇబ్బందిగా అనిపించినా మధ్య వయస్కులలో కూడా స్త్రీ పురుషులలో పరస్పరం ఆకర్షణ, సెక్స్ ప్రేరణలు కలగడం లేక పోలేదు. వివాహమనే సామాజిక రక్షణ భద్రతా వలయంలో ఉండటం వల్ల వారు బయటపడరు అంతే! తల్లి, అక్క, చెల్లెలు లాంటి వరసల మధ్య తప్ప స్త్రీ పురుషుల మధ్య సెక్స్ భావన ఏదో ఒక దశలో ఎంతో కొంత కలిగితే! పరిస్థితులు అనుకూలిస్తే అది మరి కొంత ముందుకి సాగవచ్చుకూడా! లేక పోతే తాత్కాలిక స్పందనలతో ఆగి పోతుంది.

ఇదంతా మానవ జీవితంలో సెక్స్ ఆనందం సాంద్రత, తీవ్రత, సార్వజనీనత చెప్పడం కోసమే! ముఖ్యంగా చెప్పదలచుకున్నది కొద్దిగా సెక్స్ ఆనందాన్ని అనుభవించి భర్తను కోల్పోవడం వల్ల సెక్స్ ఆనందానికి దూరమైన అభాగినుల గురించి. వారికి సెక్స్ జీవితమంటే తెలుసు. కాని అనుభవించే అర్హత (సామాజికంగా) కోల్పోతారు.

సెక్స్‌కి సంబంధించిన సర్వే Sex భావన స్త్రీ పురుషులిద్దరికీ సమానంగానే ఉంటుందని తెలుపుతున్నాయి. కాని భారత దేశంలో సెక్స్ విషయంలో స్త్రీకి (అవివాహిత, విడో) సమాజపరంగా విపరీతమైన ఆంక్షలు ఉన్నాయి. భర్త లేకపోతే ఆమెకు కోరికలు ఉండ కూడదు. ఉన్నా చంపేసుకోవాలి.

మన దేశంలో ఉన్న మరో దయనీయమైన స్థితి స్త్రీకి సెక్సు పట్ల అవగాహన అంతగా ఉండదు. చిన్నప్పటి నుంచి తల్లి దండ్రులు ఆమెనలా పెంచుతారు. స్త్రీ సెక్సు గురించి మాట్లాడితే బూతు. పురుషుడు మాట్లాడితే రసికత. ఒక విధంగా ప్రకృతి కూడా స్త్రీ విషయంలో కొంత అన్యాయం చేసిందనిపిస్తుంది. శరీర నిర్మాణ రీత్యా స్వయం తృప్తి మార్గాలు (పురుషుడికి అనుసరణీయమైనంత సులభంగా) స్త్రీకి అనుసరణీయం కావనిపిస్తుంది.

స్వయం తృప్తి మార్గాల గురించి ప్రస్తావించడానికి కారణం ఇటీవల 'సెక్స్ అండ్ మెంటల్ హెల్త్' అనే అంశం మీద జరిగిన సెమినార్‌లో ఒక విడో తనకు వచ్చిన కలను చెప్పడం, దానిని ఒక స్త్రీ మనో వైజ్ఞానిక వేత్త వివరించిన తీరు రచయిత్రికి కొత్తగా అనిపించడమే!

వితంతువులైనంత మాత్రాన సెక్స్ కోరికలు అణగిపోవనేది అందరికీ తెలిసిన విషయమే! అయితే ఆమెకు పునర్ వివాహం చేయడం వల్లనేని లేదా నచ్చిన పురుషుడితో కోరిక తీర్చు కోవడం వల్ల కాని సమస్య పరిష్కారం అవుతుందనుకుంటాం. కాని అది అన్ని సమయాల్లో సాధ్యం కాదనీ పైగా మరిన్ని సమస్యలు రాగలవని తేలింది.

సెమినార్‌లో ఆమె చెప్పిన కల

ఆమె ఒక విడో! కానీ జీవితం మీద ఆశ శారీరక వాంఛలు పుష్కలంగా ఉన్నాయి. ధైర్యం పాలు ఎక్కువే! అందుకునే పక్కింటి అతనంటే కించిత్ మమకారం పెంచుకోవడం ప్రారంభమైంది. ఆవిడకి

ఒక రోజు ఈ కల వచ్చింది. (మనిషి అచేతనలోని భావాలు కలల రూపంలో బహిర్గత మవుతాయనేది మనకి తెలిసిందే!) ఇంతకీ ఆ కల :

ఆమె చక్కగా స్నానం చేసి అలంకరించుకొని ఎవరి కోసమో ఎదురు చూస్తోంది.

ఇంతలో పక్క ఇంటికి ఆమెకు చాలా ఇష్టమైన వ్యక్తి వచ్చాడు. ఆమె కిటికీలోంచి గమనిస్తుంది.

అతడు బట్టలు మార్చుకుని లుంగీ చుట్టుకుని, ముడివేసుకోకుండా పడుకున్నాడు.

ఇంతలో ఎవరో అతనికి గ్లాసుతో మంచి నీళ్ళు తెచ్చిచ్చారు.

అతను తాగుతూ ఉంటే కాళ్ళ వైపు (నుంచి) లుంగీ పైకి జరుగుతూ ఉంది.

ఈమె ఉత్సుకతతో, ఆసక్తితో చూస్తూ ఉంది. తీరా ఈమె కోరుకున్నట్లు చూడబోయే సమయానికి సన్నివేశం (కలలో) మారిపోయింది.

అతని స్థానంలో మంచి బిగువైన స్త్రీ ఈమె చేయిపట్టుకుని ''నీకు ఆనందం కావాలంటే నేను చెపుతానులే! మావారు ఊరిలో లేపుడు నేనలాగే ఆనందం పొందుతాను'' అందిట. ఇదీ కల సారాంశం.

దీనికి ఆ స్త్రీ మనో వైజ్ఞానిక వేత్త ఇచ్చిన వివరణ భారత దేశంలో 90% మంది స్త్రీలకు భర్తతో తప్ప పరపురుషులతో సెక్స్ జీవితం గడప కూడదనే 'ఆంక్ష' ఉంటుంది. కలలో ఆ స్త్రీ తనకు నచ్చిన పురుషుడిని చూడ బోయే సమయానికి స్వలింగ సంపర్కాన్ని సూచించే సన్నివేశం కనపడటానికి కారణం అదేనని అన్నారు. అంతే కాదు. తాత్కాలిక ఆవేశంలో సెక్స్ ఆనందాన్ని పొందినా తరువాత అపరాధ భావన వల్ల యాంగ్జయిటీ లాంటి అపసవ్యత కలగవచ్చనీ చెప్పారు.

**కలలలో కూడ పరపురుషుడితో సెక్స్ ఆనందాన్ని పొందలేనంత భయావహమైన రీతిలో దయనీయమైన స్థితిలో భారతీయ మహిళ ఉంది.**

కోరికలు శరీరాన్ని దహించి వేస్తున్నా భర్తతో తప్ప మరెవరితోను సెక్స్ సుఖం పొందకూడదని భారతీయ మహిళ మనసు మలచబడింది. సామాజిక వేత్తలు, మనో వైజ్ఞానిక వేత్తలు కలిసి దీనికి మార్గాంతరం ఆలోచించాల్సిందే.

సెక్స్‌లో అసంతృప్తు రాలైన భార్య ఎంతకు తెగించగలదో, అదేవిధంగా, సెక్స్ ఆనందాన్ని పరిపూర్ణంగా అందించిన పురుషుడి కోసం స్త్రీ ఎంతటి త్యాగాన్ని చెయ్యగలదో చెప్పడానికి చలం 'మైదానం'లోని రాజేశ్వరి చక్కటి ఉదాహరణ.

భార్య కౌగలించుకుంటే భయంతోనో, కోరికతోనే తెలీని భర్తని వదిలివేసి అతనిక్లయింట్‌తో వెళ్ళి పోయింది రాజేశ్వరి. అమీర్ రాజేశ్వరిలు మైదానంలో సెక్స్ సుఖం అంచులు అందుకున్నారు. తనకా సుఖాన్ని అందించాడు కాబట్టే అమీర్ మరొక స్త్రీని కోరినప్పుడు అంగీకరించింది. తను

పొందిన సెక్స్ సుఖం మరొక స్త్రీ పొందే అవకాశం కలిగించింది. తన కన్నా చిన్నవాడు తనను కామదృష్టితో చూసినప్పుడు సుముఖత చూపుతుంది. ఇది 'మైదానం' నవలలో నాకు స్ఫురించిన ఒక కోణం మాత్రమే. అలా అని సెక్స్ సుఖం విచ్చలవిడిగా ఎవరితో పడితో వారితో ఎలా పడితేలా పొందవచ్చా అని కాదు, సంపూర్ణమైన 'సెక్స్' సుఖం పొందే స్త్రీలు చాల అరుదు కాబట్టి స్త్రీ సెక్స్ పరంగా తనను సంతృప్తి పరచిన పురుషుడిని ఎంతగా ఆరాధించ గలదనేదే!

స్త్రీ సెక్స్ సుఖం అన్నపుడు జ్ఞాపకానికి వచ్చే మరో ముఖ్య విషయం స్త్రీలో 'భావ ప్రాప్తి' ''స్త్రీ శరీర తత్వరీత్యా ఆమెలోని కామం మెల్లగా ప్రవహించే సెలయేరు వంటిది. పురుషుడిలోని కామం ఎగసిపడే సముద్రం వంటిదీ - అన్నాడు వాత్స్యాయనుడు. స్త్రీలో కామ వాంఛ మొదలైనా ఆమె సంభోగంలో పాల్గొని రసోద్రేకత కలగడానికి కొంత సమయం పడుతుంది. అంటే ఆమె మనసులో కదలాడే ఊహలకన్నా శరీర స్పర్శలే స్త్రీలోని కామోద్రేకతను అధికం చేస్తాయి. పురుషుడి స్థితి ఇందుకు భిన్నమైనది. ఇటువంటి పరిస్థితుల్లో సంపూర్ణమైన భావ ప్రాప్తి పొందుతున్న స్త్రీలు ఎంత మంది ఉన్నారు? అసలు భావ ప్రాప్తి అనేది వీరికి తెలుసా అనేది కూడా ప్రశ్నార్థకమే! ఎందుకంటే మన దేశంలో చాలా మంది స్త్రీలు మొదటి రాత్రి మాత్రమే సెక్సు విద్యకు ఓనమాలు దిద్దుతారు.

(ఆధునిక లైంగిక శాస్త్రజ్ఞులు 'మాస్టర్స్ అండ్ జాన్సన్స్ స్త్రీ 'భావప్రాప్తికి' పురుషుడు అనుసరించాల్సిన మార్గం గురించి చెప్పారంటే - దానికి సంబంధించిన అవగాహన అవసరమేననే కదా! )

చివరగా చెప్పుకుంటున్నా ముందుగా ఆలోచించాల్సింది సెక్స్‌లో స్త్రీ పురుషులు ముఖ్యంగా పురుషులు అవలంబించాల్సిన పద్ధతి. దీని గురించి రాస్తుంటే నేను ఏడో తరగతి చదువుతున్నప్పటి విషయం జ్ఞాపకం వస్తోంది. మా ఫ్రెండ్ భారతి అనే అమ్మాయికి పెళ్ళయింది. మేమంతా చాలా బాగా సరదాగా గడిపాం. రెండు రోజుల తరువాత చుట్టాల సందడి తగ్గుతుందనీ చక్కగా కబుర్లు చెప్పుకోవచ్చు మరీ మరీ రమ్మనీ మాతో అంది. తీరా మర్నాడే తనని ''పెదవి సెప్టిక్ అయిందనీ హాస్పిటల్‌లో చేర్చారనీ' కబరు వచ్చింది.

'ధంతక్షతం' కావాల్సినది ఆ అమ్మాయికి గాయ క్షేత్రం అయింది. సంభోగంలో స్త్రీని ఎంతగా హింసిస్తే అంత ఆనందం అనుకోవడం భ్రమే! ఇక్కడ మాట్లాడుతున్నది సెక్స్‌లో హింస గురించి కాదు. హింసించడమే సెక్స్ సామర్థ్యానికి పరాకాష్ఠ అనుకోవడం గురించి.

పరస్పర అవగాహన, కంపాటబిలిటి ఉన్నా సెక్స్ జీవితం, మనసుకి, మనిషికి ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని ఇస్తుంది. మనం 'తెలుసు' అనుకున్న వాటిలోనే తెలియని ఎన్నో కోణాలుంటాయి. వాటినన్నింటినీ యథావకాశంగా తెలుసుకుంటూ అనుగుణమైన మార్పులను చేర్పులను చేసుకుంటూ జీవితాన్ని ఫలవంతం చేసుకోవడమే మనం చేసుకోవాల్సిన పని. (సెక్స్ జీవితం, అందులో ముఖ్యమైనది). అలాంటి వాటికి ఉపకరించేదే ఇలాంటి వ్యాస పరం పరలు ప్రత్యేక సంచికలు.

# రుచి చూడని వారున్నారా ?

- బి. భాగ్య

మానవ వృత్తిని - ప్రవృత్తిని శాసించేది - నిర్దేశించేది సెక్స్

అందాన్ని ఆనందాన్ని సంతోషాన్ని కలిగించేది సెక్స్

నడిచేది నడిపింప జేసేది సెక్స్

మనిషిని - మనసుని వికసింప జేసేది పరిమళింప జేసేది సెక్స్

సృజనాత్మక శక్తిని పెంచేది సెక్స్

అణచివేతను అధిగమింప జేసేది సెక్స్

శరీరాన్ని, మనసుని అందంగా వుంచేది సెక్స్

కులమతాల పొరలను తొలగించగలిగేది సెక్స్

మనిషిని మనిషిగా ఆకర్షించేది - రంజింప జేసేది సెక్స్

సాంప్రదాయలను - కట్టుబాట్లను తెంచగలిగేది సెక్స్

వావి వరుసలను చూడలేనిది సెక్స్

పేదరికాన్ని మరపింప జేసేది సెక్స్

ప్రాణాలను సహితం పణంగా పెట్టి జరిపే క్రియ సెక్స్

మల్లె పూల సువాసనతో మోహింప జేసేది సెక్స్

కళ్లతో తెలియ జెప్పగలిగేది సెక్స్

నోటితో చెప్పలేనిది దేహంతో చేయగలిగేది సెక్స్

రచనలో పెట్టలేనిది రసవత్తరంగా సాగేది సెక్స్

తెలివి తేటలతో సంభందం లేకుండ్రా కలిగేది సెక్స్

పేద ధనిక తేడా లేకుండా మనుషులను కలిపేది సెక్స్

సౌకర్యాలు కోరనిది సెక్స్

స్థల కాలంతో నిమిత్తం లేక అందరికి అన్ని వేళలా అవసరమైంది సెక్స్

ప్రకృతిలో ప్రాణి కోటికంతటికీ అవసరమైంది సెక్స్

Post phone చేయడానికి వీలులేంది సెక్స్

---

బి. భాగ్య, యంగ్ ఇండియా ప్రాజెక్ట్‌లో పని చేస్తున్నారు. శ్రీకాళహస్తి.

చేస్తే జరిగేదాకా ఇతర పనిని చేయించనిది సెక్స్

మేధావులలో దాగున్న రహస్యం సెక్స్ జీవితం స్వేచ్ఛగా అనుభవించడమే!

మానవుల్లో భయాన్ని అధిగమింప జేసేది సెక్స్

ఆత్మహత్యలను చేయించగలిగేది - ఆపగలిగేది సెక్స్

ప్రాణాలను త్యజించగలిగేది - అర్పించగలిగేది సెక్స్

ప్రకృతిలో ప్రతి వస్తువుతో పోల్చుకొని ఊహించగలిగేది సెక్స్

అన్ని రుతువులకు అనువైంది సెక్స్

యావన్మందికీ అత్యంత ప్రీతి పాత్రమైంది సెక్స్

అగాధానికి నెట్టేది - ఆకాశానికి ఎత్తేది సెక్స్

కోరిక తీరలేదంటే కళ్లు ప్రకృతిని చూడకుండా అంధత్వంలోకి వెళతాయ్

చెవులు ఏ రాగాన్ని విననని వినికిడి లోపాన్ని సూచిస్తాయ్

నోరు మౌనవ్రతం పాటిస్తుంది.

శరీరం ఏ పని చేయనని మొరాయిస్తుంది.

హేతువాదానికి అంతుబట్టనిది సెక్స్

న్యాయాన్యాయాలతో పనిలేదనేది సెక్స్

ఎవరికీ కనిపించని సౌందర్యాన్ని చూడగలిగేది సెక్స్

క్యాపిటలిజం -కమ్యూనిజం - మావోయిజం - మార్క్సిజం యిలా అన్నియిజాల వారికి అవసరమైంది. అన్నియిజాలను నడిపించేది సెక్స్

హిందూ - ముస్లిం - క్రిష్టియన్ అన్ని మతాలను కలుపగలిగేది సెక్స్

మానవత్వాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్ళ గలిగేది సెక్స్

ప్రకృతిలో యింత అందమైన - అవసరమైన సెక్స్‌ను అణచడం వల్లనే మానవ జాతికి లెక్కించడానికి వీలుకాని శారీరక - మానసిక రుగ్మతలున్నాయ్.

అపారమేధో సంపద దాగుడు మూత లాడుతోంది.

ఆకాశంలో అవనిలో సగమంటున్న స్త్రీ జాతి సృజనాత్మక శక్తి చంపివేయబడుతోంది.

"Published with Financial Assistance from the Central Institute of Indian Languages, (Ministry of Human Resource Development, Dept. of Secondary and Higher Education, Govt. of India) Manasagangotri, Mysore - 570 006 vide sanction Letter No. F. 53-1/2001-2002/LM/GRNT dated 19th March, 2002 under the scheme of Grant-in-Aid L.M."



" ఎయిడ్స్ మృత్యువు ఆలింగనం "

**- వి.బి. ఆచార్యులు,**

సత్రంపాడు, ఏలూరు.

MISIMI/మిసిమి RNI Regd. No. 45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd. No. H/SD/191.



"నాకు నేను జన్మనిచ్చుకొంటున్నాను"